బుధవారం
12-3-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 170
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కుర్దులతో సిరియా శాంతి ఒప్పందం

డమాస్కస్: అంతర్యుద్ధం వేళ సిరియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈశాన్య సిరియాను నియంత్రించే కుర్దిష్ అధికారులతో ఆపద్ధర్మ ప్రభుత్వం ఒక ఒప్పందం కుదుర్చుకున్నది. కాల్పుల విరమణతో పాటు అమెరికా మద్దతుగల దళాలను తమ సైన్యంలోకి విలీనం చేసేలా ఈ ఒప్పందం జరిగింది. దీంతో సిరియాలోని అత్యధిక భూభాగం ఆపద్ధర్మ ప్రభుత్వం నియంత్రణలోకి వెళ్లనుంది. ఈ ఒప్పందంపై తాత్కాలిక అధినేత అహ్మద్ అల్-షరారా, అమెరికా మద్దతుగల కుర్దిష్ నేతృత్వంలోని సిరియన్ డెమొక్రటిక్ ఫోర్సెస్ కమాండ్ మజ్లౌమ్ అబ్ది సంతకాలు చేశారు. ఏడాది చివరికి ఈ ఒప్పందం అమలు కానుంది. తద్వారా ఇరాక్, టర్కీతో పాటు అన్ని సరిహద్దులు, ఈశాన్య ప్రాంతంలోని విమానాశ్రయాలు, చమురు క్షేత్రాలు షరారా నియంత్రణలోకి వెళతాయి.

మోదీ 'పరీక్ష పే చర్చ'కు రూ.64 కోట్లు

భారీగా ప్రజాధనం దుర్వినియోగం

న్యూదిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ ఏడాదిలో ఒకసారి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులతో నిర్వహించే 'పరీక్ష పే చర్చ' కోసం 2020 నుంచి ఇప్పటివరకు రూ.64.38 కోట్లు ఖర్చు చేశారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ తెలిపింది. లోక్‌సభలో ఎంపీలు మాలా రాయ్, మాణిక్యం ఠాకూర్ అడిగిన ప్రశ్నలకు 2020లో రూ.5.69 కోట్లు, 2021లో రూ.6 కోట్లు, 2022లో రూ.8.16 కోట్లు, 2023లో ఏకంగా రూ.27.70 కోట్లు ఖర్చు పెట్టినట్లు విద్యాశాఖ వెల్లడించింది. అయితే 2024లో వ్యయాన్ని కాస్త తగ్గించి రూ.16.83 కోట్లు వెచ్చించామని తెలిపింది. 2023కి ముందు వరకు జరిగిన ఖర్చుతో పోల్చితే తర్వాత అమాంతం పెరిగింది. పరీక్ష పే చర్చ సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించడంతో వ్యయం పెరిగిందని మంత్రిత్వశాఖ చెప్పుకొచ్చింది. కాగా, నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ (ఎన్‌టీఎస్‌సీ) అప్‌గ్రేడ్ చేయడంపై రాయ్, ఠాకూర్ ప్రశ్నలకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి సమాధానం ఇచ్చారు.

ఈ పథకం డిజైన్, అమలులో అనేక పరిమితులు ఉన్నట్లు తమకు నివేదికలు అందాయని చెప్పారు. ఈ పథకాన్ని జాతీయ విద్యా విధానంతో అనుసంధానం చేసే దిశగా కసరత్తు

- మిగతా 2 లో

పాక్‌లో రైలు హైజాక్

- 20 మంది సైనికుల కాల్చివేత... బందీగా 200 మంది?
- సైన్యం వస్తే అందరినీ చంపేస్తాం: బలూచ్ లిబరేషన్ ఆర్మీ

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో వేర్పాటువాదులు రెచ్చిపోయారు. ఎక్స్‌ప్రెస్ రైలును హైజాక్ చేశారు. 20 మంది సైనికులను చంపేశారు. దాదాపు 200 మంది ప్రయాణికులను బందీలుగా చేసుకున్నారు. భద్రతా దళాలు వెంటనే అక్కడ నుంచి వెళ్లకపోతే బందీలందరినీ చంపేస్తామంటూ హెచ్చరించారు. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లోని క్వెట్టా నుంచి ఖైబర్ ఫక్తుంఖ్వా ప్రావిన్స్‌లోని పెషావర్‌కు వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్ కావడం సంచలనంగా మారింది. 500 మంది ప్రయాణికులతో వెళుతున్న రైలును సాయుధులు ఓ సొరంగం వద్ద ఆపేశారు. ఈ ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడినట్లు స్థానిక అధికారులు, పోలీసులు, రైల్వే అధికారులు తెలిపారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేసినట్లు బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) స్వయంగా ప్రకటించింది. 'జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును హైజాక్ చేశాం. 20 మంది సైనికులను చంపేశాం. ఓ డ్రోన్‌ను కూల్చివేశాం. ఆర్మీ,

- మిగతా 2 లో

కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్

న్యూదిల్లీ: దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ న్యాయ ఉచ్చుల్లో పడ్డారు. మద్యం కుంభకోణం కేసులో బెయిల్‌పై ఉన్న ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదుకు దిల్లీ కోర్టు తాజాగా ఆదేశాలిచ్చింది. ద్వారకాలో పెద్ద హోర్డింగులు ఏర్పాటు చేయడం కోసం ప్రజాధనాన్ని కేజ్రీవాల్ దుర్వినియోగం చేసినట్లు కేసు నమోదైంది. ఈ కేసులో మరో ఇద్దరు నేతలు గులాబ్ సింగ్, నికితా శర నిందితులుగా ఉన్నారు. సంబంధిత పిటిషన్లు రౌస్ అవెన్యూ కోర్టు అదనపు ప్రధాన న్యాయమూర్తి నేహా మిత్తల్ ఎదుట విచారణకు రాగా... ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆమె ఆదేశించారు. ఈనెల 18లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని అన్నారు. వాస్తవానికి ఈ

- మిగతా 2 లో

బడ్జెట్ భేటీకి వేళాయె

- నేడు గవర్నర్ ప్రసంగం
- 19 లేదా 20న వార్షిక పద్దు?
- అసెంబ్లీ సమావేశాలకు గులాబీ బాస్

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు వేళైంది. బుధవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఈ నేపథ్యంలో.. నిరసనలు, ర్యాలీలు, ధర్నాలకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఇక ఈ నెల 19 లేదా 20న ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈసారి అసెంబ్లీ సమావేశాల్లో కీలక అంశాలు చర్చకు రానున్నాయి. ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను సభలో ప్రవేశపెట్టనున్నారు. ఇటీవలే జరిగిన కేబినెట్ భేటీలో ఈ నిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు. డిలిమిటేషన్ ప్రక్రియపై తీర్మానం చేసే అవకాశం ఉంది. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీకి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ విషయంపైనా సభలో చర్చించే అవకాశం ఉంది. అసెంబ్లీ దగ్గర మూడంచెల భద్రత ఏర్పాటు చేయనున్నారు. నిరసనలు, ర్యాలీలు, ధర్నాలకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఆ తర్వాత అసెంబ్లీ వాయిదా పడే అవకాశం ఉంది. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఈ నెల 19 లేదా 20న వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. ఇప్పటికే అన్ని శాఖల ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సమావేశాలు నిర్వహించారు. ఆయా శాఖలకు నిధుల కేటాయింపుపై ప్రతిపాదనలు సమర్పించారు. ఈసారి తెలంగాణ బడ్జెట్ 3 లక్షల 20 వేల కోట్లు ఉండే అవకాశం ఉంది. దీనిపై అధికారులు తుది కసరత్తు చేస్తున్నారు.

మద్యం ఆదాయంపై ఆశలు

గతేడాది మద్యం అమ్మకాలపై ప్రభుత్వానికి భారీగా ఆదాయం వచ్చింది. దాదాపు రూ.40 వేల కోట్ల వరకు ఒక్క మద్యంపైనే ఆదాయం వచ్చింది. ఈసారి అంతకు మించి ఆదాయాన్ని రాబట్టాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.60 వేల కోట్లు ఆదాయం మద్యం ద్వారా రాబట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇటీవల ఎక్సైజ్ శాఖపై సమీక్ష నిర్వహించిన ఆ శాఖ మంత్రి.. ఆదాయమార్గాల పెంపుపై అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది.

అసెంబ్లీకి కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి రానున్నారు. ఈ సారి బడ్జెట్ సమావేశాలకు కేసీఆర్ హాజరుకాబోతున్నట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయాక.. కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు రెండు సార్లు మాత్రమే హాజరయ్యారు. తన ప్రమాణ స్వీకారం రోజున ఒకసారి.. ఆ తర్వాత బడ్జెట్ సమావేశాల సందర్భంగా రెండోసారి మాత్రమే సభకు వచ్చారు. ఆ తర్వాత కేసీఆర్ అసెంబ్లీకి రాలేదు.. అప్పట్లో కేసీఆర్ శాసనసభకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు విమర్శించినా కేసీఆర్ పట్టించుకోలేదు. దాంతో ఇదే అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి అనేక వేదికలపై

- మిగతా 2 లో

పేదలకు మేలు చేసే బడ్జెట్ కావాలి

ప్రధాన సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తా

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో-కొత్తగూడెం: ప్రజా ప్రభుత్వంగా మనుగడ సాధిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సామాన్య, మధ్యతరగతి వర్గాలకు మేలుచేసే బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా అయన మాట్లాడుతూ ఆర్థికశాఖమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు కొత్తగూడెం నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉందన్నారు. నియోజకవర్గానికి కావాల్సిన కేటాయింపులపై ఇప్పటికే తాను లేఖలు అందించానని వివరించారు. సాగు, తాగునీటి ప్రాజెక్టులు, సీతారామ ప్రాజెక్టు తోపాటు సింగరేణి గనులు, కేటీపీఎస్ తదితర ప్రాజెక్టులకు ప్రోత్సాహం అందిస్తారని ఆశిస్తున్నట్లు కూనంనేని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టాక పూర్తిగా పరిశీలించిన అనంతరం తన స్పష్టమైన అభిప్రాయాన్ని సమావేశాల్లో ప్రస్తావిస్తానని తెలిపారు. కేంద్రంలోని మోదీ సర్కారు బడ్జెట్‌లో పేదలు, సామాన్య ప్రజల సమస్యల్ని పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించినట్లు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అలా కాకుండా ప్రాధాన్యత క్రమంలో అన్ని ముఖ్య అంశాలను దృష్టిలో పెట్టుకొని విమర్శలకు తావు లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టాలని కోరారు.

రెండు ఉగ్ర సంస్థలపై కేంద్రం నిషేధం

న్యూదిల్లీ: జమ్మూకశ్మీర్ కేంద్రంగా పనిచేస్తోన్న రెండు సంస్థలపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం - 1967 ప్రకారం అవామీ యాక్షన్ కమిటీ, జమ్మూకశ్మీర్ ఇత్తిహాదుల్ ముస్లిమీన్ గ్రూపులను ఐదేళ్ల పాటు నిషేధిత సంస్థలుగా ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ రెండు వేర్వేరు నోటిఫికేషన్లు విడుదల చేసింది. అవామీ యాక్షన్ కమిటీ (ఏఏసీ)కి ఉమర్ ఫరూక్ నేతృత్వం

- మిగతా 2 లో

ధర్మేంద్ర ప్రధాన్‌పై సభా హక్కుల నోటీసు

న్యూదిల్లీ: తమిళుల మనోభావాలు దెబ్బతీశారంటూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై మండిపడుతున్న డీఎంకే... లోక్‌సభలో ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రతిపాదించింది. ధర్మేంద్ర ప్రధాన్ అవాస్తవాలు మాట్లాడటం ద్వారా చట్టసభను తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ డీఎంకే ఎంపీ కనిమొళి తీర్మానం ప్రవేశపెట్టారు. 'తమిళనాడు ప్రజలు అనాగరికులు అంటూ ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలను నేను తీవ్రంగా ఖండిస్తున్నా. ఆయన తక్షణమే క్షమాపణలు చెప్పాలని డీఎంకే, 8 కోట్ల మంది

- మిగతా 2 లో

మే 15 నుంచి తిరుపతిలో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు

తిరుమలై రామన్ వెల్లడి

విశాలాంధ్ర-తిరుపతి: ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను మే 15 నుంచి మూడు రోజుల పాటు తిరుపతిలో నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ తెలిపారు. తిరుపతిలోని గంధమనేని శివయ్య భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుమలై మాట్లాడుతూ మూడు రోజులు నిర్వహించే జాతీయ మహాసభలకు ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, ఉద్యోగ కల్పన చేయలేకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు కేంద్రం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చదువుకున్న ప్రతి యువతకు ఏదో రూపంలో ఉద్యోగం, ఉపాధి కల్పించాలని, లేనిపక్షంలో అర్హత ఆధారంగా రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు భృతి కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని ప్రతిపాదించారు. ఆ మేరకు జాతీయ మహాసభల్లో తీర్మానం ప్రవేశపెట్టి ప్రభుత్వాలపై పోరాటం చేస్తామని తిరుమలై రామన్

- మిగతా 2 లో

బీజేపీ కపట రాజకీయం

- భారత ఆత్మగౌరవాన్ని తాకట్టుపెడతారా?
- అమెరికాకు భారత్ తలొగ్గడం శోచనీయం
- అదానీకి మేలు చేయడమే మోదీ ధ్యేయం

విశాలాంధ్ర-తిరుపతి: భారతదేశ ఆత్మగౌరవాన్ని కేంద్ర ప్రభుత్వం అమెరికాకు తాకట్టుపెట్టే చర్యలు చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మండిపడ్డారు. మంగళవారం తిరుపతిలోని గంధమనేని శివయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం అమెరికాపై 29 ట్రిలియన్ డాలర్ల అప్పు ఉందని... వాటి నుంచి బయటపడేందుకు అధ్యక్షుడు ట్రంప్... ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్యపరంగా షరతులు, ఆంక్షలు విధిస్తున్నారన్నారు. మరోవైపు ఇల్లీగల్ ఇమిగ్రేషన్ పేరిట విదేశీయులను దేశ బహిష్కరణ గావిస్తూ...పొరుగు దేశాల ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినట్లు చెప్పారు. అలాంటి దుశ్చర్యలకు భారత ప్రభుత్వం మద్దతు పలకడం సబబుకాదన్నారు. ఎలన్ మస్క్ అమెరికాను కంట్రోల్ చేస్తుండగా.. భారత్‌ను అదానీ కంట్రోల్ చేస్తున్నాడని, ఆయనకు బీజేపీ శాయశక్తులా సహకారమందిస్తోందని దుయ్యబట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో లంచం అందించినందుకు ఆదానీపై న్యూయార్క్ కోర్టు కేసు నమోదు చేయగా... మస్క్ తో మాట్లాడి అక్కడి ఇన్వెస్టిగేషన్ ఏజన్సీని రద్దు చేయించే దుర్మార్గపు చర్యలకు పాల్పడ్డారన్నారు. అప్పట్లో కుదిరిన విద్యుత్ ఒప్పందంతో దాదాపు 20ఏళ్లపాటు రూ.2 లక్షల కోట్లు ఆదానీకి లాభం చేకూర్చడమే అవుతుందన్నారు. ఆ భారం ఆంధ్రప్రజల మీద పడనుందని అభిప్రాయపడ్డారు. చైనాతో సహా, యూరప్ దేశాలన్నీ

- మిగతా 2 లో

గ్రూప్-2 ఫలితాలు వచ్చేశాయ్

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 2 పరీక్షా ఫలితాలను ప్రకటించింది. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేశారు. గతేడాది డిసెంబర్ 15,16 వ తేదీల్లో 783 గ్రూప్ 2 పోస్టుల భర్తీకోసం నిర్వహించిన పరీక్షా ఫలితాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తుది కీ, ఓఎంఆర్, మాస్టర్ క్వశ్చన్ పేపర్లతో పాటు జనరల్ ర్యాంకింగ్‌ను కింద ఇచ్చిన లింక్‌ని www.tspsc.gov.in ఉపయోగించి జాబితాలో తనిఖీ చేసుకోవాలన్నారు. గతేడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ పరీక్ష నిర్వహించింది. మొత్తం 2.36 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. గ్రూప్ 2 టాపర్‌కు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

గద్దర్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రజా గాయకుడు గద్దర్ పేరిట తెలంగాణ చలన చిత్ర అవార్డులకు సంబంధించి విధి విధానాలు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం గద్దర్ అవార్డులకు గాను ప్రభుత్వం 'జీఓఎంఎస్ నెంబర్ 25' మంగళవారం విడుదల చేసింది. ఇక తెలంగాణ సినిమా రంగానికి విశేష సేవలనందించిన పైడి జయరాజ్, కాంతారావు పేర్లపై ప్రత్యేక అవార్డులు ఇవ్వాలని, ఇప్పటికే, ప్రముఖ నటులు ఎం. ప్రభాకర్ రెడ్డి పేరుపై ఉన్న ప్రజాదరణ పొందిన చలన చిత్రానికి ఇచ్చే అవార్డును కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2014 నుంచి 2023 వరకు తెలంగాణ ప్రభుత్వం చలన చిత్ర అవార్డులను జారీ చేయక పోవడంతో... ఆయా సంవత్సరాలకు అవార్డు లివ్వాలని నిర్ణయించారు. ఫీచర్ ఫిలిం కేటగిరిలో మొట్టమొదటి సారిగా ఉర్దూ భాషా చిత్రాలకు అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. గద్దర్ చలన చిత్ర అవార్డులకు సంబంధించిన దరఖాస్తులు ఏసీ గార్డ్స్‌లోని తెలంగాణా చలన చిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఈ నెల 13 నుంచి అందుబాటులో ఉంటాయి.

5 లక్షల మంది యువతకు స్వయం ఉపాధి

- 15న 'రాజీవ్ యువ వికాసం' నోటిఫికేషన్
- ఏప్రిల్ 5 వరకు దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 2న లబ్ధిదారులకు మంజూరు పత్రాలు
- చాకలి ఐలమ్మ యూనివర్సిటీకి రూ.540 కోట్లు
- ఉప ముఖ్యమంత్రి భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: రాజీవ్ యువ వికాసం కార్యక్రమం ద్వారా రూ.6 వేల కోట్లతో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నిరుద్యోగ యువతీ యువకులు ఐదు లక్షల మందికి స్వయం ఉపాధి పథకాలు అందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్ వీర వనిత చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. యువత వికాసాన్ని గత ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదని... ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించి వారి అభ్యున్నతికి దోహదపడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా యువతకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి 3 లక్షల చొప్పున సాయం చేయనున్నట్లు వెల్లడించారు. 5 లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఈ సంవత్సరం స్వయం ఉపాధి పథకాలు

- మిగతా 2 లో

స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ పాద ముద్రలు

వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) చరిత్రలో అనేక కుట్ర కేసులు ఎదుర్కోవలసి వచ్చింది. దేశద్రోహ ఆరోపణలూ భరించవలసి వచ్చింది. బుల్లెట్లకు బలి కావాల్సి వచ్చింది. జైలు జీవితం గడపాల్సి వచ్చింది. ఉరికంబాలు ఎక్కాల్సి వచ్చింది. జాతీయోద్యమంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ కేవలం పరిమితమైన స్వాతంత్ర్యమే తమ లక్ష్యం అని అంటున్న సమయంలో 1921లోనే సంపూర్ణ స్వరాజ్యం కోసం సీపీఐ ముందడుగేసింది.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

నవ శకంలో మరిన్ని విజయాలే లక్ష్యం

చైనా నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ తీర్మానం

బీజింగ్: నవ శకంలో రాజకీయపరంగా మరిన్ని విజయాలతో దూసుకెళ్లాలని చైనా సంకల్పించింది. ఈ దిశగా చైనా నేషనల్ లెజిస్లేచర్ 14వ నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ తీర్మానించింది. రాజధాని బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో మంగళవారం జరిగిన ముగింపు సమావేశానికి అధ్యక్షుడు జిన్‌పింగ్, ప్రధాని లీ కియాంగ్‌తో సహా ప్రముఖ నాయకులు, ప్రతినిధులు హాజరయ్యారు. సంప్రదాయ వస్త్రధారణలో సభకు హాజరై కొందరు సందడి చేశారు. వార్షిక సదస్సు ముగింపును పురస్కరించుకొని చైనా ఆధునికీకరణ దిశగా మరింత పురోగతి కోసం గొప్ప తోడ్పాటు, నూతన సహకారానికి పునరంకితం కావాలని రాజకీయ సలహాదారులకు రాజకీయ సలహా మండలి పిలుపునిచ్చింది. చైనీస్ పీపుల్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (సీపీపీసీసీ) చైర్మన్ వాంగ్ హునింగ్ అధ్యక్షతన సోమవారం జరిగిన సదస్సు... సీపీపీసీసీ రాజకీయ శక్తికి చైనా ప్రజాస్వామిక విజయానికి అద్దంపట్టింది. నవ శకంలో చైనా వ్యక్తిత్వంతో సోషలిజం మార్గంలో మరిన్ని గొప్ప విజయాలు అందుకోగలమని రాజకీయ సలహాదారులు దీమా వ్యక్తం చేశారు. సీపీపీసీసీ జాతీయ కమిటీ స్థాయి సంఘం నివేదిక, కొత్త ప్రతిపాదనలు, రాజకీయ సంకల్పంపై తీర్మానాలు జరిగాయి.

సిరియాలో మారణహోమం ఆక్షేపణీయం: కేకేఈ

ఏథెన్స్: సిరియాలో భద్రతా బలగాలకు, మాజీ అధ్యక్షుడు అసద్ మద్దతుదారులకు మధ్య భీకర పోరులో వెయ్యి మందికిపైగా ప్రాణాలు కోల్పోవడంపై గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) ఆవేదన వ్యక్తంచేసింది. ఈ మారణహోమాన్ని ఖండించింది. జిహాదీల పాలనలో అలవైట్‌ల ఊచకోత జరుగుతోందని, అమెరికా, ఈయూ మద్దతుతో టర్కీ, ఇజ్రాయిల్ సహకారంలో జిహాదీ రాజ్యం ఇలాంటి హేయమైన నేరాలకు పాల్పడుతోందని మంగళవారం ఒక ప్రకటనలో ఆక్షేపించింది. మైనారిటీలే లక్ష్యంగా నేరాలు జరుగుతున్నాయని పేర్కొంది. సామ్రాజ్యవాద యుద్ధాలు... ప్రజల నెత్తిన తుపాకీ ఎక్కిపెట్టి సాధించే 'శాంతి' అన్నవి ఒకే నాణేనికి రెండు వైపులని మరోసారి రుజువైందని వ్యాఖ్యానించింది. పెట్టుబడిదారీ వర్గ కర్కశత్వం, ప్రపంచాన్ని భిన్నరీతిలో పంచుకోవడం వంటివి బాధాకరమైన పరిణామాలకు దారితీస్తున్నట్లు గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ ఆందోళన వ్యక్తంచేసింది. తాజా పరిణామాలకు జర్మన్ ప్రభుత్వ జోక్యం కూడా కారణమని దుయ్యబట్టింది. ఫిబ్రవరిలో సిరియా పర్యటన క్రమంలో సమ్మిళిత విధానాల నెపంతో రాజకీయ బదిలీ సజావుగా సాగుతుందని గ్రీస్ మంత్రి భ్రమలు కల్పించారని విమర్శించింది. ఇలాంటి పరిణామాలే రక్తపాతానికి దారితీశారని న్యూ డెమొక్రసీ ప్రభుత్వాన్ని కమ్యూనిస్టు పార్టీ ఆక్షేపించింది.

వాయు కాలుష్యంలో బంగ్లాదేశ్ టాప్

డబ్ల్యూహెచ్‌ఓ సూచించిన ఏక్యూ ఆ ఏడు దేశాల్లోనే...

సింగపూర్: ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) సూచించిన వాయు నాణ్యతా ప్రమాణాలను (ఏక్యూఐ) ఏడు దేశాలు మాత్రమే చేరుకున్నట్లు ఓ నివేదిక తెలిపింది. చాద్, బంగ్లాదేశ్ దేశాలు ప్రపంచంలోనే అత్యంత కలుషితమైనవిగా స్విస్ వాయు నాణ్యతా పర్యవేక్షణ సంస్థ ఐక్యూఎయిర్ తేల్చింది. వాయు కాలుష్య స్థాయిలు డబ్ల్యుహెచ్‌ఓ మార్గదర్శకాల కంటే 15 రెట్లు అధికంగా ఉన్నాయని పేర్కొంది. చాద్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, కాంగో డెమోక్రటిక్ రిపబ్లిక్ తర్వాత ఐదవ స్థానంలో భారత్ నిలిచినట్లు తెలిపింది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బహమాస్, బార్బడోస్, గ్రెనడా, ఎస్టోనియా, ఐస్లాండ్ దేశాలు మాత్రమే ఈ గ్రేడ్‌లో ఉన్నాయని ఐక్యూఎయిర్ పేర్కొంది. 2024 డేటా ఆధారంగా ఈ మేరకు మంగళవారం నివేదించింది.

కాగా, 2022తో పోలిస్తే భారత్‌లో సగటు పీఎం 2.57 శాతం తగ్గి 50.6 ఎంజీ/క్యూ.ఎంకి చేరుకుందని తెలిపింది. డబ్ల్యుహెచ్‌ఓ 5 ఎంజీ/సియు.ఎం కంటే ఎక్కువ స్థాయిలను సిఫార్సు చేయగా, గతేడాది 17 శాతం నగరాలు మాత్రమే దీనిని చేరుకోగలిగాయి. అధిక ఉష్ణోగ్రతలతో ఆగేయాసియా, దక్షిణ అమెరికాలో కార్చిచ్చులు సంభవిస్తున్నట్లు ఐక్యూఎయిర్ మేనేజర్ చెస్టర్ వెల్లడించారు.

రాడ్రిగో డుటర్టే అరెస్టు

మనీలా: ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రాడ్రిగో డుటర్టే మంగళవారం మనీలాలో అరెస్టు అయ్యారు. సామూహిక హత్యాకాండ నేరం కింద కేసులో ఆయన అరెస్టుకు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు వారెంట్ జారీ చేసింది. దీంతో హాంగ్‌కాంగ్ నుంచి తిరిగి వచ్చిన సమయంలో ఐసీసీ ఆదేశాల మేరకు పోలీసులు డుటర్టేను మనీలా అంతర్జాతీయ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు అధ్యక్షుడు ఫెర్దినండ్ మార్కోస్ కార్యాలయం ఒక ప్రకటన చేసింది. తాజా పరిణామంతో ఎయిర్‌పోర్టులో గందరగోళం నెలకొంది. డుటర్టే మద్దతుదారులు నిరసనకు దిగారు. కస్టడీలోకి తీసుకున్న తర్వాత వైద్యులు, న్యాయవాదులను డుటర్టే వద్దకు వెళ్లనివ్వలేదు. అయితే ఇది రాజ్యాంగబద్ధ హక్కుల ఉల్లంఘనంటూ డుటర్టే సన్నిహితుడు సేన్ బోంగ్ గో ఆగ్రహం వ్యక్తంచేశారు. డుటర్టే అరెస్టు చట్టవ్యతిరేకమని న్యాయవాది సాల్వడార్ పనేలో అన్నారు. కాగా, డుటర్టే (79) 2022లో బాధ్యతల నుంచి తప్పుకున్నారు. డుటర్టే అరెస్టును కొందరు స్వాగతించారు.

వేలాది మంది ఫిలిప్పీనోలకు న్యాయం జరుగుతుందని ఆశించారు. నాడు ప్రాణాలు కోల్పోయిన వారిలో పేదలు, మైనర్లు ఉన్నట్లు హక్కుల కార్యకర్తలు తెలిపారు. మారణహోమానికి సంబంధించి కొద్ది మందికే శిక్షలు పడ్డాయని హక్కుల సంఘాలు పేర్కొన్నాయి.

బీజేపీ కపట రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

అమెరికాపై తిరగబడి ఆంక్షలు విధిస్తుండగా... మోదీ మాత్రం మంత్రి పీయూష్ గోయల్‌ను కాళ్లబేరానికి పంపించడం, భారత ఆత్మగౌరవాన్ని అమెరికాకు తాకట్టుపెట్టడమే అవుతుందని మండిపడ్డారు. ఇలాంటి కపట రాజకీయాలు చేస్తున్న బీజేపీని గత ఎన్నికల్లో 240 సీట్లకు పరిమితం చేయడం ద్వారా ప్రజలు బుద్ధిచెప్పారన్నారు. దేశంలో చంద్రబాబు, నితీశ్ కుమార్ ఇద్దరూ స్వంత ప్రయోజనాల కోసం మోదీని కాపాడారన్నారు. ఢిల్లీలో ఆప్, కాంగ్రెస్ కలిసి పోటీ చేయకపోవడం వల్లే బీజేపీ గెలిచిందని నారాయణ స్పష్టం చేశారు. లిక్కర్ కేసును బ్లాక్ మెయిల్ కు బీజేపీ ఉపయోగించుకుందన్నారు. ప్రస్తుత జనాభా ప్రకారం డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇలాంటి చర్యల వల్ల సమాఖ్య వ్యవస్థను నీరుకార్చడమే అవుతుందన్నారు. అంతటి దుర్మార్గపు పరిపాలనకు నితీశ్, చంద్రబాబు మద్దతు పలకడం శోచనీయమన్నారు. సపోర్ట్ చేసే వారు పక్కన.. వ్యతిరేకించే వారు జైల్లో అన్న స్లోగన్ తో కేంద్రం పాలన సాగిస్తోందని నారాయణ మండిపడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మరుతాన్నా.. విధానాలు మారలేదని... కొత్తసీసా పాత సారా అన్నచందంగా ప్రభుత్వ పాలకులు వ్యవహరిస్తుండటం బాధాకరమన్నారు. భూ కుంభకోణాలు పెరిగిపోయాయని, తిరుపతిలోని చెరువులు, ప్రభుత్వ భూములను చెరబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రంలో హైడ్రా నాయకత్వాన ప్రభుత్వ ఆస్తులు, చెరువులను కాపాడుతుంటే ఏపీలో మాత్రం యథేచ్ఛగా కుంభకోణాలు సాగుతున్నాయన్నారు. మద్యం పాలసీలోనూ అనేక సమస్యలున్నాయని, బైరాగిపట్టెడ కూడలి సమీపంలో ఆసుపత్రులు, పాఠశాలలు, బ్యాంకులు, మహిళలు తిరుగుతున్న ప్రాంతంలో వైన్ షాప్ ను ఏర్పాటు చేశారన్నారు. వైన్ షాప్ ను మరోచోటుకి తరలించమంటే సీపీఐ నాయకులను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, కలెక్టర్ ను కూడా తప్పదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నుంచి అదే వైన్ షాప్ వద్ద దీక్షకు దిగనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అనంతరం వైసీపీ యువత పోరుపై విలేకరులు ప్రశ్నకు స్పందిస్తూ... చేయాల్సిన పన్నీ చేసి తిరిగి పోరు చేస్తానంటే ఎలా? జగన్ అసెంబ్లీకి వెళ్లకపోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకొని చట్టసభల్లో ప్రజల గొంతు వినిపించకపోవడం ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన హత్యలు, భూ కుంభకోణాలు, దౌర్జన్యాలపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా... నోటి దురుసు ప్రదర్శించిన వారినే ఇబ్బంది పెట్టడంతో సరిపెట్టడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేసిన వారి జోలికి వెళ్లలేదని, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై కేసు పెట్టినా... నేరుగా ఆయనే ఏమైనా చేసుకోండంటున్నా ఏం చేయలేకపోయార నారాయణ అన్నారు. హత్యా రాజకీయాలు చేసిన వాటిపై చర్యలు ఎందుకు లేవని ప్రశ్నించారు. టీడీపీ చిలక్కొట్టుడు వ్యవహారంతో బిజీగా ఉందని విమర్శించారు. ఈ విలేకర్ల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ రెడ్డి, గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య కే రాధాకృష్ణ జే విశ్వనాథ్, బీ నదియా తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లలో అమరావతి పూర్తి

- రూ.37,702 కోట్ల పనులకు ఆమోదం
- నెలాఖరుకు ఐకానిక్ బ్రిడ్జి, కరకట్ట రోడ్డు విస్తరణకు టెండర్లు
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు 1300 ఎకరాలు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్‌డీఏ కీలక నిర్ణయాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:

మూడేళ్లలో అమరావతి రాజధాని నిర్మాణ పనులు పూర్తి చేయాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. దాదాపు 59 టెండర్లకు సంబంధించి రూ.రూ.37,702 కోట్ల విలువైన నిర్మాణ పనులకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో సీఆర్డీఏ 45వ అథారిటీ సమావేశం మంగళవారం జరిగింది. కాంట్రాక్టు ఏజెన్సీలకు అంగీకార పత్రాలు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ పూర్తయ్యాక రాజధానిలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. సీఆర్‌డీఏ సమావేశం ముగిసిన తర్వాత మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. అమరావతి రాజధానిని చెడగొట్టేందుకు ఐదేళ్లపాటు జగన్ చేయని ప్రయత్నం లేదు. గత ప్రభుత్వం రాజధానిలో పనులు నిలిపివేసి... 2014-19లో చేసుకున్న కాంట్రాక్టు అగ్రిమెంట్లను నిలిపివేయడంతో గుత్తేదారులు తీవ్రంగా నష్టపోయారు. అనేక ఆటంకాలు దాటుకుని మళ్లీ పనులు మొదలవుతున్నాయి. తమ ప్రభుత్వం రాగానే సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసి వాటిపై చర్చించామని మంత్రి నారాయణ చెప్పారు. ఎన్టీఆర్ విగ్రహం, ఐకానిక్ బ్రిడ్జి, కరకట్ట రోడ్డు వంటి 19 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి విలువ సుమారు రూ.16,871 కోట్లు. వీటికి సంబంధించి అంచనాలు తయారు చేశారు. మార్చి నెలాఖరులోపు ఈ పనులన్నింటికీ టెండర్లు పిలుస్తామని తెలిపారు. మొత్తం 31 సంస్థలకు భూ కేటాయింపులకు సంబంధించి ప్రక్రియ పూర్తయిందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి సేకరించిన భూమిలో రోడ్లు, ప్రభుత్వ భవనాలు, ఇతర ప్రాజెక్టులకుపోను 6,203 ఎకరాలు సీఆర్‌డీఏకు మిగిలింది. అందులో దాదాపు 1300 ఎకరాలు వివిధ సంస్థలకు ఇవ్వబోతున్నాం. దాదాపు నాలుగు వేల ఎకరాలు అభివృద్ధి చేసిన భూమిని వేలం ద్వారా విక్రయించి... రాజధాని నిర్మాణానికి నిధులు సమకూరుస్తాం. పక్కా ప్రణాళికతోనే అమరావతి నగరం అభివృద్ధి జరుగుతుందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

రూ.64,721 కోట్లు ఖర్చు

అమరావతి నిర్మాణానికి మొత్తం రూ.64,721 కోట్లు ఖర్చవుతుందని మంత్రి నారాయణ ప్రకటించారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానమిచ్చారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్(ఏజీసీ)లో ఇళ్లు, భవన నిర్మాణాలు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎల్పీఎస్ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రూ.64,721.48 కోట్లు ఖర్చవుతుందన్నారు. ఈ నిధులను వివిధ రూపాల్లో సేకరించి అమరావతి నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. రాజధాని నిర్మాణానికి అయ్యే ఖర్చులో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ కలిసి రూ.13,400 కోట్లు, కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు రూ.5 వేల కోట్లు, హడ్కో నుంచి రూ.11 వేల కోట్లు, కేంద్రం గ్రాంట్ కింద మరో రూ.1560 కోట్లు తీసుకుంటున్నామని తెలిపారు. అమరావతిలో 106 ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగ సంస్థలు తమ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అమరావతిలో ట్రంక్ రోడ్లు(మెయిన్ రోడ్లు) 165 అడుగులు,185 అడుగులతో రెండేళ్లలో పూర్తి చేస్తామని, ఎల్పీఎస్ రోడ్లు మూడేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. సగానికి పైగా నిర్మాణం జరిగిన అధికారుల భవనాలు ఏడాదిన్నరలో, మిగతావి రెండేళ్లు, అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు నిర్మాణాలను మూడేళ్లలో పూర్తి చేస్తామని మంత్రి నారాయణ చెప్పారు. గత ప్రభుత్వం కక్ష సాధింపుతో ఆర్-5 జోన్ చేసి 50 వేల మందికి సెంటు చొప్పున భూమి ఇచ్చిందని, వారికి కూడా ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్నామన్నారు. వేరొక చోట స్థలం కేటాయించి అమరావతి భూములను రాజధాని కోసం తీసుకుంటామని మంత్రి వివరించారు.

మోదీ 'పరీక్ష పే చర్చ'కు రూ.64 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

సాగుతోందన్నారు. ఇదిలావుంటే, ఈ ఏడాది ఫిబ్రవరి 10న పరీక్ష పే చర్చలో దీపికా పదుకొణె, విక్రాంత్ మస్సే, భూమి పెడ్నేకర్, ఎంసీ మేరీ కామ్ వంటి ప్రముఖ క్రీడా, సినీ తారలు సందడి చేశారు. ఆధ్యాత్మిక గురువు సద్గురు పాల్గొన్నారు. వీరంతా విద్యార్థులకు సలహాలు, సూచనలు అందించారు. యూపీఎస్‌సీ, ఐఐటీ-జేఈఈ, సీఎల్ఏటీ, సీబీఎస్‌సీ, ఎన్‌డీఏ, ఏసీఎస్‌సీ తదితర పరీక్షల్లో టాపర్లు కూడా భాగస్వాములయ్యారు.

గ్రూప్-2 ఫలితాలు వచ్చేశాయ్

(మొదటిపేజీ తరువాయి)

అత్యధికంగా 447 మార్కులు వచ్చాయి. జనరల్ ర్యాంకులతో పాటు తుది 'కీ ' కూడా విడుదలైంది. ఓఎంఆర్ షీట్స్‌ను అధికారిక వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచారు.

టాప్ -10 ర్యాంకర్ల జాబితా ఇదే...

1. నారు వెంకట హర్షవర్ధన్ (447.088 మార్కులు)
2. వడ్లకొండ సచిన్ (444.754 మార్కులు)
3. బి మనోహర్‌రావు (439.344 మార్కులు)
4. శ్రీరామ్ మధు (438.972 మార్కులు)
5. చింతపల్లి ప్రీతమ్ రెడ్డి (431.102 మార్కులు)
6. అఖిల్ ఎర్రా (430.807 మార్కులు)
7. గొడ్డేటి అశోక్ (425.842 మార్కులు)
8. చిమ్ముల రాజశేఖర్ (423.933 మార్కులు)
9. మేకల ఉపేందర్ (423.119 మార్కులు)
10. కరింగు నరేష్ (422.989 మార్కులు)

'బడ్జెట్' భేటీకి వేళాయె

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తావించి బీఆర్ఎస్‌ను ఇబ్బందుల్లోని నెట్టే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది..

అరగంట ముందుగానే...

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రతిరోజూ అరగంట ముందుగా 9:30 కే అసెంబ్లీకి రావాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఎల్పీలో సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశాల్లో మాట్లాడే అంశాలపై పూర్తిగా అధ్యయనం చేయాలని సూచించారు. "హామీల అమల్లో వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, సృష్టించిన ఆస్తుల గురించి సుదీర్ఘంగా వివరించాలి. పదేళ్లలో బీఆర్ఎస్ నాలుగు లక్షల కోట్ల అప్పు చేస్తే... కాంగ్రెస్ 14 నెలల్లోనే లక్షా 50 వేల కోట్ల అప్పులు చేసింది. అప్పుల విషయంలో కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలి. భారీగా అప్పులు చేసినా హామీలు అమలు చేయడం లేదు. రైతుబంధు, సాగునీరు ఇవ్వకుండా రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను, వారి ఆకాంక్షలను అర్థం చేసుకొని వారి గొంతుకగా బీఆర్ఎస్ సభ్యులు ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. గొర్రెల పెంపకం.. చేపల పంపిణీ సమగ్ర అమలు కోసం.. అసెంబ్లీ మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలి. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలి. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమౌతున్న తీరుపై మాట్లాడాలి. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏల పెండింగ్స్, పీఆర్సీ అమలుపై అసెంబ్లీ మండలి వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయాలి. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కొట్లాడాలి. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని నిలదీయాలి. విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్షిప్ లు విడుదలచేయక పోవడం, వైద్య రంగంలో దిగజారుతున్న ప్రమాణాలు, తదితర ప్రజా సమస్యలు ఎండ గట్టాలి. దళిత బంధును నిలిపివేయడం పట్ల ప్రశ్నించాలి" అని మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు.

కేసీఆర్‌పై ఫిర్యాదు

కేసీఆర్‌పై కాంగ్రెస్ నేతలు సభాపతికి ఫిర్యాదు చేశారు. కేసీఆర్ ప్రతిపక్ష నేతగా జీతభత్యాలు పొందుతూ.. అసెంబ్లీకి రావడం లేదంటూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, అసెంబ్లీ సెక్రటరీకి కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. కేసీఆర్‌కు వేతనం నిలిపివేయాలని కోరారు. ఇన్ని రోజులు కేసీఆర్‌కు ఇచ్చిన జీతాన్ని రికవరీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశారు.

ఆహ్వాన సంఘం చైర్మన్‌గా నారాయణ

ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు మే 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరగనున్నాయి. ఆ మహాసభలకు సంబంధించి ఆహ్వానసంఘాన్ని ఏఐవైఎఫ్ నాయకులు ఏర్పాటు చేశారు. తిరుపతిలోని గంధమనేని శివయ్య భవనంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆహ్వాన సంఘాన్ని నియమించారు. సీపీఐ కార్యదర్శి కె.నారాయణ, ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు సుఖ్‌జిందర్ మహేసరి, జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్, తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు పెరుమాళ్, కర్నాటక రాష్ట్ర అధ్యక్షుడు హరీశ్ బాల, జాతీయ ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేశు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరనాథ్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, ఏఐవైఎఫ్ జాతీయ కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు తదితరులు హాజరయ్యారు. ఆహ్వాన సంఘం చైర్మన్‌గా కె.నారాయణ, వైస్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, మోహన్ రాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి, ప్రొఫెసర్ రమణ, ప్రధాన కార్యదర్శిగా పి.రాజేంద్రబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.రవి, కార్యదర్శులుగా కె.శివారెడ్డి, ఎం.యుగంధర్, జి.సంతోశ్ కుమార్, చీఫ్ ప్రొటన్స్‌గా పి.హరనాథ రెడ్డి, రామానాయుడు, ప్రొటన్‌గా ఎన్. లెనిన్ బాబు, కోశాధికారిగా పి.మురళిని ఎన్నుకున్నారు.

5 లక్షల మంది యువతకు స్వయం ఉపాధి

(మొదటిపేజీ తరువాయి)

అందించడానికి ఈ నెల 15న నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు. ఆన్ లైన్ లో ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని , ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు దరఖాస్తుల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 02న ఎంపికైన లబ్ధిదారులకు మంజూరి పత్రాలను అందజేస్తామని వివరించారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి తగిన మార్గదర్శకాలను అధికారులు రూపొందిస్తున్నారని చెప్పారు. సామాజిక స్పృహ కలిగిన ప్రజా ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించడం సామాజిక బాధ్యతగా తీసుకున్నదన్నారు. వీరవనిత చాకలి ఐలమ్మ యూనివర్సిటీ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం రూ.540 కోట్లు కేటాయించిందని ఉపముఖ్యమంత్రి వెల్లడించారు. దేశంలోనే ఉత్తమ యూనివర్సిటీగా తీర్చిదిద్దడానికి అద్భుతమైన భవన నిర్మాణాలు చేయడానికి ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు తెలిపారు. యూనివర్సిటీలోని వారసత్వ కట్టడాలను పునరుద్ధరిస్తామన్నారు. యూనివర్సిటీ ప్రధాన ద్వారం మూసి నదిని ఆనుకొని ఉందని మూసి ప్రక్షాళన పూర్తయ్యాక ప్రధాన ద్వారాన్ని తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. వారసత్వ కట్టడాల పునరుద్ధరణకు 15.5 కోట్లు, నూతన భవన నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 100 కోట్లు విడుదల చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. వారసత్వ భవనాలు, పునరుద్ధరణ ప్రణాళికలను అధికారులతో కలిసి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పరిశీలించారు. సమావేశం లో స్పెషల్ సీఎస్ రామకృష్ణా రావు, ఐ&పీఆర్ కమిషనర్ హరీష్, ఐలమ్మ యూనివర్సిటీ వీసీ సూర్య ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఉగ్ర సంస్థలపై కేంద్రం నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

వహిస్తుండగా... జమ్మూకశ్మీర్ ఇత్తిహదుల్ ముస్లిమీన్ (జేకేఐఎం) సంస్థను మస్రూర్ అబ్బాస్ అన్సారీ నడిపిస్తున్నారు. ఈ రెండు సంస్థలకు చెందిన సభ్యులు జమ్మూ కశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని రెచ్చగొట్టేలా... ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతివ్వడం, భారత వ్యతిరేక ప్రాచారంలో పాల్గొంటున్నట్లు కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది. దేశ సమగ్రత, సార్వభౌమాధికారం, భద్రతకు హాని కలిగించే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిపింది. అన్ని వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని ఈ రెండు సంస్థలపై నిషేధం విధించాలని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్

(మొదటిపేజీ తరువాయి)

కేసు 2019లో నమోదైంది. దీనిపై పిటిషన్‌లను కిందిస్థాయి కోర్టు నిరాకరించింది. ఫిర్యాది శివకుమార్ సక్సెనా... సీఆర్పీసీలోని 156(3) సెక్షన్ కింద పిటిషన్ కేసు పెట్టారు. ఈ ఏడాది జనవరి 21న రివిజనిస్ట్ కోర్టు ఈకేసును మెజిస్ట్రేట్ కోర్టుకు తిరిగి సిఫార్సు చేసింది. ప్రచురణాలయం వివరాలు అందుబాటులో లేకపోవడం, చాలా సమయం గడిచిపోవడంతో సముచిత ఆధారాలు చూపలేమన్న రాష్ట్రం తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలలో పసలేదని జస్టిస్ మిత్తల్ అన్నారు. శాస్త్రీయ, సాంకేతికాభివృద్ధి జరిగిన ప్రస్తుత శకంలో దర్యాప్తు సంస్థకు అవకాశం ఇవ్వకుండా విచారణకు ఆదేశాలివ్వడంతో ఫలితం ఉండదన్నారు. కోర్టు పదేపదే సూచించినాగానీ యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ఏటీఆర్) నమోదులో ప్రదర్శించిన అలసత్వం కారణంగా ఈ కేసు ఆలస్యమైందన్నారు. సంబంధిత ఎస్‌హెచ్‌ఓ సమర్పించిన ఏటీఆర్‌లో ఫిర్యాది ఆరోపించినట్లు ప్రజా ధనం దుర్వినియోగం గురించి ప్రస్తావన లేకపోవడం ఆశ్చర్యకరమని జడ్జి వ్యాఖ్యానించారు.

పాక్‌లో రైలు హైజాక్

(మొదటిపేజీ తరువాయి)

ఇతర భద్రతా సిబ్బంది సహా మొత్తం 182 మంది మా వద్ద బందీలుగా ఉన్నారు. సైన్యం జోక్యం చేసుకుంటే బందీలందరినీ చంపేస్తాం' అని బీఎల్ఏ హెచ్చరించింది. కాగా, సొరంగం వద్ద పేలుళ్లు, కాల్పుల శబ్దాలు వినిపించినట్లు భద్రతా సిబ్బంది తెలిపారు. మార్గ మధ్యంలో పట్టాలు పేల్చివేసి సొరంగం వద్ద రైలును బీఎల్ఏ సభ్యులు హైజాక్ చేశారన్నారు. బీఎల్ఏ ప్రకటించినట్లు 20 మంది సైనికుల మరణాన్ని అధికారులు ధ్రువీకరించలేదు. తాజా పరిణామంతో బలూచిస్థాన్ ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టింది. ఘటనా స్థలానికి భద్రతా దళాలు, అంబులెన్సులు పంపింది. సిబీ ఆసుపత్రి వద్ద ఎమర్జెన్సీ విధించింది. చివరి ఉగ్రవాదిని మట్టుపెట్టేంత వరకు తమ ఆపరేషన్ కొనసాగుతుందని భద్రతా దళానికి చెందిన అధికారి ఒకరు చెప్పారు. ఈ రైలుకు తొమ్మిది బోగీలు ఉన్నాయని, వాటిలో 500 మంది ప్రయాణికులు ఉన్నట్టు రైల్వేస్ కంట్రోలర్ మహమ్మద్ ఖాషిఫ్ తెలిపారు. హైజాక్ జరిగిన మార్గంలో మొత్తం 17 సొరంగాలు ఉండగా, ఎనిమిదో సొరంగం వద్ద రైలుపై దాడి జరిగినట్లు వెల్లడించారు. వేర్పాటువాద సంస్థలన్నింటిలో బీఎల్ఏ పెద్దది. దశాబ్దాలుగా పాక్ ప్రభుత్వంతో పోరాడుతోంది. బలూచిస్థాన్ ఖనిజ సంపదను దోచేస్తున్నారంటూ ఆరోపిస్తోంది. ప్రత్యేక బలూచిస్థాన్ కోసం డిమాండ్ చేస్తోంది.

అమాయకులను చంపేవారిని వదలం: మంత్రి మోసిన్ నఖ్వీ

ఈ దాడిని పాకిస్థాన్ అంతర్గత మంత్రి మోసిన్ నఖ్వీ తీవ్రంగా ఖండించారు. అమాయక ప్రయాణికులపై కాల్పులకు తెగబడిన మృగాళ్లకు ప్రభుత్వం ఎలాంటి మినహాయింపు ఇవ్వబోదని ఆయనన్నారు. ఈ సమస్యను పరిష్కరించడం కోసం బలూచిస్థాన్ ప్రభుత్వం అత్యవసర చర్యలను చేపట్టినట్లు అధికార ప్రతినిధి షాహిద్ రింద్ తెలిపారు. క్వెట్టాలోని సివిల్ హాస్పిటల్ వద్ద ఎమర్జెన్సీ ప్రకటించినట్లు ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధి డాక్టర్ వసీం బేగ్ అన్నారు. కన్సలెంట్లు, వైద్యులు, స్టాఫ్ నర్సులు, పారామెడిక్‌లు, ఫార్మాసిస్టులు అందరినీ ఆసుపత్రిలో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. సింధ్ హోంమంత్రి జియావుల్ హసన్ కూడా ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. హేయమైన నేరాలను ఉపేక్షించరాదని, సంఘ విద్రోహశక్తులు, దేశ ద్రోహులను కట్టడి చేయాలని అన్నారు. బలూచిస్థాన్‌కు సంఘీభావం తెలిపారు. మాజీ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ 'ఎక్స్'లో స్పందిస్తూ ఇది పిరికిపంద చర్య అని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే సాయుధ దళాలు పూర్తిస్థాయిలో దృష్టిని కేంద్రీకరించాలి, ప్రజలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ధర్మేంద్ర ప్రధాన్‌పై సభా హక్కుల నోటీసు

(మొదటిపేజీ తరువాయి)

తమిళుల తరపున నేను డిమాండ్ చేస్తున్నా' అని కనిమొళి పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) విషయంలో తమిళనాడు ప్రభుత్వం యూటర్న్ తీసుకుందని, ఈ విషయంలో ఏమాత్రం నిజాయతీ లేకుండా వ్యవహరించిందని ధర్మేంద్ర ప్రధాన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. 'వాళ్లకు ఏమాత్రం నిజాయతీ లేదు. విద్యార్థుల జీవితాలు నాశనం చేసేలా రాజకీయాలు చేస్తున్నారు" అంటూ సోమవారం బడ్జెట్ మలివిడత సమావేశాల సందర్భంగా లోక్‌సభలో వ్యాఖ్యలు చేశారు. దీంతో డీఎంకే ఎంపీలు ఆందోళనకు దిగగా... సభ వాయిదా పడింది. కాగా హక్కుల తీర్మానాన్ని స్పీకర్ ఓం బిర్లా పరిశీలించనున్నారు. ఒకవేళ స్పీకర్ గనుక ఆ తీర్మానాన్ని అంగీకరిస్తే దర్యాప్తునకు ఆదేశిస్తారు. అందులో ఉల్లంఘన జరిగినట్లు తేలితే క్రమశిక్షణా ఉల్లంఘన కింద చర్యలు తీసుకుంటారు.

కొత్త గనులు వస్తేనే సింగరేణి మనుగడ

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి,సింగరేణి: కొత్త గనులు వస్తేనే సింగరేణి మనుగడ కొనసాగుతుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.సీతారామయ్య అన్నారు. మంగళవారం జీడికె 11వ ఇంక్లైన్‌లో జరిగిన ఏఐటీయుసి గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనేందుకు సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని అన్నారు. అదే విధంగా సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డ రూ.33 వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల అండ్ ఎండి స్థాయిలో జరిగిన నిర్మాణాత్మక సమావేశంలో కార్మికులకు సంబంధించిన అనేక సమస్యలను చర్చించడం జరిగిందని తెలిపారు. సమస్యలు పరిష్కారించేందుకు ఆయన సానుకూలత వ్యక్తపరిచారన్నారు. సింగరేణిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తూ విపరీతంగా రాజకీయ జోక్యం చేసుకుంటూ సంస్థ దివాలా తీసే విధంగా వ్యవహరిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ జోక్యం మానుకోకపోతే బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడు తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు మడ్డి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగు పొలాలకు నీరు అందిస్తాం : కలెక్టర్

విశాలాంధ్ర -బ్యూరో నిర్మల్ జిల్లా : మంగళవారం కడెం మండలం కొత్తమద్దిపడగ గ్రామ శివారు పంట పొలాలను కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించారు. రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి వివరాలను రైతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతులు సాగు చేసిన పంటలకు కడెం ప్రాజెక్టు సదర్మాట్ కాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకు అవసరమైన మేరకు నీటిని అందిస్తామని తెలిపారు. సాగునీటి విషయంలో రైతులు ఎవరు ఆందోళన చెందనవసరం లేదన్నారు. ప్రతి పంట పొలానికి ఏప్రిల్ చివరినాటికీ సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి అంజి ప్రసాద్, నీటిపారుదల శాఖ ఈఈ విట్టల్, తహసీల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, అధికారులు, రైతులు, పాల్గొన్నారు

పాఠశాల అభివృద్ధికి కృషి : కాంగ్రెస్

విశాలాంధ్ర -ములుగు జిల్లా బ్యూరో : ఏటూరునాగారం జడ్పీఎస్ఎస్ పాఠశాలల్లో వజ్రోత్సవాలు సందర్భంగా జడ్పీఎస్ఎస్ పాఠశాలను మంగళవారం ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి, పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు వాళ్ళ ద్వారా తెలుసుకున్నారు. విద్యార్థుల కోసమై టాయిలెట్స్, పెయింటింగ్ ఎటువంటి ఇబ్బంది లేకుండా పాఠశాల అభివృద్ధి దిశగా ఆలోచన చేపడుతున్న మని మండల కాంగ్రెస్ బృందం విద్యార్థులకు హామీ ఇచ్చారు.పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షులు చిటమట రఘు,జిల్లా కార్యదర్శి గుండ్ల దేవేందర్,మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గద్దల నవీన్, టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బండారి లక్ష్మీమాజీ వార్డ్ మెంబెర్ కె రంజిత్,తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించాలి : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : పోలీస్ స్టేషన్ లలో పెండింగ్ లోఉన్న కేసులను సత్వరం పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం జిల్లాలోని కోర్టు డ్యూటీ అధికారులతో సమావేశం నిర్వహించారు. కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికా రులతో సమన్వయం పాటిస్తూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో పెండింగ్లో ఉన్న కేసుల వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కేసులు పెండింగ్ ఉండడానికి గల కారణాలపై చర్చించారు. ఎప్పటికప్పుడు కేసుల పురోగతి వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేయ్యాలన్నారు. కేసులలోని ప్రతి విషయాన్ని ఆన్లైన్లో నిక్షిప్తం చేయాలని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణా చర్యలు ఖచ్చితంగా తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలొ డిసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి, ఎస్సైలు హారిక, హసీనా, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

15 రోజుల్లో రైతు భరోసా : మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర -ముదిగొండ : పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి కూసుమంచి మండలాల్లో రాష్ట్ర రెవెన్యూ సమాచార పౌర సంబంధాలు గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు పేదలను ఆదరించే ప్రభుత్వం కావాలని కోరుకున్నారని వారి కోరిక మేరకే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పేదల ప్రభుత్వం ఏర్పడింది అన్నారు. గత ప్రభుత్వం ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం తాము ఇచ్చిన ప్రతి హామీని నూరు శాతం అమలు చేస్తుందని స్పష్టం చేశారు. మరో 15 రోజుల్లో ప్రతి ఎకరాకు రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని, వారం రోజుల్లో సన్న రకం ధాన్యానికి చెల్లించాల్సిన బోనస్ సొమ్ములు కూడా చెల్లిస్తామని అన్నారు. కొద్ది రోజుల్లోనే రేషన్ కార్డు లేని ప్రతి ఒక్కరికి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తుందన్నారు. ఇక ప్రతి నియోజకవర్గంలో పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేస్తామన్నారు. గూడు లేని ప్రతి పేదవాడికి గూడు కల్పించడమే ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యమని పొంగులేటి పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేయలేని కార్యక్రమాలు ఈ ప్రభుత్వం చేసింది అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాటిలో కొన్నింటిని అమలు చేసామన్నారు. ధనిక రాష్ట్రాన్ని పది సంవత్సరాలు పాలించిన వారు 7 లక్షల కోట్లు దోచుకుని దాచుకు కొని అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు.గత ప్రభుత్వం చేసిన అప్పుకు ప్రతి నెలా 6,500 కోట్లు వడ్డీ తమ ప్రభుత్వం దుతుంది అన్నారు . మేము 200 కోట్ల తో నియోజకవర్గానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ కట్టబోతున్నాం అన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి :టీడీపీ

విశాలాంధ్ర - ఇల్లందు: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇల్లందు పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలనీ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ముద్రగడ వంశీ నాయకత్వం లో పార్టీ బృందం మున్సిపల్ కమిషనర్ కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ ఈ నెలలోనే అత్యధిక ఎండలు ఉండటంతో నిత్యం ఇల్లందు పట్టణంలో అనేక పనుల కోసం వచ్చే ప్రజలకు నీళ్లు దొరక్క చాలా ఇబ్బందులు ఉన్నాయన్నారు. చలివేంద్రాలు ఉంటే డబ్బులు పెట్టి నీళ్ల బాటిల్లు కొనుక్కునే దుస్థితి ఉండదన్నారు. ప్రజలకు ఎంతో ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చాందావత్ రమేష్ బాబు, టిడిపి నాయకులు శ్యామ్ తీవారి, మైఫా బాలరాజు, చిలుమల బాబు, దేశవత్ శ్రీహరి, కంది రవి, శ్యామ్ సుందర్, మట్టెల రత్నాకర్, గుగులోతు రాందాస్, దేవరకొండ నవీన్, వాసం వినీత్ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

విశాలాంధ్ర -ములుగు జిల్లా బ్యూరో : జనవిజ్ఞాన వేదిక ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏటూరునాగారం కేంద్రంలో మహిళా దినోత్సవం చాలా ఘనంగా నిర్వహించారు.జిల్లా లోని ప్రతి మండలం నుండి ఇద్దరు చొప్పున అన్ని మండలాల నుండి దాదాపు 20మంది వివిధ వర్గాలు ఎన్ జి ఓ మధ్యాహ్న భోజన కార్మికులు, వి ఓ లు అంగన్వాడీ లకు చెందిన మహిళలను సన్మానించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు యం ఈ ఓ కొయ్యడ మల్లయ్య మాట్లాడుతూ మహిళలు త్యాగాలు చేస్తూ, సృష్టి ని నడిపిస్తున్నారాని వారిని గౌరవించాలని కోరారు. కమలాపురం గేజిటెడ్ హేమదుమస్తా ప్రధాన కార్యదర్శి గడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలాంటి గుర్తింపు లేని వర్గాలనుండి మహిళలను సెలెక్ట్ చేసి వారిని గౌరవించడం చాలా సంతోషంగా ఉందని, స్త్రీలు ఎక్కడ పూజించ బడుతారో అక్కడ దేవతలు కొలువు ఉంటారన్నారు.ఈ కార్యక్రమం లోజె వి వి అధ్యక్షులు మల్లయ్య ప్రధాన కార్యదర్శి గడ్డి శ్రీనివాస్, చేకుముకి కన్వినర్ పల్లె నాగరాజు, మహిళా సమతా కన్వీనర్ యమున కొ కన్వినర్ అనిత, ఏటూరునాగారం హెచ్ యం సాంబాశివారావు, ఉపాధ్యాయులు కోడి వెంకటేశ్వర్లు, రవి, రవికుమార్ రమేష్ వివిధ మండలాలనుండి వచ్చిన మహిళలు, పాల్గొన్నారు.

దేశానికి రోల్ మోడల్‌గా కొండపర్తి : గవర్నర్

విశాలాంధ్ర -ములుగు జిల్లా బ్యూరో : దేశానికి రోల్ మోడల్‌గా కొండపర్తి గ్రామం నిలవాలని, రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా ఎస్ ఎస్ తాడ్వాయి మండలంలోని కొండపర్తి గ్రామంలో రాష్ట్ర గవర్నర్ పర్యటించారు. తొలుత కొమరం భీం, బిర్సాముండ విగ్రహాలను, పాఠశాలలో డిజిటల్ తరగతులను, అంగన్వాడీ కేంద్రాన్ని, రూ.7,84,700 వ్యయంతో నిర్మించిన మసాలా యూనిట్, రూ. 7,76,594 వ్యయంతో కుట్టు మిషన్ యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ మోటార్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ ఈ గ్రామంలో 70 గృహాలు 285 మంది ప్రజలు ఉన్నారని, చిన్న గ్రామమని అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. సమాజాభివృద్ధికి మన సేవలు ఎంతో అవసరమన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో డిజిటల్ తరగతులు ప్రారంభించుకోవడం ఎంతో సంతోషమన్నారు. విద్యార్థులు ఇంగ్లీషు బాగా మాట్లాడుతున్నారని, కొండపర్తి గ్రామంలో మహిళల ఆర్థికాభివృద్ధికి చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు ఆవశ్యకత ఉందన్నారు. స్వయం ఉపాధి యూనిట్ల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధన జరుగుతుందన్నారు.. గుజరాత్ రాష్ట్రంలో అమూల్ ఏవిధంగా ప్రసిద్ధిగాంచిందో అదే తరహాలో కొండపర్తి గ్రామం కారం, పసుపు, మసాలా, యూనిట్లకు అంతటి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రాంతంలో మిర్చి సాగు బాగుందని, మిర్చి పౌడర్ కు మంచి ఇమేజ్ రావాలని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సంకల్పానికి ఈ గ్రామం ఆదర్శంగా నిలవాలని పిలుపు పిలుపునిచ్చారు. మారుమూల ప్రాంతమైన కొండపర్తి గ్రామాన్ని తాను దత్తత తీసుకున్నానని, ఈ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తయారు చేయుటకు ఆదివాసి మారుమూల గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. తాను రాష్ట్రం లో ఏడు ఆదివాసి గ్రామాలను దత్తత తీసుకున్నానని, అన్ని గ్రామాలను అభివృద్ధిలో ఆదర్శ గ్రామాలుగా, తీర్చిదిద్దుటకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో కోటి 50 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఆదివాసీల అభివృద్ధికి తాను, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నట్లు తెలిపారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటు ద్వారా ఆదాయం సమకూరుతుందని తద్వారా అదివాసులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు. తాను, రాష్ట్రపతి, రాష్ట్ర మంత్రి సీతక్క అందరు ఆదివాసి బిడ్డలమని ఆయన పేర్కొన్నారు. మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఎస్పీ శబరీష్, గ్రామస్తులు తదితరులు గవర్నర్ ను ఘనంగా సన్మానించి మెమోంటో అంద చేశారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దన సరి అనసూయ,సీతక్క మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగపు సేవలను అభినందించారు. దట్టమైన అడవిలో ఉన్న ప్రాంతమని రవాణా సౌకర్యం కూడా లేని గ్రామాన్ని గవర్నర్ దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఈ గ్రామాన్ని బయట ప్రపంచంతో అనుసంధానం చేస్తూ ఉత్పత్తులను అందించాలని, తద్వారా మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని తెలిపారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధనలో కొండపర్తి గ్రామం రోల్ మోడల్ కావాలని ఆమె సూచించారు. 40 పరిశ్రమలు, దిశా స్వచ్ఛంద సంస్థ సహకారంతో 100 పాఠశాలలను దత్తత తీసుకున్నామని, ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడుతున్నారని ఆమె తెలిపారు. అద్భుతమైన విద్యా బోధన జరుగుతుందని అన్నారు. ఆదివాసి గ్రామాల ప్రజలు ఐకమత్యంతో ఉండాలని అప్పుడు సమైక్యతతో అభివృద్ధి సాధిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ కార్యాలయ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ మాట్లాడుతూ ఈ గ్రామంలో పర్యటించాలని గవర్నర్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈ గ్రామంలో వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు కోటి 50 లక్షల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ ఈ గ్రామంలో 70 గృహాలు 285 మంది జనాభా కలిగిన ఈ గ్రామాన్ని అభివృద్ధి చేయుటకు గవర్నర్ దత్తత తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. గవర్నర్ దత్తత తీసుకున్న తదుపరి ఈ గ్రామం అభివృద్ధిలో ముందుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శబరిస్, ఐటిడిఏ పీఓ చిత్ర మిశ్రా, జిల్లా అటవీశాఖ అధికారి రాహూల్ కిషన్ జాదవ్, గవర్నర్ కార్యాలయ సంయుక్త కార్యదర్శి భవాని శంకర్, గవర్నర్ ఏ డి సి మేజర్ అమన్ కుందు, గవర్నర్ సిఎస్ఓ శ్రీనివాసరావు, గ్రంథాలయ కమిటీ చైర్మన్ రవి చందర్, గ్రామ పెద్దలు లచ్చు పటేల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అదనపు డబ్బులు వసూలు చేస్తే చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : దివ్యాంగులకు యూనిక్ డిజబులిటీ ఐడి కార్డు జారీపై ఎటువంటి అపోహలు, సందేహాలు అవసరం లేదని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ స్పష్టం చేశారు. జిల్లాలోని మీసేవ కేంద్రాల్లో నిర్ధారిత డబ్బుల కంటే అదనంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తక్కువగానే హెచ్చరించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో మహిళా, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఈ యూనిక్ కార్డ్ జారీపై అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగులకు ఇకపై సదరం సర్టిఫికెట్ల జారీ విధానం ఉండదన్నారు. వారికి యూడీఐడీ కార్డులు జారీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వైద్యులు ధ్రువీకరించిన వైకల్య శాతం సర్టిఫికెట్‌ను, దివ్యాంగుల పూర్తి వివరాలను యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. యూడీఐడీ కార్డులు స్పీడ్ పోస్ట్ ద్వారా నేరుగా దివ్యాంగుల చిరునామాకు చేరుతాయన్నారు. ఈ కార్డు కోసం మీ-సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేయాల్సి ఉంటుందన్నారు. పూర్వం సదరం ద్వారా 8 రకాల వైకల్యాలకు మాత్రమేఅవకాశం ఉండేదని, ఈ కార్డు ద్వారా 21 రకాల వైకల్యాలకు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ ఐడి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి 5 సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. దానిలో కొత్తగా యుఐడిఐ కార్డు దరఖాస్తు, పాత సదరం కార్డు ఉండి యుఐడిఐ కార్డ్ కొసం దరఖాస్తు, కార్డు పోయిన వారు తిరిగి దరఖాస్తు చేసుకోవడం, కార్డుల్లో తప్పులు సరి చేయడం తోపాటు వివిధ కారణాల వల్ల సర్టిఫికెట్ రాని వారు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈ యుఐడి ఐ దరఖాస్తు చేసుకోవడానికి పేరు, ఫోన్ నెంబర్, మెయిల్ ఐడి, లింగము, ఫోటో, సంతకం, ఆధార్ కార్డు నెంబర్ తోపాటు అడ్రస్ నమోదు చేయవలసి ఉంటుందన్నారు. ఇంతకుముందు సదరం సర్టిఫికెట్ ఉన్నవారు డి ఆర్డి ఏ కార్యాలయంలొ వారికి యూడిఐ డి నెంబర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్డు కావలసినవారు మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్, ఆసుపత్రి సూపరిండెంట్ రామ్మోహన్, విద్యాశాఖ కోఆర్డినేటర్ సైదులు, దివ్యాంగ సంఘాల ప్రతినిధులు, మీసేవ కేంద్రాలు నిర్వహకులు పాల్గొన్నారు.

నల్ల చట్టాలు రద్దు చేసే వరకు పోరాటం : బాగం

విశాలాంధ్ర -ఖమ్మం : వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాలను రద్దు చేసేంత వరకు పోరాటం ఆగదని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రఘునాథపాలెం మండల సమితి మూడవ మహాసభ-మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో మంగ్యా నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ పాలన సాగిస్తుందని బాగం ఆరోపించారు. దేశంలో 50 శాతానికి పైగా ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఢిల్లీలో గతంలో రైతులు ఆందోళన నిర్వహించినప్పుడు మూడు నల్ల చట్టాలను రద్దు చేస్తామని చెప్పి మరల ఇప్పుడు వాటిని దొడ్డి దారిన అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. వ్యవసాయ -రంగంపైనే ఆధారపడి అన్ని రంగాలు పని చేస్తుంటాయని అటువంటి రంగానికి బడ్జెట్లో నిధులు కేటాయించకుండా సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందన్నారు. స్వామినాథన్ సిఫారసులను అమలు చేయకుండా -వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనివ్వడం లేదని తెలిపారు. ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేసి క్వింటాకు రూ. 25వేలు కొనుగోలు చేయాలని బాగం డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో పోడు రైతులతో పాటు సాధారణ రైతులు ధరణి పోర్టల్ వల్ల ఎన్నో ఇబ్బందులు పడ్డారని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా ఇప్పటికీ ఆ సమస్యను పరిష్కరించలేదని వెంటనే అర్హులైన వారికి పాసుపుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు.ఈ మహాసభలో రైతు సంఘం జిల్లా -అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, -మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బానోత్ రవి, బాగం ప్రసాద్, భూక్యా జామ్లా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రఘునాథపాలెం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బానోత్ రవి, కార్యదర్శిగా బాగం ప్రసాద్, ఉపాధ్యక్షులుగా జర్పుల ప్రసాద్, వెంకయ్య, బానోత్ బిలియా, సహాయ కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, శంకర్ లాల్, కృష్ణా తో పాటు 23 మంది కౌన్సిల్ సభ్యులను మహాసభ ఎన్నుకుంది.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

విశాలాంధ్ర- ఖమ్మం : వైరా పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో నలుగురు అంతరాష్ట్ర దొంగలను పోలీసులు పట్టుకున్నారు. వైరా మండలం దాసాపురం సమీపంలో నలుగురు దొంగలను అనుమానాస్పదంగా కనిపించడంతో వైరా పోలీసులు అదుపులోకి. ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన ఆయా గ్రామీణ ప్రాంతాల్లో దొంగలు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులకు దొరికిపోయారు. వారిని పూర్తిస్థాయిలో విచారించగా ఎన్టీఆర్ కృష్ణ జిల్లాకు చెందిన వ్యక్తులుగా నిర్ధారణ అయింది. ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడిన వారు , తెలంగాణలోనూ పలు దొంగతనాలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపిన వివరాల ప్రకారం రాయపాటి వెంకటయ్య, షేక్ నాగుల్ మీరా, ముత్తు రాజు, విజయ్ కుమార్ అనే నలుగురు ఒక ముఠాగా ఏర్పడి దొంగతనాలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.35 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రెండు కార్లు, కొన్ని మారణాయుధాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిపి సునీల్ దత్ వైరా ఏసిపి రెహమాన్ ను, వైరా పోలీస్ సిబ్బందిని అభినందించారు.

ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం రిబేటు : కలెక్టర్

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు ఈ నెల 31 లోగా ఎల్ఆర్ఎస్‌ను చెల్లించిన వారికి 25% రిబేటు ఇస్తున్న విషయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె నల్గొండ మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్‌పై లైసెన్స్ టెక్నికల్ ప్లానర్లు, లే ఔట్ ఓనర్లు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్ రైటర్లతో సమావేశం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం రిబేటు ప్రకటించడం ప్రజలకు గొప్ప అవకాశం అన్నారు. ఇది తిరిగి రాదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు స్పష్టం చేయాలని చెప్పారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా వెంటనే నివృత్తి చేసుకోవాలని చెప్పారు. ఎల్ఆర్ఎస్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలని, ఫ్లెక్సీ బ్యానర్లు, ప్రకటన ఇవ్వాలని ఆమె సూచించారు. గతంలో నల్గొండ జిల్లాలో ఎల్ఆర్ఎస్ పెద్ద ఎత్తున చేయడం జరిగిందని, ఇప్పుడు ఎల్ ఆర్ ఏస్ నిర్దేశించిన సమయంలో గా విజయవంతంగా పూర్తి చేయాలని, ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం కార్యచరణ ప్రణాళిక తయారు చేసుకొని పారదర్శకంగా శాస్త్రయుక్తంగా చేపట్టాలని ఆమె తెలిపారు.మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముజాబ్ అహ్మద్ తదితరులు ఉన్నారు

మన్నెపురెడ్డి కుటుంబసభ్యులను మాజీ మంత్రి పరామర్శ

విశాలాంధ్ర-వనపర్తి : పెద్ద మందడి మండలం ,పామి రెడ్డి పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు మన్నేపురెడ్డి సతీమణి అనారోగ్యం కారణంగా చికిత్స పొందడం తెలుసుకొని వారి ఇంటికి మాజీ మంత్రి వర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వెళ్లి పరామర్శించారు. మాజీ మంత్రి వెంట రవి చంద్ర ,ప్రేమ్ నాథ్ రెడ్డి చిట్యాల రాము,శేఖర్ ముద్దు సార్ , నందిమల్ల అశోక్ సుబ్బు ,శివ గౌడ్, లక్ష్మణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మకు రాష్ట్ర గవర్నర్ సందర్శన

విశాలాంధ్ర -ములుగు జిల్లా బ్యూరో : ములుగు జిల్లా పర్యటనకు మంగళవారం వచ్చిన రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మేడారం సమ్మక్క - సారలమ్మ కు మొక్కులు, నిలువెత్తు బంగారం సమర్పించి, అమ్మవారిని దర్శించుకున్నారు, మంత్రి సీతక్క శ్రీ సమ్మక్క సారలమ్మ ల ప్రాశస్త్యం గురించీ గవర్నర్ కు వివరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గవర్నర్ మాట్లాడుతూ ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం కొండపర్తి, గ్రామాన్ని దత్తత తీసుకోవడం జరిగిందని, గ్రామం తనను ఎంతగానో ప్రభావితం చేసిందని గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, పాఠశాల వాతావరణం అంతర్గత రోడ్లు నిర్మాణం అన్ని మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. ఆయన వెంట రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ దివాకర టిఎస్, ఏటూరు నాగారం, ఐటీడిఏ పీవో చిత్ర మిశ్రా, ఎస్పీ శబరిష్ పాల్గొన్నారు.

అంతరాష్ట్ర సైబర్ నేరస్తుల అరెస్టు

విశాలాంధ్ర ప్రతినిధి-ఆదిలాబాద్: సైబర్ నేరాలకు పాల్పడాలనే భారీ కుట్ర ను ఆదిలాబాద్ పోలీసులు భగ్నం చేశారు. సైబర్ నేరాలు చేయడానికి పెద్ద ఎత్తున మొబైల్ ఫోన్‌లను సేకరించిన ఆరుగురిపై కేసు నమోదు చేసి ఐదుగురు అంతరాష్ట్ర సైబర్ నేరస్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2125 పాత మొబైల్ ఫోన్లు, 107 సిమ్ కార్డులు, ఐదు బీహార్‌కు చెందిన బైకులు, 600 మొబైల్ బ్యాటరీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా, ఆదిలాబాద్ డీఎస్పీ లక్కీ రెడ్డి జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ టూ టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్‌రావు, సీసీఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంలో మహిళల భాగస్వామ్యం పెరగాలి

విశాలాంధ్ర- జిల్లా బ్యూరో మహబూబాబాద్ /తొర్రూర్ : సమాజంలో మార్పు రావాలంటే మహిళల భాగస్వామ్యం అవసరమని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూరు మండల కేంద్రంలోని రెడ్డి గార్డెన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు వేట ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేట ఫౌండర్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి పాల్గొని వివిధ రంగాల్లో గొప్ప ప్రగతి సాధించిన మహిళలను సన్మానించడం జరిగింది. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, వేట ఫౌండర్ ఝాన్సీ రాజేందర్ రెడ్డిలను మహిళలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డిలు మాట్లాడుతూ మహిళలు ఈ సమాజానికి నిలువెత్తు ప్రేరణ అని ,పురుషుల కంటే తక్కువ కాకుండా, అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారన్నారు. ఈ వేడుకలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వేట సభ్యులు, మహిళా సంఘాల నాయకులు, విద్యార్థినులు, ఉద్యోగస్తులు, వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో పెద్దపల్లి: జాతీయ స్థాయి కుంగ్ ఫూ, కరాటే పోటీలు 2005లో జిల్లా విద్యార్థినులు అద్భుత ప్రదర్శన కనబరిచారని వీరికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ స్థాయి ఛాంపియన్షిప్ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబరిచిన పెద్దపల్లి జిల్లా విద్యార్థినులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మార్చ్ 9న పెద్దపల్లి జిల్లాలోని ఎంబీ గార్డెన్స్‌లో జరిగిన జాతీయస్థాయి ఓపెన్ కుంగ్ ఫూ అండ్ కరాటే ఛాంపియన్షిప్ 2025 పోటీలలో పెద్దపల్లి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారన్నారు. జాతీయ స్థాయి ఓపెన్ ఛాంపియన్షిప్ 2025 పోటీలలో పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ పతకాలు గెలుపొందారు.

లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర -జిల్లా బ్యూరోమహబూబాబాద్: అర్హులైన ప్రతి ఒక్కరూ 25 శాతం సబ్సిడీ వినియోగిం చుకుని లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలనిజిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన లే అవుట్ల క్రమబద్ధీకరణ ఎల్ఆర్ఎస్ పథకం 25 శాతం సబ్సిడీ, జిల్లాలో వేగంగా కొనసాగుతుందని, అర్హులైన లబ్ధిదారులు వెంటనే వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లాలోని మరిపెడ, మహబూబాబాద్, మున్సిపల్ పరిధిలలో ఎల్ఆర్ఎస్, ఫీజు చెల్లించిన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీని మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి, నోముల రవీందర్, అందజేశారు. అలాగే తొర్రూరు, డోర్నకల్, గ్రామపంచాయతీ పరిధిలలో ఆన్లైన్ ద్వారా ఫీజు చెల్లించి లబ్ధిదారులు ప్రొసీడింగ్ కాపీలను పొందుతున్నారన్నారు. డోర్నకల్ మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్, వివిధ అభివృద్ధి పనులు, కేజీవిబి పాఠశాల ను తనిఖీ చేశారు. అన్ని వసతి గృహాలలో క్రమం తప్పకుండా మెనూ ప్రకారం డైట్ను అందించాలని తెలిపారు.క్షేత్రస్థాయిలో గ్రామపంచాయతీ, మున్సిపల్ పరిధిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఓసీ ముస్లీంలను బీసీ-ఈ జాబితాలో చేర్చాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : రాష్ట్రంలో వెనుకబడి ఉన్న కొన్ని తెగల ఓసీ ముస్లీంలను బీసీ-ఈ జాబితాలో చేర్చాలని జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండి. యాకూబ్ పాషా కోరారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన చేస్తూ దేశం, రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలు అన్ని రంగాల్లో వెనకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గడచిన నవంబర్, డిసెంబర్ నెలల్లో ప్రణాళికా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో 8 లక్షల 80 వెల 424 మంది ఓసీ ముస్లీంలుగా గుర్తించటం జరిగిందన్నారు. ఈ సంఖ్య జనాభాలో 2.48 శాతం ఉందన్నారు. ఈ ముస్లీంలలో సయ్యద్, పఠాన్ లతో పాటు మరో 14 ఉపకులాలకు చెందిన వారున్నారని, వీరిలో దాదాపు 80 శాతం మంది ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నట్లు చెప్పారు. తెగలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రిజర్వేషన్లకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ వర్గాలలో ఉన్న అత్యంత పేద ముస్లీంలను గుర్తించి బీసీ-ఈలో స్థానం కల్పించే విధంగా ప్రభుత్వం సర్వే చేసి పొందుపార్చాలని ఆయన కోరారు. నేటి నుంచి ప్రారంభం కానున్న శాసన సభ సమావేశాలలో ప్రజాప్రతినిధులందరూ ఈ తెగల సమస్యలకు చర్చించాలని అభ్యర్థించారు.

కమ్యూనిస్టుపార్టీ ప్రతినిధులతోనే పేదల అభివృద్ధి : సీపీఐ



విశాలాంధ్ర - కొత్తగూడెం : కమ్యూనిస్టు పార్టీ ప్రజా ప్రతినిధులతోనే పేద, బాధిత వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజల నమ్మకానికి అనుగుణంగా తమ నేత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నిరంతర కృషి చేస్తున్నారని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా అన్నారు. సిపిఐ లక్ష్మీదేవిపల్లి మండల స్థాయి కౌన్సిల్ సమావేశం మైలారం గ్రామంలో మంగళవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. మండల పరిధిలో పేదల సాగులో వున్నా పోడు భూములు, అంబసత్రం, రెవిన్యూ భూములపై హక్కులు కల్పించాలని అనాదిగా సిపిఐ పోరాడుతోందని గుర్తు చేసారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పెదలను భూముల నుంచి దూరం కానివ్వబోమన్నారు. ఏజెన్సీ మారుమూల గ్రామాలకు కనీస సౌకర్యాలు, సదుపాయాలకు, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఉత్సావాలు ఘనంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఎర్రజెండా ఎగురవేసి త్యాగధనులు స్మరించుకోవాలన్నారు. రైతులు పండించిన మిర్చి, ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. దీటి లక్ష్మీపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, చంద్రగిరి శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు వి పూర్ణచందర్ రావు, నాయకులు కంటెం సత్యనారాయణ, గుత్తుల సత్యనారాయణ, దారా శ్రీనివాసరావు, కుంజా రాంబాబు, కారం జనార్దన్, శాపావత్ రవి, లగడపాటి రమేష్, ఈ రామారావు, మిర్యాల రాము, దేవరగట్ల రాంబాబు, వెంకట నర్సయ్య, గ్రాబ్రియేలు, రామ్ ప్రసాద్, జలీల్ పాషా, కోడి లింగయ్య, జర్పుల ఉపేందర్, బానోత్ నెహ్రూ, పరుపర్తి రాజు, జోగా రాజబాబు పాల్గొన్నారు.

సంపాదకీయం

మారిపోతున్న పశ్చిమాసియా రాజకీయం

పశ్చిమాసియా ప్రపంచంలోకెల్లా అతి పెద్ద మార్కెట్. ఎగుమతి, దిగుమతులకు సంబంధించినంత వరకు అమెరికా, ఆసియా, యూరప్‌లో మాత్రమే కాక ప్రపంచ వ్యాప్తంగా పశ్చిమాసియా ప్రస్తావన వస్తూనే ఉంటుంది. కానీ అమెరికా వాణిజ్య యుద్ధం ప్రకటించడం, చైనాతో ఘర్షణ పడ్తున్నట్టు కనిపిస్తున్న దశలో పశ్చిమాసియా విశిష్ట స్థానాన్ని సంపాదించ బోతోందేమోనన్న అనుమానాలు వస్తున్నాయి. సమీప భవిష్యత్తులో పశ్చిమాసియా వివిధ దేశాల మధ్య ప్రతిస్పర్థలకు కేంద్రం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. పశ్చిమాసియా లోనే ఉన్న ఇరాన్ మీద అమెరికా, ఇజ్రాయిల్ గుర్రుగా ఉన్నాయి. పశ్చిమాసియాలో ఇరాన్ ఒక్కటే అరబ్బు దేశం కానిది. ఇరాన్ ప్రవర్తన ఎప్పుడూ భిన్నంగానే ఉంది. ఇరాన్ రాజు షా మహమ్మద్ పెహ్లావీని అమెరికా గద్దె దించి అక్కడ ప్రజాస్వామ్యం నెలకొల్పుతామని ప్రగల్భాలు పలికింది. తీరా జరిగిందేమిటంటే అక్కడ ముల్లాల పెత్తనం సాగుతోంది. ఇరాన్ షా అధికారంలో ఉన్న సమయంలో ఉన్న స్వేచ్ఛ కూడా ముల్లాల రాజ్యంలో లేదు. మన దేశానికి సంబంధించినంత వరకు అమెరికాతో సంబంధాలున్నాయి. రష్యాతో సాంప్రదాయిక సంబంధాలు భారత్‌కు ఉన్నాయి. భారత-చైనా మధ్య వాణిజ్య సంబంధాలున్నాయి. పశ్చిమాసియాతో భారత్ సంబంధాలు ఈనాటివి కావు. ఆర్థిక, వాణిజ్య సంబంధాలతో పాటు సుదీర్ఘ కాలంగా పశ్చిమాసియాతో భారత్‌కు సాంస్కృతిక సంబంధాలూ ఉన్నాయి. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైన తరవాత వాణిజ్య యుద్ధం ప్రకటించారు. ట్రంప్ తనకు అత్యంత సన్నిహిత మిత్రుడు అని మోదీ ఎన్ని గొప్పలు చెప్పుకున్నా ట్రంప్ భారత్ మీద భారీ సుంకాలు విధించడానికి సిద్ధమయ్యారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే సరుకుల మీద భారత్ విపరీతమైన సుంకాలు విధిస్తోందని, తాము కూడా అదే పని చేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఈ విషయంలో భారత్‌ను నగ్నంగా నిలబెట్టామని, భారత్ బండారం బయటపెట్టామని ట్రంప్ బాహాటంగానే ప్రకటించారు. కానీ భారత్ దీనికి దీటైన సమాధానం ఇప్పటిదాకా చెప్పలేదు. రష్యా-చైనా దేశాల మధ్య సంబంధాలు సవ్యంగానే ఉన్నాయి. రష్యాతో సాన్నిహిత్యం కోసం అమెరికా ఆరాట పడ్తోంది. ట్రంప్ పుణ్యమా అని "బ్రిక్స్" అంతర్థానం అయిపోయింది. దీనివల్ల ఇరాన్‌తో రష్యా కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ నిర్వీర్యం అయిపోతాయా అన్నది పెద్ద ప్రశ్నే. ట్రంప్ వాణిజ్య యుద్ధం ప్రకటించిన తరవాత చైనా గట్టిగానే జవాబు ఇచ్చింది. దీనివల్ల అమెరికా-చైనా వాణిజ్య సంబంధాలలో భారీ ప్రభావం ఉండొచ్చునని అంచనా. కానీ ఇప్పుడు వాణిజ్య యుద్ధంగా కనిపిస్తున్నది అక్కడికే పరిమితం అయిపోతోందా అది యుద్ధానికి దారి తీయకుండా ఉంటుందా అన్న అనుమానాలూ కలుగుతున్నాయి. చాలా దేశాల మధ్య వాణిజ్యం అంటే అందులో ప్రధాన భాగం ఆయుధ వ్యాపారమే అయి ఉంటుంది. ఆయుధాలు ఉత్పత్తి, వ్యాపారం చేసే దేశాలలోనూ అమెరికాదే అగ్రాసనాధిపత్యం. ఆ తరవాత ఫ్రాన్స్, రష్యా, చైనా, జర్మనీ దేశాలు ఆయుధ వ్యాపారంలో అగ్రభాగాన నిలుస్తాయి. ఆయుధ వ్యాపారం ఇంత భారీగా కొనసాగడం అంటే మొత్తం ప్రపంచం యుద్ధోన్ముఖంగానే సాగుతుందనుకోవాల్సి వస్తుంది. అమెరికా గురి ఇరాన్ మీద ఉంది. ఇరాన్‌కు రష్యా, చైనా దేశాల మద్దతు ఉంది. ఈ దశలో అమెరికా, చైనా దేశాలు వాణిజ్య సుంకాలు పెంచుతూ పోతే భారత్ స్థానం ఏమిటి అన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. అమెరికా-చైనా మధ్య వాణిజ్యంలో చైనా ఆదిపత్యం కొనసాగుతోంది. వాణిజ్య యుద్ధంలో చైనాపై ఆధిపత్యం చెలాయించాలన్నదే ట్రంప్ లక్ష్యం. చైనా నుంచి మనం భారీ సంఖ్యలో దిగుమతులు చేసుకుంటున్నాం. దీనికి ప్రత్యామ్నాయ మార్గం కూడా కనిపించడం లేదు.

జరుగుతున్న మార్పులను చైనా సరిగ్గానే అంచనా వేస్తోంది. వచ్చే వారం నుంచి ఇరాన్, రష్యాతో కలిసి చైనా యుద్ధ నౌకా విన్యాసాలు కొనసాగించబోతోంది. ఈ విన్యాసాలు ఇరాన్‌లోని చాబహార్‌లో జరుగుతాయంటున్నారు. ఈ నౌకాయుద్ధ విన్యాసాలను పరిశీలించ డానికి ఆరు దేశాలను ఆహ్వానించారు. ఈ జాబితాలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్, ఇరాక్ ఉన్నాయి. అజర్‌బైజాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, పాకిస్థాన్ దేశాలు కూడా ఉన్నాయి. యుద్ధానికి తాము వ్యతిరేకం అని ట్రంప్ చెప్తున్నారు. కానీ ఆయుధ వ్యాపారానికి అపరిత మైన ప్రాధాన్యం ఇస్తున్నారు. అమెరికా-రష్యా ఒకే వేపున ఉంటే ఇక యుద్ధం ఎక్కడిది అని ట్రంప్ అంటున్నారు. కానీ ఇరాన్, చైనా, రష్యా నౌకా విన్యాసాలు ట్రంప్ మాటకు విలువలేదని రుజువు అవుతోంది. ఇంకో విచిత్ర పరిణామమూ ఉంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ అధినేతకు ఓ లేఖ రాశారు. ఇరాన్ అధినేత అమెరికా చాచిన స్నేహ హస్తాన్ని తోసిపుచ్చారు. ఒత్తిడి చేసి తమను సంప్రదింపులకు సంసిద్ధం చేయలేరని కూడా ఇరాన్ అధినేత అన్నారు. ఇరాన్ మీద అమెరికా ఒత్తిడి చేయడాన్ని ఇజ్రాయిల్ మద్దతిస్తోంది. 2025 యుద్ధాల సంవత్సరం అవుతుందని ఇజ్రాయిల్ అంటోంది. ఎలాగైనా ఇరాన్ అణు పరిశోధనలను నిలిపివేయించాలన్నదే అమెరికా-ఇజ్రాయిల్ దేశాల ప్రయత్నం. నౌకా విన్యాసాలకోసం చైనా ఆహ్వానించిన దేశాల జాబితా చూస్తే అమెరికాను నిలవరించడానికి చైనా ఎంత దూరం ఆలోచిస్తోందో అర్థం అవుతోంది. ఈ పరిణామాలన్నింటిపై భారత్ నుంచి ఎలాంటి ప్రతిస్పందనా లేదు. భారత్ ఏం ఆలోచిస్తోందన్నది చాలా ముఖ్యం. ఎందుకంటే మనం రష్యా, ఇరాన్ నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుంటున్నాం. అది చౌక కూడా. కానీ అమెరికా మనకు ముడి చమురు ఎగుమతి చేయాలనుకుంటోంది. అంటే ముడి చమురు దిగుమతి చేసుకోవాలని మన మీద ఒత్తిడి చేస్తోంది. అంటే పశ్చిమాసియా నుంచి భారత్ ముడి చమురు దిగుమతి చేసుకోకుండా నిరోధించడమే అమెరికా పన్నాగం. చైనా నుంచి కూడా భారత్ సామాగ్రి దిగుమతి చేసుకోకూడదన్నది అమెరికా ఎత్తుగడ. మనం రష్యా నుంచి ఆయుధాలు దిగుమతి చేసుకోవడం కూడా అమెరికాకు ఇష్టం లేదు. ఈ పరిణామాలన్నీ భారత విదేశాంగ నీతికి పెద్ద సవాలు. ఈ సవాలును ఎదుర్కోవడానికి భారత్ ఏ మేరకు సిద్ధం అవుతోందో తెలియదు. కరోనా మహమ్మారి తరవాత పలస్తీనా మీద ఇజ్రాయిల్ అమానుష దాడి, రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం లాంటి యుద్ధ వాతావరణమే కనిపించింది. శాంతి వాతావరణమే లేదు. ఈ రెండు ప్రధాన యుద్ధాలలో కూడా అమెరికా ఒక వేపు ఉక్రెయిన్ తరఫున, మరో వేపున ఇజ్రాయిల్ వేపున నిలబడి తన యుద్ధ సామాగ్రిని విక్రయించి తన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకుంది. అలాంటిది ట్రంప్ ఇప్పుడు పలుకుతున్న శాంతి వచనాలను నమ్మడం ఎలా అన్నదే ప్రశ్న. మరోసారి పశ్చిమాసియాను యుద్ధ రంగంలోకి ఈడుస్తారేమోనన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఇజ్రాయిల్‌కు ఇంతకన్నా సంతోషకరమైంది ఏమీ ఉండదు.

హిందీ సామాన్యుడి భాష కాదు

జస్టిస్ మార్కండేయ కట్జు

ఈ వ్యాసం హిందీలో నిపుణులను తల్లకిందులు చేయవచ్చు. అయినా దాంతో నిమిత్తం లేదు. నేను అంతగా ప్రముఖుడినీ కాదు. అందరికీ తెలియాలని కోరుకునే వాడినీ కాదు. (కొంతమంది ఏమైనా అనుకోనివ్వండి) తరుచు నే చెప్తుంటాను, కొన్ని అంశాలు నన్ను అప్రియుడిగా చేయవచ్చు. అయితే నేను నిజాలు అని నమ్మిన వాటినే చెప్తాను. అవి జనానికి నచ్చవచ్చు లేదా అవి ఇబ్బంది పెట్టవచ్చు. భారత్‌లో హిందీ సామాన్యుడి భాష కాదనేది వాస్తవం, చివరకు హిందీ మాట్లాడే ప్రాంతంలో సైతం హిందీ సామాన్యుడి భాష కాదు. సామాన్యుడి భాష హిందూస్థాని (ఖదిబోలి) అని కూడా అంటారు.

హిందీకి, హిందూస్థానీకి మధ్య తేడా ఏమిటో తెలియజేస్తాను.

హిందూస్థానీలో మనం 'ఉధర్ దేకీయే' (లుక్ దేర్ - అక్కడ చూడండి)' అంటాము. హిందీలో అయితే 'ఉధర్ అవలోకన్ కేజీయే' అని పిలుస్తారు. హిందీ కృత్రిమంగా రూపొందించుకొన్న భాష, బ్రిటీష్ పాలకులు విభజించి పాలించు విధానంలో భాగంగా, హిందువుల భాష హిందీ అని, ఉర్దూ ముస్లింల భాష అని తప్పుడు ప్రచారం సాగించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. నిజంగా 1947 వరకు ఉర్దూ విద్యావంతులందరిది కాగా సామాన్య భాష ఉర్దూ. భారతదేశంలో ఎక్కువ ప్రాంతాల్లో హిందువులు, ముస్లింలు, సిక్కులు తదితరుల భాష ఉర్దూగానే ఉంది. ఇండియా విభజన జరిగి, పాకిస్థాన్ ప్రత్యేక దేశంగా విడిపోయినప్పుడు ఇస్లాం దేశమైంది. దురభిమానులు ఉర్దూ విదేశీ భాష అని తప్పుడు ప్రచారం సాగించారు. అలాగే ఉర్దూ ముస్లింల భాష మాత్రమేనని వీరు ప్రచారం సాగించారు.

ఈ విధానంలో భాగంగా మూఢులు ద్వేషంతో దుష్ట ప్రచారంగావిస్తూ, హిందూస్థానీలోని పర్షియన్, అరబిక్ పదాలను తొలగించారు. ఈ పదాలను సాధారణంగా వినియోగించేవారు. సంస్కృత పదాలను ప్రవేశపెట్టి పర్షియన్, అరబిక్ పదాలను తొలగించారు. ఉదాహరణకు 'జిలా' (డిస్ట్రిక్- జిల్లా)ను 'జన్‌పద్' (జనపదం)తో తొలగించారు. 'కాఫీ' పదాన్ని 'పర్యాప్త్' పదంతో, 'జ్యాదా' ను 'అధిక్' తో 'ముజిరిమ్' (నిందించు)ను, 'అభియుక్త్'తో తదితర పదాలను తొలగిం చారు. వేలు గాకపోయినా వందలాది పర్షియన్ పదాలను తొలగించి వీటి స్థానంలో సంస్కృత పదాలను హిందూస్థానీలో ప్రవేశపెట్టారు. సంస్కృత పదాలను ప్రవేశపెట్టడం కోసం ఉర్దూ పదాలను కత్తిరించారు.

ఒకసారి నేను అలహాబాదు హైకోర్టులో జడ్జిగా పని చేస్తున్నప్పుడు, ఒక లాయరు ప్రతిసారి తన కేసును హిందీలో దాఖలు చేస్తుంటారు, అది కూడా నా ముందు 'ప్రతిభు ఆవేదన పత్ర' గా దాఖలు చేశారు. అప్పుడు నేను 'ప్రతిభు' అంటే అర్థం ఏమిటని అడిగాను. ఆ లాయరు బెయిల్ అని చెప్పారు. అప్పుడు నేను ఆ పిటిషన్‌లో ప్రతిభుకు బదులు బెయిల్ లేదా 'జమానత్' అని రాస్తే అందరికి అర్థమౌతుంది కదా, ప్రతిభు రాస్తే ఎవరికి అర్థం కాదు కదా అని ప్రశ్నించాను.

కోర్టులలో ప్రభుత్వ నోటిఫికేషన్లలో హిందీలో రాస్తే అర్థం చేసుకోవడం కష్టమవుతుంది. తరచుగా 'క్లిష్ట్' (అత్యంత కష్టమైన సంస్కృత పదం). కొన్ని హిందీ పుస్తకాలను క్లిష్ట్ భాషలో రాస్తారు. ఈ భాష చాలా కష్టమని చెప్తారు.

విదేశీ పదాలను రూపాంతరీకరించడం తేలికేనని చెప్తారు, అయితే అది తప్పు. వాస్తవంగా అది కష్టమైంది. అయితే ఐరోపా భాషల నుంచే గాక, అరబిక్, పర్షియన్, హిందూస్థానీ మొదలైన భాషలను పదాలను ఇంగ్లీషులో రూపాంతరీకరించడం (తర్జుమా చేయడం) చాలా కష్టం. అందువల్ల హిందూస్థానీ నుంచి సాధారణంగా వినియోగించే పర్షియన్, అరబిక్ పదాలను తొలగించడం తప్పు.

నా అభిప్రాయం ఏమంటే ఆధునిక హిందీ కవిత్వం రాయడం ఉర్దూ కవిత్వం ఎంత మాత్రం సమానం కాదు.

ఉర్దూ వాక్యాన్ని (బిస్మిల్‌లో పాట) 'సార్ ఫరోషికి తమన్నా అబ్ హమారే దిల్ హై. దీన్ని హిందీలో తర్జుమా చేస్తే 'షేష్ కత్వానేకి ఇచ్ఛా అబ్ హమారే హృదయ్ మే హై. ఇది విప్లవాలలో ఒకటైన పాట లాంటిదేనా?

లేదా ఫైజ్‌లాంటి వాక్యం 'బోల్ కి లాబ్ అజాద్ హై తేరే, బోల్ జుబాన్ అబ్ తక్ తేరి హై'. హిందీలోనే ఎవరైనా కోరుకుంటారా? 'ఉచ్చా రన్ కరో మన్స్' (నోరు లయేదా నాలుకాని అర్థం) స్వతంత్ర హై తుమ్ హరా'? హిందీకి శక్తి లేదు, ఉర్దూకు సున్నితత్వం ఉంది.

రచయిత: సుప్రీంకోర్టు మాజీ జడ్జి, మాజీ ప్రెస్ కౌన్సిల్ ఛైర్మన్

సహకార రుణవ్యవస్థలో రెండంచల విధానం అవశ్యం

వెలుగూరి రాధాకృష్ణమూర్తి

భారతదేశంలో సహకార రుణ వ్యవస్థ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా ఉంది. ప్రస్తుతం మన దేశంలో కొన్ని రాష్ట్రాలలో మూడంచెల సహకార రుణ వ్యవస్థ, మరికొన్ని రాష్ట్రాలలో రెండంచల సహకార రుణ వ్యవస్థ అమలులో ఉంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, రాష్ట్రస్థాయిలో రాష్ట్ర సహకార బ్యాంకు అనే మూడు దొంతరల విధానం కొన్నిరాష్ట్రాలలో అమలులోఉంది. నాబార్డ్ నుంచి రాష్ట్ర సహకారబ్యాంకులకు, రాష్ట్ర సహకారబ్యాంకు నుంచి జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘాలకు, చివరగా రైతుకు వ్యవసాయ రుణం అందిస్తున్నారు. ప్రతి దొంతరలోనూ 1లేక 2శాతం వడ్డీమార్జిన్ వేసుకుని రుణాలు అందిస్తుంటాయి. అందువల్ల, వ్యవ సాయ రుణాలవడ్డీలు రైతాంగానికి తలకు మించిన భారంగా తయారయ్యాయి. వ్యవసాయదార్ల నడ్డి విరిచేస్తున్నాయి. ఫలితంగా, 'స్వల్పవడ్డీరేట్లు లేదా పావలావడ్డీకే వ్యవసాయరుణాలు" అన్న విధానాలకు రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారంచుట్టాయి. తద్వారా అధిక వడ్డీలభారం రాష్ట్ర ప్రభుత్వాలపై పడింది. మరి కొన్ని రాష్ట్రాలలో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రాష్ట్ర సహకార బ్యాంకు అనే రెండు దొంతర్ల వ్యవస్థ అమలులో ఉంది. ఈ విధానంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు లేవు. వాటి స్థానంలో, రాష్ట్ర సహకార బ్యాంకు బ్రాంచీలు పని చేస్తున్నాయి. స్వల్ప వడ్డీరేట్లకే వ్యవసాయ రుణాలు అందించగలుగు తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని సహకార వ్యవసాయ బ్యాంకింగ్ వ్యవస్థలో కూడా సంస్థాగత మార్పులు తీసుకు రావాలని గత 50 సంవత్సరాలుగా అనేక ఆందోళనలు జరుగుతున్నాయి. 1972లో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) ఆధ్వర్యంలో సహకార బ్యాంకు ఉద్యోగుల జాతీయ సదస్సు హైదరాబాదులో జరిగింది. మొదటి దశలో, సహకార రుణవ్యవస్థలో గల దీర్ఘ కాలిక రుణాలను అందించే సహకార వ్యవసాయాభివృద్ధి బ్యాంకులను, పంట రుణాలు లాంటి స్వల్ప కాలిక రుణాలను అందించే జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను విలీనం చేయాలని, తద్వారా సింగిల్ విండో విధానాన్ని అమలు జరపాలని ప్రభుత్వాలకు ఆసదస్సు విజ్ఞప్తిచేసింది. రెండవ దశలో, జిల్లా కేంద్ర సహకార' బ్యాంకులను రద్దుచేసి, రాష్ట్ర సహకార బ్యాంకు బ్రాంచీలుగా మార్చాలని, తద్వారా రెండంచల విధానాన్ని అమలులోకి తీసుకురావాలని జాతీయ సదస్సు డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో, మన రాష్ట్రంలో, 1987 ఏప్రిల్ 1వ తేదీ నుంచి' సింగిల్ విండో" విధానాన్ని నాటి ముఖ్య మంత్రి ఎన్టీ రామారావు అమల్లోకి తీసుకువచ్చారు. సహకార వ్యవసాయాభివృద్ధి బ్యాంకులను రద్దుచేసి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకులలో విలీనం చేశారు. అప్పటి నుంచి పంట రుణాలు లాంటి స్వల్ప కాలిక రుణాలతోపాటు, దీర్ఘకాలిక రుణాలను సైతం ఒకే చోట నుంచి పంపిణీ చేయటం ప్రారంభ మైంది. అంటే, రైతుకు ఏ తరహా రుణం కావాలన్నా ఒకే చోట నుంచి లభించే సౌకర్యం కల్పించారు. అయితే "రెండంచల విధానం అమలు" అనే లక్ష్యం అలాగే మిగిలిపోయి ఉంది. ఈ లక్ష్యసాధన కోసం, జాతీయ స్థాయిలో ఏఐబీఈఏ నాయకత్వంలో అనేక ఆందోళనలు జరిగాయి. మన రాష్ట్రంలో సైతం, వేలాదిమంది రైతులు, ఉద్యోగులతో ప్రదర్శనలు, ర్యాలీలు, ధర్నాలు జరిగాయి. లక్ష లాదిమంది ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. వివిధ రాజకీయ పార్టీల, ప్రజా ప్రతినిధుల, మేధావుల, సహకారవేత్తల మద్దతుతో అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహిం చారు. జిల్లా కేంద్ర సహకారబ్యాంకులను రద్దుచేసి, రాష్ట్రసహకారబ్యాంకు బ్రాంచీలుగా విలీనం చేయడం ద్వారా, రెండంచ ల విధానాన్ని ప్రవేశపెట్టాలనీ, తద్వారా, వ్యవసాయ రుణాల వడ్డీభారం నుంచి రైతాంగానికి విముక్తి కల్పించమేగాక, సహకార బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతానికి దోహదపడాలన్న డిమాండ్‌కు సర్వే సర్వ త్రా ఆమోదం లభించింది. అయితే రాష్ట్ర విభజన అంశం ముందుకు రావడంవల్ల, ఈ విషయం మరుగున పడిపోయింది. ఇప్పటికైనా, సహకార బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతం కావాలంటే, రెండంచెల విధానాన్ని అమలు జరపటం తప్ప మరో మార్గంలేదు. గ్రామీణ ప్రాంతాల్లో, వ్యవసాయాభివృద్ధికి స్వల్ప వడ్డీరేట్లకు, సకాలంలో, అధిక మొత్తాలలో, వ్యవసాయ రుణాలను సజావుగా అందించాలంటే ఈ మార్పులు తీసుకురావటం ఆవశ్యం.

రెండంచెల విధానం వల్ల ప్రయోజనాలు:

మధ్య దొంతరగా ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు రద్దు కావడం వల్ల, వ్యవసాయ రుణాల పంపిణీలో జాప్యం తగ్గుతుంది. మూడు దొంతరల మధ్య సమన్వయం కంటే, రెండు దొంతర్ల మధ్య సమన్వయం తేలికగా ఉంటుంది. మూడు దొంతర్ల మధ్య సమన్వయం అనే ప్రసక్తి లేకుండా, పాలన నేరుగా రాష్ట్ర సహకార బ్యాంకు పరిధిలోకి వస్తుంది. పాలనలో అవినీతి లేదా నిర్వాహక లోపాలు నివారించటం సులభంగా ఉంటుంది. నిధుల అందుబాటు వేగంగా ఉంటుంది. రాష్ట్ర సహకార బ్యాంకు నుంచి నేరుగా పీఏసీఎస్‌కు, ఆ వెంటనే రైతాంగానికి రుణాలు అందుతాయి. బ్యాంకు ఆర్థిక పరి స్థితి మెరుగుపడు తుంది. బ్యాంకింగ్ కార్యకలాపాల నిర్వహణ సరళంగా ఉంటుంది. బ్యాంకు పాలనాపరిధి రాష్ట్ర మంతటికీ విస్తరించి ఉండటం వల్ల, ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలను సమర్థవంతంగా అందించటం సాధ్యమవు తుంది. పరిపాలనా సమర్థత పెరుగుతుంది. ఆర్థికస్థిరత్వం పెరుగుతుంది. ప్రజల విశ్వాసాన్ని చూరగొనగల్గుతుంది. సున్నితమైన బ్యాంకింగ్ రంగంలో ఇది చాలా అవసరం. కార్యకలాపాల నిర్వహణలో, అనవసర కాల యాపన, ద్వంద్వ ప్రమాణాలకు అవకాశం ఉండదు. డిజిటల్ లావాదేవీలు వేగవంతంగా, సులభతరంగా జరిగే అవకాశం ఉంటుంది. రాష్ట్ర సహకార బ్యాం కుకు "షెడ్యూల్ట్" హోదా లభిస్తుంది. కనుక, గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకింగ్ వ్యవస్థను విస్తరింపజేసి, గ్రామీణ ప్రజల బ్యాంకింగ్ అవసరాలు తీర్చటంలో రెం డంచల విధానం సమర్థవంతంగా వ్యవహరిస్తుంది. సహకార బ్యాంకింగ్ వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలలో ప్రధానమైనది నిరంతర రాజకీయ జోక్యం. సహకార సూత్రాలకు విరుద్ధంగా వ్యవహరించడం, రుణాల మంజూరులోనూ, వసూళ్లలోనూ మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల అనేక బ్యాంకులు సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. రెండంచల విధానం అమలు చేయడం వల్ల, అడ్డగోలు రాజకీయ జోక్యాన్ని నివారించటం సాధ్యమవుతుంది. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించేందుకు బ్యాంకులకు స్వతంత్రత ఏర్పడుతుంది. కామన్ అకౌంటింగ్ సిస్టం, మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టంలను సమర్థవంతంగా అమలు జరిపేందుకు రాష్ట్ర సహకార బ్యాంకు ఒక సమిష్టి వేది కగా వ్యవహరించగలుగుతుంది.

కమిషన్ల సిఫారసులు

సహకారవ్యవస్థలో రెండంచల విధానాన్ని అమలు జరపటం బ్యాంకుల అభివృద్ధికి దోహదం చేస్తుందని, రైతాంగానికి సమర్థ వంతమైన సేవలు అందించగలవని అనేక కమిషన్లు సిఫారసు చేశాయి. ఖైథాన్ కమిటీ (1958), భావే కమిటీ (1975), రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ డాక్టర్ హజారే కమిటీ (1975), బ్రహ్మండం కమిటీ (1995), శివాజీరావు పాటిల్ ఆధ్వర్యంలోని సహకార వ్యవస్థపై ఉన్నత స్థాయి కమిటీ(2009), చౌదరి కమిటీ (1999), ప్రకాశ్ బక్షి కమిటీ (2012) ఇంకా అనేక ఉన్నత స్థాయి కమిటీలు రెండంచల విధానానికి మొగ్గు చూపాయి. ఖర్చులు తగ్గించాలంటే దొంతర్లను తగ్గిం చాల్సిందే నని నరసింహన్ కమిటీ తేల్చిచెప్పింది. ఇంకా ఖుస్రో, డాక్టర్ వైద్యనాథన్, కపూర్ కమిటీ సైతం ఆయా రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా, సహకార బ్యాంకింగ్‌లో వ్యవస్థాగత మార్పులు తీసుకు రావాలని సిఫారసు చేశాయి. సహకార రంగ నిపుణులు, నాబార్డ్ మాజీ ఛైర్మన్ రంజనా కుమార్ రెండంచెల విధానంపై తమ అనుకూలతను అనేక సార్లు ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు మెరుగుపరిచేం దుకు ఈ విధానం ఎంతగానో దోహదంచేస్తుందని ఆమె అనేకమార్లు చెప్పారు. ఈ విషయంపై సూచనలు చేయటానికి, కేరళ రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ సీఎస్ రంజిత్ నేతృత్వంలో ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. రాష్ట్ర సహకారబ్యాంకు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను విలీనం చేయాలని తద్వారా రెండంచల విధానాన్ని అమలుచేయాలని రంజిత్ కమిటీ సిఫారసు చేసింది. కేరళ రాష్ట్రంలో ఎల్డీఎఫ్ ప్రభుత్వం రెండంచల విధానాన్ని అమలులోకి తెచ్చింది. అరుణాచలప్రదేశ్, చండీగఢ్, మణిపూర్, మేఘా లయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, జార్ఖండ్, అస్సాం, త్రిపుర రాష్ట్రాలలో రెండంచల విధానం అమలులోకి వచ్చింది. చత్తీస్‌గఢ్ ,ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, పంజాబ్, బీహార్ తదితర రాష్ట్రాలలో రెండంచల విధానం అమలు దిశగా ఉన్నత స్థాయి కమిటీలను నియమించారు. రెండంచల విధానం అమలు జరపాలనుకునే రాష్ట్ర ప్రభుత్వాలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో సైతం, సహకార బ్యాంకింగ్ వ్యవస్థ బతికి బట్టకట్టాలంటే, రెండంచల విధానం అమలుకు చర్యలు చేపట్టాలి.

ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు

స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ పాద ముద్రలు

ఆర్వీ రామారావ్

వందేళ్ల భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) చరిత్రలో అనేక కుట్ర కేసులు ఎదుర్కోవలసి వచ్చింది. దేశద్రోహ ఆరోపణలూ భరించవలసి వచ్చింది. బుల్లెట్లకు బలి కావాల్సి వచ్చింది. జైలు జీవితం గడపాల్సి వచ్చింది. ఉరికంబాలు ఎక్కాల్సి వచ్చింది. జాతీయోద్యమంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్ కేవలం పరిమితమైన స్వాతంత్ర్యమే తమ లక్ష్యం అని అంటున్న సమయంలో 1921లోనే సంపూర్ణ స్వరాజ్యం కోసం సీపీఐ ముందడుగేసింది. 1921లో అహమదాబాద్‌లో కాంగ్రెస్ మహాసభ జరుగుతున్నప్పుడు కమ్యూనిస్టు అయిన హస్రత్ మోహాని, స్వామీ కుమారానంద సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని తీర్మానం ప్రతిపాదించారు. మగ్ఫూర్ అహమద్ ఏజాజ్ ఈ తీర్మానాన్ని బలపరిచారు. మహాత్మా గాంధీ ఈ ప్రతిపాదనను తోసిపుచ్చారు. "ఈ తీర్మానంలో బాధ్యత లేదు కనక నాకు విచారం కలిగింది" అని గాంధీ వ్యాఖ్యానించారు. ఆ తరవాత ఎనిమిదేళ్లకు గానీ 1929 డిసెంబర్‌లో కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్ మాటెత్తలేదు.



వందేళ్ల సీపీఐ ప్రస్థానంలో సువర్ణాధ్యాయాలు ఉన్నాయి. అపారమైన త్యాగాలూ ఉన్నాయి. 1925లో కమ్యూనిస్టు పార్టీ అవతరించకముందు నుంచే మన దేశంలో కమ్యూనిస్టు భావజాలం వ్యాప్తిలోకి వచ్చింది. వ్యవస్థాపరంగా పార్టీ లేకపోయినా కమ్యూనిస్టు భావజాలమే కాదు, కమ్యూనిస్టులూ ఉండేవారు. 1919లో గాంధీ నాయకత్వంలోని సహాయ నిరాకరణోద్యమం తరవాత, సైమన్ కమిషన్ పర్యటనను వ్యతిరేకించిన నేపథ్యంలో కమ్యూనిస్టు భావజాలం ఉన్న సంస్థలు, బృందాలు ఏర్పడ్డాయి. గదర్ పార్టీ నుంచి మొదలు పెట్టి హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్ ఏర్పాటు కమ్యూనిస్టు భావజాలం ఉన్న వారు సంఘటితం కావడానికి చేసిన ప్రయత్నాల్లో భాగమే. సచ్చిదానంద సన్యాల్, జాదూ గోపాల్ ముఖర్జీ, జోగేశ్ చంద్ర చటర్జీ మొదలైన వారు కాన్పూర్ లో సమావేశమై హిందుస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఆ తరవాత భగత్ సింగ్ ప్రభావంతో ఇది హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌గా మారింది. కమ్యూనిస్టు భావాలు ఉన్న వారు బ్రిటిష్ వలసవాదుల పాలనలో భరించరాని కష్టాలు ఎదుర్కోవలసి వచ్చింది. అనేక రకాల నిరసనలు, సమ్మెలు, ఇతర కార్యకలాపాల ద్వారా కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొన్నది. స్వాతంత్ర్యం కోసం జరిగిన విప్లవ పోరాటంలో సీపీఐ భాగస్వామి. రైతులను, కార్మికులను సమైక్యం చేయడం ద్వారా సీపీఐ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించింది. దేశంలోని పెట్టుబడిదారీ వర్గానికి, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడడం సీపీఐ ప్రధాన లక్ష్యంగా ఉండేది. బ్రిటిష్ వలసవాదుల నుంచి విముక్తి సంపాదించడం కోసం కొనసాగిన జాతీయోద్యమం కేవలం మహాత్మా గాంధీ నాయకత్వంలోనే జరగలేదు. అది ప్రధాన స్రవంతి అనడంలో సందేహం లేదు. అసలు స్వాతంత్ర్య పోరాటమే బహుముఖాలుగా సాగింది. ఉద్యమకారులు భిన్నమైన పరిస్థితుల్లో విభిన్నమైన వ్యూహాలు అనుసరించారు. అందులో శాసనోల్లంఘన దగ్గర నుంచి సాయుధ తిరుగుబాటు, పోరాట పటిమ దండిగా ఉన్న విధానాలు అనుసరించిన పక్షాలు, రాజకీయ సంప్రదింపుల మీద ఆధారపడ్డవారు - ఇలా అనేక పాయలుగా స్వాతంత్ర్యోద్యమం కొనసాగింది.



హస్రత్ మోహాని



స్వామీ కుమారానంద

స్వభావ రీత్యా కమ్యూనిస్టు భావజాలం ఉన్న వారు సామ్రాజ్యవాద వ్యతిరేకులు. "చరిత్ర ఏ మలుపైనా తిరగొచ్చు. కానీ మన భాగస్వామ్యం లేకుండా చరిత్రను ఏ మలుపూ తిరగనివ్వం" అని 20వ శతాబ్ద ఆరంభంలోనే లెనిన్ వ్యాఖ్యానించారు. ఈ అభిప్రాయం ఆధారంగానే ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులు వర్గ పోరాటాల్లోనే కాకుండా వలసవాద వ్యతిరేక పోరాటాల్లోనూ పాల్గొన్నారు. మన దేశంలో జరిగిన పోరాటం కూడా ఇలాంటిదే. కాంగ్రెస్ సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరి అనుసరించేటట్టు చేయడంలో కమ్యూనిస్టుల ప్రభావం, ఒత్తిడి కూడా బలంగా పని చేశాయి. వలసవాద వ్యతిరేకత, సామ్రాజ్యవాద వ్యతిరేకత స్వాతంత్ర్యానికి పూర్వం సీపీఐ కార్యకలాపాలకు మూలకందం.

కమ్యూనిస్టు పార్టీ ఏర్పడడానికి ముందు, ఆ తరవాత కూడా ఉద్యమానికి విశాల ప్రాతిపదిక ఏర్పాటు చేయడం కోసం వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ (డబ్లు.పి.పి.) లాంటివి ఏర్పడుతూనే వచ్చాయి. బెంగాల్‌లోని పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ డబ్ల్యూ.పి.పి.కి స్ఫూర్తినిచ్చింది. డబ్లు.పి.పి. 1928లో ఏర్పడింది. ఈ పార్టీ ఏర్పడిన మొదట్లోనే ఆర్థిక, సామాజిక అభ్యున్నతి ఆధారంగా సంపూర్ణ స్వరాజ్యం కావాలని పిలుపు ఇచ్చింది. ఈ పార్టీ సుభాష్ చంద్రబోసు అరెస్టుకు, ఆయనను మాండలే జైలులో ఉంచడానికి నిరసనగా పోరాటం చేసింది. కాంగ్రెస్ వార్షిక మహాసభ జరుగుతున్న సమయంలో డబ్ల్యు.పి.పి. 1928 డిసెంబర్ 30న కాంగ్రెస్ మహాసభ జరుగుతున్న చోటికి 20,000 మంది కార్మికులతో బ్రహ్మండమైన ఊరేగింపు నిర్వహించింది. అది మోతీలాల్ నెహ్రూ కమిటీ నివేదికకు నిరసన కూడా. సంపూర్ణ స్వరాజ్యాన్ని కాంగ్రెస్ తమ లక్ష్యంగా ప్రకటించాలని ఈ ప్రదర్శనలో పాల్గొన్న వారు గట్టిగా కోరారు. కాంగ్రెస్ అప్పటికి డొమినియన్ స్టేటస్ (అధినివేశ ప్రతిపత్తికి) మాత్రమే పరిమితం అయి ఉంది. ఆ తరవాత సోషలిస్టు యూత్ కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించిన జవహర్ లాల్ నెహ్రూ కమ్యూనిజం మాత్రమే ఏకైక మార్గం అని ప్రకటించారు.

కమ్యూనిస్టుల నాయకత్వంలో కార్మికోద్యమం క్రమంగా పుంజుకోవడం మొదలైంది. 1928లో సమ్మెల వల్ల మూడు కోట్లకు పైగా పని దినాలు నష్టపోవాల్సి వచ్చింది. ఇది అంతకు ముందు అయిదేళ్ల కాలంలో నష్టపోయిన పని దినాలకన్నా ఎక్కువ. బొంబాయి జౌళి కార్మికుల సమ్మె ఆరు నెలలకన్నా ఎక్కువ కాలం కొనసాగింది. అందులో 1,50,000 మంది కార్మికులు పాల్గొన్నారు. ఆ సమ్మె కాలంలోనే గిర్నీ కారంగార్ యూనియన్ ఏర్పాటు అయింది. ఈ సంఘం 324 మందితో మొదలై 1928 డిసెంబర్ నాటికి గిర్నీ కారంగార్ యూనియన్ సభ్యుల సంఖ 54,000కు పెరిగింది. ఆ నాడు కమ్యూనిస్టు పార్టీ రాజకీయ శక్తి అంత బలంగా ఉండేది. పారిశ్రామిక కార్మికుల్లో, పెద్ద పట్టణాల్లో కమ్యూనిస్టుల ప్రాబల్యం అధికారవర్గాలలో వణుకు పుట్టించేది. కమ్యూనిస్టులకు పరిస్థితి ఎంత అనుకూలంగా ఉండేదంటే 1929లో బాంబే క్రానికల్ "సోషలిజం కనుచూపు మేరలో ఉంది" అని రాయాల్సి వచ్చింది.

ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణ చెప్పాలి

సీపీఐ సహా తమిళనాడు ఎంపీల డిమాండ్- పార్లమెంటు వద్ద నిరసన

న్యూఢిల్లీ: జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ), త్రిభాషా విధానం అమలు విషయంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలను తమిళనాడుకు చెందిన ఎంపీలు తీవ్రంగా ఖండించారు. తమ రాష్ట్రాన్ని అవమానించిన ధర్మేంద్ర ప్రధాన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఆయనను కేబినెట్ నుంచి తొలగించాలన్నారు. ఇదే క్రమంలో సీపీఐ ఎంపీలు కె.సుబ్బరాయన్, వి.సెల్వరాజ్‌తో పాటు డీఎంకే, ఐఎన్‌సీ, సీపీఎం, వీసీకే ఎంపీలు మంగళవారం పార్లమెంటు వద్ద నిరసన తెలిపారు. నల్లరంగు వస్త్రాలతో కొందరు ఎంపీలు ధర్నాలో పాల్గొన్నారు. బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. నినాదాలు చేశారు. ఎన్‌ఈపీపై, త్రిభాషా విధానంపై వెనక్కి తగ్గాలని డిమాండ్ చేశారు. తాము హిందీకి వ్యతిరేకం కాదని, దానిని బలవంతంగా తమపై ఆపాదించడాన్నే వ్యతిరేకిస్తున్నామని తేల్చిచెప్పారు. ఇదిలావుంటే లోక్‌సభలో ధర్మేంద్ర ప్రధాన్ డీఎంకేపై ఘాటు విమర్శలు చేశారు. తమిళనాడు విద్యార్థుల భవిష్యత్ పణంగా పెట్టి రాజకీయం చేస్తోందని, డీఎంకేకు నిజాయతీ లేదని అన్నారు. తమిళనాడు విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేస్తోందని, భాషపై రాజకీయం చేయడమే పనిగా పెట్టుకుందని వ్యాఖ్యానించారు. డీఎంకే తీరు అప్రజాస్వామికమన్నారు. వీరంతా అనాగరికులు అని ధర్మేంద్ర ప్రధాన్ విమర్శించారు. ఈనేపథ్యంలో సీపీఐతో సహా తమిళనాడుకు చెందిన ఎంపీలంతా ఆగ్రహం వ్యక్తంచేశారు. అనాగరికులు అంటూ కేంద్ర మంత్రి మాట్లాడటం అప్రజాస్వామికమని అన్నారు. ఎన్‌ఈపీ, త్రిభాషా విధానానికి అంగీకరిస్తేనే మా రాష్ట్రానికి రావాల్సిన నిధులు విడుదల చేస్తామని కేంద్రం మెలికలు పెడుతోందని, బలవంతంగా వాటిని ఆపాదించేందుకు యత్నిస్తూ తమిళనాడు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేందుకు యత్నిస్తోందని ఎంపీలు దుయ్యబట్టారు. కేంద్రం తీరును, త్రిభాషా విధానంతో పాటు పునర్విభజనను వ్యతిరేకించారు. ఇదే క్రమంలో డీఎంకే సభ్యులు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. ఆపై కోయంబత్తూరులో డీఎంకే అధ్వర్యంలో పెద్దఎత్తున నిరసనలు జరిగాయి.

కేంద్రం నిరంకుశత్వం: ఖర్గే

జాతీయ నూతన విద్యా విధానం (ఎన్‌ఈపీ), త్రిభాషా విధానం... ఈ రెండు అంశాలపై రాజ్యసభలో వరుసగా రెండో రోజు మంగళవారం రగడ చోటు చేసుకుంది. రాజ్యసభలో ఉదయం ప్రశ్నోత్తరాల సమయం అనంతరం విద్యాశాఖ పనితీరుపై చర్చ మొదలైంది. చర్చను ప్రారంభించాలని కాంగ్రెస్ సభ్యుడు దిగ్విజయ్ సింగ్‌కు డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సూచించారు. ఈ సమయంలో ధర్మేంద్ర ప్రధాన్ తమిళనాడు ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలంటూ డీఎంకే ఎంపీలు పట్టుబట్టారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎంపీ మల్లికార్జునఖర్గే జోక్యం చేసుకుంటూ... తాను ఉదయం మాట్లాడినప్పుడు విద్యాశాఖ మంత్రి సభలో లేరని, కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా ప్రవర్తిస్తోందన్నారు. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు విపక్షాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని ఒక వర్గం ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిదంటూ ఖండించారు. 'వారు దేశాన్ని విభజించడం గురించి... దేశాన్ని విచ్ఛిన్నం చేయడం గురించి మాట్లాడుతున్నారు" అని తీవ్ర స్వరంతో అన్నారు. మోదీ ప్రభుత్వంలోని ఆ మంత్రి (ధర్మేంద్ర ప్రధాన్) వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన్ వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదని... తమిళ ప్రజల గౌరవం, హక్కుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపించారని మండిపడ్డారు. ఖర్గే వ్యాఖ్యలు సభలో దుమారం రేపాయి. దీంతో ఆయన డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌కు క్షమాపణ చెప్పారు.

ఎన్‌ఈపీపై చర్చ చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎక్కడ ఉన్నారని ఖర్గే ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని తోసి వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. 'తోకేంగే' అంటూ హిందీ పదాన్ని వాడారు. దీని పట్ల బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అధ్యక్ష స్థానాన్ని చూస్తూ ఖర్గే చేసిన వ్యాఖ్యలు అప్రజాస్వామికంగా ఉన్నాయని ఆరోపించింది. ఖర్గే క్షమాపణలు చెప్పాలని బీజేపీ సభ్యుడు జేపీ నడ్డా డిమాండ్ చేశారు. దీంతో ఖర్గే స్వచ్ఛందంగా ఆ వ్యాఖ్యను ఉపసంహరించుకున్నారు. 'క్షమించండి. నేను మీ గురించి (చైర్) మాట్లాడలేదు. ఇది ప్రభుత్వ విధానాల గురించి. నా వ్యాఖ్యల వల్ల మీరు బాధపడితే నన్ను క్షమించండి' అని ఆయన అన్నారు. ఖర్గే వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు డిప్యూటీ చైర్మన్ ప్రకటించారు.

రోజుకు 8 మంది రైతన్నల ఆత్మహత్య

మహారాష్ట్ర మంత్రి అంగీకారం

ముంబై: బీజేపీ నేతృత్వంలోని మహాయుతి పాలిత మహారాష్ట్రలో రైతన్నల బలవన్మరణాలను మంత్రి మకరంద్ జాదవ్ పాటిల్ అంగీకరించారు. రాష్ట్రంలో 56 నెలల్లో రోజుకు సగటున 8 మంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నారన్న వార్త పాక్షికంగా వాస్తవమని తెలిపారు. శాసనమండలిలో ఎన్‌సీపీ ఎమ్మెల్సీ శివాజీరావు ప్రశ్నకు సహాయ, పునరావాస శాఖ మంత్రి మకరంద్ సమాధానం చెబుతూ... ఛత్రపతి శంభాజీ నగర్, అమరావతి డివిజన్లలో రైతుల ఆత్మహత్యలు మిగిలిన ప్రాంతాల్లో కన్నా ఎక్కువ అని తెలిపారు. మరఠ్వాడా డివిజన్‌లో 952 మంది, అకోలాలో 168 మంది, వారాలలో 112 మంది, బీడ్‌లో 205 మంది, అమరావతి డివిజన్‌లో 1,069 మంది రైతులు గతేడాది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఛత్రపతి శంభాజీ నగర్ డివిజన్‌లో 707 మంది ఆర్థిక సాయం పొందేందుకు అర్హులని చెప్పారు.

ఒడిశా అసెంబ్లీలో గందరగోళం

సభలో కొట్టుకున్న బీజేపీ-కాంగ్రెస్ సభ్యులు

భువనేశ్వర్: ఒడిశా అసెంబ్లీలో యుద్ధ వాతావరణం నెలకొంది. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు పరస్పరం దుర్భాషలాడుకుంటూ... ఒకర్నొకరు తోసుకుంటూ వీరంగం సృష్టించారు. దీంతో స్పీకర్ సురామపాధి మధ్యాహ్నం వరకు కార్యకలాపాలను వాయిదా వేయాల్సి వచ్చింది. మంగళవారం అసెంబ్లీ సమావేశమవగానే ప్రతిపక్ష బీజేడీ, కాంగ్రెస్ సభ్యులు వేర్వేరు అంశాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ... నిరసన తెలిపారు. 1936లో పూర్వపు కోశల ప్రాంతాన్ని ఒడిశాలో విలీనం చేయడం 'చారిత్రక తప్పిదం' అని మిశ్రా చేసిన వ్యాఖ్యపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రకటన చేయాలని బీజేడీ సభ్యులు డిమాండ్ చేయగా... రాష్ట్రంలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేశారు. సభలో తీవ్ర గందరగోళం కొనసాగుతుండగానే స్పీకర్ సురామపాధి ప్రశ్నోత్తరాల కార్యక్రమం చేపట్టారు. పట్టణాభివృద్ధి మంత్రి కేసీ మహాపాత్ర ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తుండగా... మంత్రి ఎదుట నిలబడి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బహినిపతి వైపు బీజేపీ సీనియర్ శాసనసభ్యుడు జయనారాయణ మిశ్రా దూసుకెళ్లడంతో సభలో ఉద్రిక్తత నెలకొంది. వెంటనే అధికార బీజేపీ, కాంగ్రెస్ కు చెందిన ఇతర సభ్యులు కూడా గొడవ పడ్డారు. పరస్పరం దూషించుకుంటూ ఒకర్నొకరు తోసుకోవడంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. బీజేడీ సభ్యులు కూడా వెల్‌లోకి దూసుకువచ్చినప్పటికీ గొడవలో పాల్గొనలేదు. "మిశ్రా నా చొక్కా కాలర్ పట్టుకుని నన్ను నెట్టారు. సభ క్రమంలో లేనప్పుడు సమాధానం ఇవ్వడం ఆపమని నేను మంత్రి మహాపాత్రను అభ్యర్థిస్తున్నాను. నేను అతనిని చేతులు ముడుచుకుని అడిగాను. కానీ, మిశ్రా అకస్మాత్తుగా నా దగ్గరకు వచ్చి నా కాలర్ పట్టుకున్నాడు" అని బహినిపతి సభ వెలుపల విలేకరులతో అన్నారు. కాగా బీజేడీ ఎమ్మెల్యేలు రాష్ట్ర అసెంబ్లీలోని ఒడిశా ముఖ్యమంత్రి కార్యాలయం వెలుపల నిరసన తెలిపారు. గత రెండు రోజులుగా ముఖ్యమంత్రి సభకు రాకపోవడంతో బీజేడీ సభ్యులు లాంతర్లతో అసెంబ్లీ ఆవరణలో ఆయన కోసం వెతుకుతూ వినూత్నంగా నిరసన తెలిపారు.

డీలిమిటేషన్‌తో సీట్ల సంఖ్య పెరుగుతుంది: రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ: లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన అమలుపై దక్షిణాది రాష్ట్రం తమిళనాడు కొంతకాలంగా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని, పార్లమెంట్‌లో సీట్ల సంఖ్య తగ్గుతుందని డీఎంకే ప్రభుత్వం వాదిస్తోంది. దీనిపై కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. 'డీలిమిటేషన్ ప్రక్రియ ప్రణాళికబద్ధంగా కొనసాగుతుందని భావిస్తున్నా. దీనిపై అభ్యంతరాలు ఉంటే తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌కు వాటిని లేవనెత్తే స్వేచ్ఛ ఉంటుంది. ఆ అంశాలపై సంబంధిత అధికారులు చర్చలు జరుపుతారు. నిర్ణయం న్యాయంగా ఉంటుంది. శాసనసభల లేదా లోక్‌సభలకు సంబంధించి ప్రతి రాష్ట్రంలోనూ నియోజకవర్గాల పునర్విభజన తర్వాత సీట్ల సంఖ్య సహజంగానే పెరుగుతుంది' అని రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు. 'తమిళనాడు సహా ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళలో కూడా సీట్ల సంఖ్య పెరుగుతుంది. కేవలం ఉత్తరాది రాష్ట్రాలకే ప్రయోజనం చేకూరుతుందనేది సరైన వాదన కాదు' అని చెప్పారు. కాగా... లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కొంతకాలంగా కేంద్రంపై విమర్శలు గుప్పిస్తోన్న సంగతి తెలిసిందే. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాలను నిర్ణయిస్తే... రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీలిమిటేషన్ వ్యతిరేకించాలని కోరుతూ స్టాలిన్... ఏడుగురు ముఖ్యమంత్రులకు లేఖ రాశారు.

మాజీ సీఎం కుమారుడికి ఈడీ సమన్లు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సమన్లు జారీ చేశారు. చైతన్య బఘేల్ మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సోమవారం ఆయన నివాసంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయనకు సమన్లు పంపారు. మార్చి 15న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారుల ముందు విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్‌కు సంబంధించిన ఆరోపణలు రావడంతో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. భిలాయ్‌లోని ఆయన నివాసంతోపాటు చైతన్య స్నేహితులు, కుటుంబ సభ్యులకు సంబంధించి రాష్ట్రంలోని 14 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో రూ.30 లక్షల నగదు, కొన్ని పత్రాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లు స్వాధీనం చేసుకున్నారు. కాగా, మద్యం కుంభకోణం ద్వారా రాష్ట్ర ఖజానాకు భారీగా నష్టం వాటిల్లిందని, మద్యం సిండికేట్‌కు రూ.21 వేల కోట్లకు పైగా లాభం చేకూరిందని దర్యాప్తు సంస్థ ఆరోపించింది. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నది.

టీవీకే అధినేత విజయ్‌పై కేసు

చెన్నై: తమిళ హీరో విజయ్ చిక్కుల్లో పడ్డారు. ఆయన మీద కేసు నమోదైంది. ఇఫ్తార్ విందును అవమానించారంటూ ఆయనపై ముస్లిం సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. సౌత్ ఇండియా స్టార్ హీరోగా ఎదిగిన విజయ్... ఇటీవల రాజకీయ రంగ ప్రవేశం చేశారు. తమిళ వెట్రి కజగం అనే పార్టీని స్థాపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పార్టీ కార్యక్రమాలు మొదలు పెట్టారు. ఇందులో భాగంగానే ముస్లిం పెద్దలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంజాన్ సందర్భంగా చెన్నైలోని రాయపేట వైఎంసీఏ మైదానంలో విజయ్ ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఇందులో విజయ్ స్కల్ క్యాప్ ధరించి ఉపవాసం ముగించే సమయంలో ప్రార్థనలో పాల్గొన్నారు. అయితే ఈ ఇఫ్తార్ విందుపై సున్నత్ జమాత్ అనే ముస్లిం సంఘం ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎంతో పవిత్రంగా భావించే ఇఫ్తార్ విందును విజయ్ అవమానించారంటూ మండిపడ్డారు. ఈ మేరకు వారు చెన్నై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. 'విజయ్ నిర్వహించిన ఇఫ్తార్ విందులో ముస్లింలకు తీవ్ర అవమానం జరిగింది. ఆ విందులో కొందరు తాగుబోతులు, ఉపవాసం లేని వారు పాల్గొన్నారు. ఇఫ్తార్ విందు అంటే అత్యంత పవిత్రతతో ఉపవాసం ఉన్న ముస్లింలు మాత్రమే చేయాలి. కొందరు బాడీగార్డులు అక్కడ ముస్లింలను నెట్టేశారు. ఇది ముస్లింల మనోభావాలను దెబ్బతీయడమే' అని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

భారత రెజ్లింగ్ సమాఖ్యపై సస్పెన్షన్ రద్దు

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్‌ఐ)పై విధించిన సస్పెన్షన్‌ను క్రీడా మంత్రిత్వ శాఖ మంగళవారం రద్దు చేసింది. ఫిర్యాదులపై డబ్ల్యుఎఫ్‌ఐ చర్యలు తీసుకుంది, దీంతో క్రీడలు, అథ్లెట్ల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా డబ్ల్యుఎఫ్‌ఐపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నిర్ణయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. డిసెంబర్ 21న ఎన్నికైన కొత్త సమాఖ్య పాలన, నిర్వహణలో విధానపరమైన లోపాల కారణంగా క్రీడా శాఖ డబ్ల్యుఎఫ్‌ఐపై 2023 డిసెంబర్ 24న చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. డబ్ల్యుఎఫ్‌ఐ అధ్యక్షుడిగా ఎన్నికైన సంజయ్ సింగ్ యూపీలోని గోండా జిల్లాలో నందిని నగర్‌లో అండర్ -15, అండర్ -20 క్రీడాకారులకు ఆతిథ్యం ఇస్తున్నట్లు ప్రకటించిన అనంతరం క్రీడా మంత్రిత్వ శాఖ ఈ చర్యలు తీసుకుంది. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బీజేపీ ఎంపీ, డబ్ల్యుఎఫ్‌ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌పై కొంతమంది రెజ్లర్లు ఫిర్యాదు చేశారు. వినేష్ ఫోగట్, బజరంగ్‌పూనియా, సాక్షిమాలిక్ సహా కొంతమంది రెజ్లర్లు బ్రిజ్ భూషణ్‌ను డబ్ల్యుఎఫ్‌ఐ అధ్యక్షుడిగా తొలగించాలని ఆందోళనలు సైతం చేపట్టారు.

నిర్ణీత సమయంలో ఎన్నికలు నిర్వహించడంలో విఫలమయ్యారంటూ 2023 ఆగస్టులో యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యుడబ్ల్యుడబ్ల్యు) డబ్ల్యుఎఫ్‌ఐపై నిషేధం విధించింది. రెజ్లర్ల నిరసనలతో అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తాత్కాలిక కమిటీని నియమించింది. 2023 డిసెంబర్‌లో నిర్వహించిన ఎన్నికల్లో డబ్ల్యుఎఫ్‌ఐ చైర్మన్‌గా బ్రిజ్ భూషణ్ సింగ్ సన్నిహితుడు సంజయ్ సింగ్ ఎన్నికయ్యారు. సంజయ్ సింగ్ ఎన్నికను రెజ్లర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. అనంతరం అండర్-15, అండర్ -20 క్రీడాకారులకు ఆతిథ్యం ఇస్తున్నట్లు ప్రకటించడంతో క్రీడల శాఖ డబ్ల్యుఎఫ్‌ఐను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది.

పని ఒత్తిడితోనే నా భర్త ఆత్మహత్య...

జీఎస్టీ అధికారి భార్య

నోయిడా: ఉత్తరప్రదేశ్‌లో జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చర్చనీయాంశంగా మారింది. తన భర్త మృతిపై తాజాగా అధికారి భార్య స్పందించారు. పని ఒత్తిడి కారణంగానే ఆయన ప్రాణాలు కోల్పోయారని, ఈ వ్యవస్థ తన భర్తను బలి తీసుకుందని ఆరోపించారు. నోయిడాలో కుటుంబంతో కలిసి నివాసముంటున్న జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ సంజయ్ సింగ్ (59) ఘజియాబాద్‌లో పని చేస్తున్నారు. సోమవారం ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారు. తాను ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో 14వ అంతస్తు నుంచి కిందకి దూకేశారు. దీంతో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఆయన ఐదేళ్లుగా కేన్సర్‌తో పోరాడుతున్నారని, దీంతో ఆయన మానసిక కుంగుబాటుకు లోనయ్యారని పోలీసులు తెలిపారు. తాజాగా ఆయన సతీమణి మీడియాతో మాట్లాడుతూ తన భర్త మరణానికి కారణం కేన్సర్ కాదని తెలిపారు.

'ఆయన చాలాకాలంగా కేన్సర్‌తో పోరాడుతున్నారు. కానీ, దానిని ఎప్పుడో జయించారు. మా బంధువుల్లోని ఒక డాక్టర్ ఆయనకు చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయనకు దానిగురించి ఎలాంటి బాధ లేదు. అయితే... నా భర్త ఎప్పుడూ పని ఒత్తిడికి గురయ్యేవారు. దీని గురించి ఆయన సహోద్యోగులకు తెలిసే ఉంటుంది. పని ఒత్తిడి కారణంగా ఆయన బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ వ్యవస్థ నా భర్తను బలి తీసుకుంది' అని చెబుతూ ఆమె విలపించారు.

మణిపూర్ ఎదురు చూస్తుంది

ప్రధాని మోదీ మారిషస్ పర్యటనపై కాంగ్రెస్ ధ్వజం

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మారిషస్ పర్యటనపై కాంగ్రెస్ పార్టీ మంగళవారం తీవ్రంగా మండిపడింది. మణిపూర్ ప్రజలు ఇప్పటికీ ఆయన కోసం ఎదురుచూస్తునప్పటికీ, ఇది తరచుగా 'విమాన ప్రయాణ సమయం' అని విమర్శించింది. దాదాపు రెండు సంవత్సరాలుగా ప్రధాని మణిపూర్‌ను సందర్శించడానికి నిరాకరించడం నిజంగా రాష్ట్ర ప్రజలకు అవమానమని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ మాట్లాడుతూ 'ఇది తరచుగా ప్రయాణించే సమయం. ప్రధాన మంత్రి ఇప్పుడు మారిషస్‌కు వెళుతున్నారు. కానీ మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించిన తర్వాత కూడా పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. ప్రధాని పర్యటన కోసం మణిపూర్ ప్రజలు వేచి చూస్తున్నారు' అని అన్నారు. ముందుగా, ప్రధాన మంత్రి మోదీ మారిషస్‌కు చేరుకున్నప్పుడు ఆయనకు సాంప్రదాయ స్వాగతం లభించింది. అక్కడ ఆయన ద్వీప దేశానికి చెందిన జాతీయ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ దేశ అగ్ర నాయకత్వంతో మోదీ సమావేశమవుతారు. ఇదిలాఉండగా, జాతి కలహాలతో అట్టుడుతకున్న ఈశాన్య రాష్ట్రంలో పరిస్థితిని నిర్వహించడంలో కేంద్రం వైఫల్యాన్ని విమర్శించడంతో పాటు మణిపూర్‌ను సందర్శించకపోవడం పట్ల కాంగ్రెస్ ప్రధాన మంత్రిపై దాడి చేస్తోంది.

లాలూ తనయుడు తేజ్‌ప్రతాప్, కుమార్తెకు బెయిల్

న్యూఢిల్లీ: స్థలాలు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారనే కుంభకోణం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు తేజ్ ప్రతాప్, కుమార్తె హేమ యాదవ్ తదితరులకు రౌస్ ఎవెన్యూ కోర్టు మంగళవారం బెయిలు మంజూరు చేసింది. ఈ కేసులో సమన్లు జారీ కావడంతో తేజ్ ప్రతాప్, హేమ యాదవ్ కోర్టుకు హాజరయ్యారు. దీంతో వీరికి కోర్టు రూ.50 వేల పూచీకత్తు, అంతే మొత్తానికి ష్యూరిటీతో కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఇదే కేసులో లాలూ, రాబ్డీదేవి, మీసాభారతి హాజరు కావాల్సి ఉండగా... వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ వీరు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కేసులో తుది చార్జిషీట్లతో సహా మూడు చార్జిషీట్లను సీబీఐ దాఖలుచేసింది. ఇందులో లాలూ ప్రసాద్, మరో 77 మందిని నిందితులుగా పేర్కొంది. ఈ చార్జిషీట్లను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గాగ్నే... తేజ్ ప్రతాప్, హేమయాదవ్ తదితరులకు బెయిలు మంజూరు చేస్తూ తదుపరి విచారణను మార్చి 20వ తేదీకి వాయిదా వేశారు.

భారత్‌లో 13 కాలుష్య నగరాలు

న్యూఢిల్లీ: పెరుగుతున్న పట్టణీకరణ, పారిశ్రామికీకరణ దేశంలోని చిన్నచిన్న నగరాలను సైతం కాలుష్య కోరల్లోకి నెట్టేస్తోంది. ఇప్పటికే దేశ రాజధాని దిల్లీలో కర్బన ఉద్గారాల విడుదల ఆందోళనకర స్థాయికి చేరింది. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ యంత్రాంగాలు చర్యలు చేపడుతున్నప్పటికీ... దేశంలో అనేక నగరాల్లో గాలి నాణ్యత పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ కంపెనీ ఐక్యూ ఎయిర్ కాలుష్యంపై రూపొందించిన 'ద వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్ 2024' నివేదిక విడుదలైంది. ఇందులో ప్రపంచంలో అత్యధికంగా కాలుష్యం వెలువడే 20 నగరాల్లో 13 భారతదేశంలోనే ఉన్నాయని వెల్లడించింది. అసోంలోని బైర్నీహాట్ నగరం తొలిస్థానంలో నిలవగా... తరువాతి స్థానాల్లో దిల్లీ, ముల్లన్‌పూర్ (పంజాబ్), ఫరీదాబాద్, న్యూఢిల్లీ, గురుగ్రామ్, గంగానగర్, గ్రేటర్ నోయిడా, భివాడి, ముజఫర్‌నగర్, హనుమాన్‌గఢ్, నోయిడా ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యపూరిత రాజధానిగా దిల్లీ తొలి స్థానంలో కొనసాగుతున్నట్లు నివేదిక తెలిపింది. 2023లో ఈ సంస్థ విడుదల చేసిన జాబితాలో ప్రపంచంలోని మూడో అత్యంత కలుషిత వాతావరణ దేశంగా భారత్ నిలవగా... ప్రస్తుతం విడుదలైన జాబితాలో ఐదో స్థానంలో ఉంది. ఈ కాలుష్యం వల్ల అక్కడి ప్రజల ఆయుర్దాయం దాదాపు 5.2 సంవత్సరాలు తగ్గినట్లు నివేదికలు అంచనా వేశాయి. 2009 నుంచి 2019 వరకు భారత్‌లో యేటా కాలుష్య సంబంధిత వ్యాధుల వల్ల దాదాపు 15 లక్షల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నట్లు గతేడాది విడుదలైన లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ అధ్యయనం పేర్కొంది. ఈ నివేదికలపై ప్రముఖ శాస్త్రవేత్త, ఆరోగ్య మంత్రిత్వశాఖ సలహాదారు సౌమ్య స్వామినాథన్ మాట్లాడుతూ కాలుష్య నివారణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లల్లో వంట చెరుకు ఉపయోగించడం వల్ల అక్కడి ప్రజలు అధికంగా కాలుష్య కారక వ్యాధులకు గురవుతున్నారని పేర్కొన్నారు. వాటిని నివారించడానికి బయోమాస్‌ను ఎల్‌పీజీ సిలిండర్లతో భర్తీ చేయడం వంటి విషయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. దీనికోసం భారత ప్రభుత్వం ఇప్పటికే సంక్షేమ పథకాన్ని అమలుచేస్తోందని, అయితే దీనిని పూర్తిగా నివారించాలంటే అదనపు గ్యాస్ సిలిండర్లపై మరింత రాయితీ ఇవ్వాలని ఆమె సూచించారు. దీనివల్ల ప్రజల ఆరోగ్యం మెరుగవ్వడమే కాకుండా కాలుష్య స్థాయిలు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. నగరాల్లో ప్రజా రవాణాను విస్తరించడం, కొన్నిరకాల వాహనాలపై జరిమానాలు విధించడం, పరిశ్రమలు, నిర్మాణసంస్థలు తగిన నిబంధనలు పాటించడం వంటి చర్యల ద్వారా కాలుష్యాన్ని అరికట్టవచ్చన్నారు.

రన్యారావు వీఐపీ ప్రొటోకాల్ దుర్వినియోగంపై విచారణ

బెంగళూరు: బంగారం అక్రమ రవాణా కేసులో అరెస్టైన నటి రన్యారావు వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. వీఐపీ ప్రొటోకాల్‌ను దుర్వినియోగం చేస్తూ నటి రన్యారావు బంగారం అక్రమంగా రవాణా చేయడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ప్రొటోకాల్ దుర్వినియోగం అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ వ్యవహారంలో రన్యారావు సవతి తండ్రి, కర్నాటకలో ఐపీఎస్ అధికారి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డాక్టర్ కె.రామచంద్రరావు పాత్రపైనా ప్రత్యేకంగా దర్యాప్తు చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం అదనపు ప్రధాన కార్యదర్శి గౌరవ్ గుప్తాను దర్యాప్తు అధికారిగా ప్రభుత్వం నియమించింది. దర్యాప్తును వెంటనే ప్రారంభించి వారంలోపు తుది నివేదిక అందించాలని ఆదేశించింది. రన్యారావు దుబాయ్ నుంచి రూ.14 కోట్లకు పైగా విలువైన బంగారం స్మగ్లింగ్ చేస్తూ బెంగళూరు విమానాశ్రయంలో పట్టుబడిన విషయం తెలిసిందే.

ఆశా వర్కర్ల వేతనం పెంచుతున్నాం

- రాజ్యసభలో మంత్రి జె.పి.నడ్డా
- సమస్య లేవనెత్తిన సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్
- కేరళ-కేంద్ర నిధుల వివాదం మరింత తీవ్రం



న్యూఢిల్లీ : జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కు చెందిన మిషన్ స్టీరింగ్ గ్రూప్ (ఎంఎస్‌జీ) ఆశా వర్కర్లకు వేతనాన్ని పెంచాలని నిర్ణయించిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి.నడ్డా మంగళవారం రాజ్యసభలో తెలిపారు. భారతదేశ గ్రామీణ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లకు మెరుగైన వేతనాలు, గుర్తింపు కోసం పెరుగుతున్న డిమాండ్ల మధ్య ఈ నిర్ణయం వచ్చింది. 'ఆశా వర్కర్లు అట్టడుగు స్థాయిలో చాలా మంచి పని చేస్తున్నారు. మాతా, శిశు మరణాల రేటు తగ్గడానికి వారి కృషి చాలావరకు కారణం' అని నడ్డా అన్నారు. 'ఒక వారం క్రితం ఎన్‌హెచ్‌ఎంకు చెందిన మిషన్ స్టీరింగ్ గ్రూప్ సమావేశం జరిగిందని నేను సభకు తెలియజేయాలనుకుంటున్నాను. అక్కడ ఆశా వర్కర్లు వారి కార్యకలాపాల కారణంగా వారికి వేతనాలు పెంచాలని నిర్ణయించాం. దీనికి మిషన్ స్టీరింగ్ గ్రూప్ అనుమతి ఇచ్చింది. మేము దానిని ముందుకు తీసుకువెళతాం' అని మంత్రి నడ్డా చెప్పారు.

సభలో చర్చ సందర్భంగా కేరళకు చెందిన సీపీఐ ఎంపీ పి.సంతోశ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.100 కోట్ల బకాయిల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రాష్ట్రంలోని ఆశా వర్కర్ల ఆర్థిక పరిస్థితిని ప్రభావితం చేసిందని తెలిపారు. ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని, వారికి అధికారిక గుర్తింపు ఇవ్వాలని కూడా ఆయన ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై నడ్డా మాట్లాడుతూ కేరళకు రావాల్సిన అన్ని బకాయిలు చెల్లించామని, అయితే అందుకున్న నిధులను లెక్కించడానికి రాష్ట్రం వినియోగ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించలేదని తెలిపారు. కాగా, ఈ నిధులు పూర్తిగా పంపిణీ కాలేదని, ఎన్‌హెచ్‌ఎం కింద కేంద్రం చెల్లింపులను ఆలస్యం చేసిందని, దీని వలన ఆశా వర్కర్లకు సకాలంలో చెల్లింపులు జరగడం కష్టమవుతుందని కేరళ అధికారులు గతంలో వాదించారు. మరోవైపు, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ఎంపీలు ఆశా వర్కర్ల గౌరవ వేతనాన్ని రూ.21 వేలకు పెంచాలని, వారికి రూ.5 లక్షల పదవీ విరమణ ప్రయోజనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటులో నిరసన తెలిపారు.

వైద్యుల నియామకాలను కాలపరిమితిగా చేయడంపై రాజ్యసభలో మరో ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డా సమాధానమిస్తూ, 'మౌలిక సదుపాయాలను సృష్టించడంలో ఎటువంటి ఆర్థిక పరిమితి లేదు. కానీ రాష్ట్రాలు తమ సామర్థ్య నిర్మాణాన్ని పెంచుకోవాలని మేము ప్రయత్నిస్తున్నాం' అని చెప్పారు. 'నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడటానికి మేము జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలపై కూడా పని చేస్తున్నాం. మేము సామర్థ్య నిర్మాణాన్ని కూడా చేయడంతో పాటు రాష్ట్రాల పనిని పర్యవేక్షిస్తున్నాం' అని ఆయన వివరించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-దుండిగల్: పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ సాయినాథ్ పేర్కొన్నారు. మంగళవారం స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా దుండిగల్ మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ సాయినాథ్ మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డులలో పారిశుధ్య పనులను కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ సాయినాథ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమల వ్యాప్తిని నివారించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు కలగకుండా వాటికి తగిన నివారణ చర్యలు తీసుకోవాలని వ్యక్తం చేశారు. ప్రతి వార్డులోని పారిశుధ్య పనులను సమగ్రంగా నిర్వహించాలన్నారు.అనంతరం రోడ్లకు ఇరువైపులా చెత్త కుప్పలు, పిచ్చి మొక్కలు పెరగకుండా చూడాలని, కాళీ ప్రదేశాలలో గార్బేజి ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని తెలిపారు. అదే విధంగా ప్లాస్టిక్ బ్యాన్‌లో భాగంగా కిరాణాషాపులు, హోటల్స్, రెస్టారెంట్‌లలో సింగిల్ యూస్ ప్లాస్టిక్, 120 మైక్రోన్ కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ ను ఉపయోగించకూడదని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, మున్సిపల్ ఇంజనీర్ సురేందర్ నాయక్, సానిటరీ ఇన్స్పెక్టర్ అంజయ్య,రామచందర్ ,ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, వార్డ్ ఆఫీసర్లు, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేద ప్రజలకు ఒక వరం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా ఇద్దరు లబ్ధిదారులక మంజూరైన రూ.1,20,00 ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను బాధిత కుటుంబాలకి అందచేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరమన్నారు. ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్తోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ చౌదరి, కాశినాథ్ యాదవ్, తిరుపతి, ఉమాదేవి పాల్గొన్నారు.

మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: మాదాపూర్ డివిజన్ పరిధిలోని జైన్ అపార్ట్మెంట్, మై స్కేప్ అపార్ట్మెంట్‌లో స్థానికంగా నెలకొన్న సమస్యలను జి.హేచ్.ఎం.సి ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు కాలనీ సభ్యులతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్ పరిశీలించారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీ,బస్తీలో ప్రజలకు మెరుగైన మౌలికవసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని,ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. డివిజన్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేల కృషి చేస్తామన్నారు. డివిజన్ పరిధిలోని జైన్ అపార్ట్మెంట్ మరియు మై స్కేప్ అపార్ట్మెంట్ నందు స్థానికంగా నెలకొన్న సమస్యలను జి.హేచ్.ఎం.సి ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ అధికారులు డీ.ఈ,ఏ.ఈ ట్రాఫిక్ సిబ్బంది/కాలనీ సభ్యులతో కలిసి పర్యటించారు. చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. కాలనీలో నూతనంగా నిర్మించాల్సిన సీసీ రోడ్డు పనులను స్థానికులు జగదీశ్వర్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు.

నేరాల కట్టడికి పటిష్ట నిఘా : డీసీపీ

విశాలాంధ్ర - అమనగల్లు : నేరాల కట్టడికి గట్టి చర్యలు తీసుకుంటున్నామని శంషాబాద్ డిసిపి రామ్ బి రాజేష్ చెప్పారు. మంగళవారం ఆమనగల్లు పోలీస్ స్టేషను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పోలీసు సిబ్బంది సంక్షేమాలను, కేసుల యొక్క వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరాలను అదుపు చేసేందుకు పోలీస్‌శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. పటిష్ఠ నిఘా ఉన్న ప్రాంతాలలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏ సమస్య ఉన్నా పోలీస్ స్టేషన్లకు ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయాలని, సత్వర న్యాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించి సైబర్ నేరాల కట్టడానికి కృషి చేయాలన్నారు.ప్రజలకు శాంతి భద్రత కల్పించడంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆమనగల్లు సీఐ ప్రమోద్ కుమార్, ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట : మంత్రి

విశాలాంధ్ర, హైదరాబాద్ : మౌలిక వసతుల కల్పనకు ప్రజాపాలన ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం ఎల్బీనగర్ జోన్ ఉప్పల్ సర్కిల్‌లో రూ. 4119. లక్షల విలువ గల వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. రామంతపూర్ వార్డు ఇందిరా నగర్ మెట్ల గల్లి లో రూ. 88.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న సివరేజ్, సీసీరోడ్డు పనులకు, కోటి రూపాయల వ్యయంతో రామంతపూర్ రజక సేవా సంఘం, అంబేద్కర్ సేవా సంఘం మొదటి అంతస్తు భవన నిర్మాణ పనులకు, బాలకృష్ణ నగర్, కేటీఆర్ నగర్ లలో కోటి 20 లక్షల వ్యయంతో 450/300 డయా సీవరేజ్ పైప్ లైన్ నిర్మాణ పనులకు, ఉప్పల్ భగాయత్ ఫేస్ 1 లో నీటి సరఫరా వ్యవస్థ, సీవరేజ్ సిస్టం పటిష్టత, మౌలిక వసతుల అభివృద్ధికి రూ. 25.43 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 6.26 కోట్ల వ్యయంతో సూర్య నగర్, శ్రీరామ కాలనీ, లక్ష్మారెడ్డి కాలనీ, శేష సాయి నగర్, సౌత్ స్వరూప్ నగర్, స్వరూప్ నగర్, సత్య నగర్, టి.వి కాలనీ లలో సిసి రోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు, ఉప్పల్ సర్కిల్ భరత్ నగర్ రామాలయం కాలనీ వద్ద రూ.1.52 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీవరేజ్ రీమోడలింగ్, స్ట్రామ్ వాటర్ డ్రైన్, సీసీరోడ్డు పనులకు, ఉప్పల్ సర్కిల్ డివిజన్ 14 లోని పద్మావతి కాలనీ, అలాగే వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉప్పల్ - నారపల్లి ఫ్లైఓవర్ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని, ఉప్పల్ నుండి ఘట్కేసర్ వరకు కొత్తగా ఐటీ కారిడార్ ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్ నలుమూలలా మెట్రో రైలు, తీసుకువస్తామని, కాలుష్యం లేని బస్సులను తీసుకువస్తామని మంత్రి తెలిపారు. మూసీ నది ప్రక్షాళన చేయడంతో పాటు మూసీ పరివాహక ప్రాంత ప్రజల సమస్యలు తీరుస్తామన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ని ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లా కలెక్ట్ గౌతం పొత్రు, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, స్థానిక కార్పొరేటర్లు రజిత, బండారు శ్రీవాణి, బొంతు శ్రీదేవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్లకు నీటి సరఫరా : ఎండీ

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఓల్డ్ బాంబే హైవేలోని ముఘల్ రెస్టారెంట్ వద్ద 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు మరమ్మతులు జలమండలి అధికారులు నిరంతరాయంగా పనిచేసి మరమ్మతులు పూర్తి చేశారు. తెల్లవారుజామున ఆయా రిజర్వాయర్లలోకి నీటి సరఫరా జరగ్గా.. ఉదయం నుంచి మొదటగా ఆన్‌లైన్ సప్లై చేశారు. తర్వాత డిస్ట్రిబ్యూషన్ రిజర్వాయర్లకు సరఫరా పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో ఎండీ అశోక్‌రెడ్డి హైదర్‌నగర్ రిజర్వాయర్‌ను సందర్శించి మాట్లాడుతూ షట్‌డౌన్ వల్ల నీటి సరఫరా నిలిచి పోయిన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశామని భారీ పైపు కావడం, 30 ఏళ్ల క్రితం నాటి పైపు కాబట్టి పనులు కాస్త ఆలస్యం య్యాయన్నారు. అయినా జలమండలి టెక్నికల్ టీమ్ సలహాలు, సూచనలతో వెల్డింగ్ సంబంధించిన యంత్రాలు, పనిముట్లు, నిర్మాణ సామగ్రిని అప్పటికే సమకూర్చుకుని పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. పనులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించిన ట్రాన్స్ మిషన్ అధికారులు, సిబ్బందిని ఎండీ ప్రశంసించారు. లీకేజీ వల్ల ప్రభావితమైన వాటిల్లో ఇంకా ఏ ప్రాంతానికైనా నీటి సరఫరా జరగకపోతే ట్యాంకర్ల ద్వారా సప్లై చేయాలని సూచించారు. అనంతరం రిజర్వాయర్ ప్రాంగణంలోని క్వాలిటీ అస్యూరెన్స్ వింగ్ (క్యూఏటీ) ల్యాబ్ ను సందర్శించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడి నీటి నాణ్యత పరీక్ష వివరాలు అడిగి తెలుసుకున్నారు. టెస్టింగ్ విధానాల్లో టెక్నాలజీని వాడుకోవాలన్న ఆయన.. టెస్టుల ప్రక్రియను మరింత సులభతరం చేయడానికి లేటెస్ట్ టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. అప్ గ్రేడ్ చేయడానికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తర్వాత అక్కడే ఉన్న స్టాఫ్ కాలేజ్ బిల్డింగ్, ట్రైనింగ్ సెంటర్, లైబ్రరీ, క్లాస్ రూములను పరిశీలించారు. అవసరమైన భవనాలకు రిపర్లే చేయాలన్నారు. తర్వాత ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ ను ఎండీ సందర్శించారు. లీకేజీ ఘటన వల్ల ఈ ప్రాంతంలో 265 ట్రిప్పులు పెండింగ్ లో ఉన్నాయని అధికారులు ఎండీకి తెలుపగా.. వాటిని 12 గంటల్లో క్లియర్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్-2 వీఎల్.ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, సీజీఎంలు అరవింద రెడ్డి, నారాయణ, జీఎంలు, ఓ అండ్ ఎం, ట్రాన్స్ మిషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల పొట్టగొడితే సహించం : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధిత ఏజెన్సీల కాంట్రాక్టర్లు పారదర్శకంగా జీతభత్యాలు చెల్లించకుండా పొట్టలు కొట్టాలని చూస్తే సహించేది లేదని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ హెచ్చరించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పారిశుధ్య పేషంట్ కేర్ సెక్యూరిటీ సూపర్వైజర్ విభాగాల కార్మికులకు అందించే వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐల చెల్లింపులు, అదనపు పనిభారం లాంటి తదితర దీర్ఘకాలిక అపరిష్కృత సమస్యలపై మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ నేతృత్వంలో ఏజెన్సీ నిర్వాహకులు మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు, కార్మికులతో ప్రత్యేక జాయింట్ మీటింగును ఏర్పాటుచేసి చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యరంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం, వారి శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. ఏఐటియుసి యూనియన్ నేతలు పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు తమ దృష్టికి తెచ్చారని ఈనేపథ్యంలో వారి సమస్యలపై ఎప్పటికప్పుడు ఏజెన్సీ నిర్వాహకులతో అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ మాట్లాడుతూ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి సమావేశంలో అనేక సమస్యలు చర్చించామని అన్నారు.ముఖ్యంగా వేతనాలు పిఎఫ్, ఈఎస్ఐలు జీవో 60 ప్రకారం కార్మికులకు అందక తీవ్రమైన అన్యాయం జరుగుతుందని విజ్ఞాపన పత్రాలు ఆందోళనలు అనేక రూపాలలో కార్మికులు చేశారని గుర్తు చేశారు. ఈ చర్చల్లో ప్రస్తుతం కార్మికులకు చెల్లిస్తున్న పిఎఫ్,ఈఎస్ఐ లు రూ.1734 నుంచి రూ.2275 పెంచడానికి ఏజెన్సీ నిర్వాహకులు అంగీకరించారని తెలిపారు. పెంచిన పీఎఫ్ ఈఎస్ఐ ఈనెల నుండే తక్షణం అమలు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ థర్డ్ పార్టీ ఏజెన్సీల కార్మికులకు వర్తింపజేస్తూ పి ఆర్ సి జీవో నెంబర్ 60 ని తెచ్చి ఐ హెచ్ ఎఫ్ ఎం ఎస్ టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన జీవో 60 అమలులో మాత్రం గందరగోళం ఏర్పడిందని అన్నారు. కాంట్రాక్టర్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు పీఎఫ్ ఈఎస్ఐ కటింగ్ పోను రూ.13600 నేరుగా జీతం అందుతున్నాయని కానీ ఆసుపత్రి ఏజెన్సీల కార్మికులకు మాత్రం పిఎఫ్ ఈఎస్ఐ కటింగ్ పోను కేవలం 12093 మాత్రమే అమలు చేయాలని ఆదేశాలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఆసుపత్రి కార్మికులకు తక్షణమే కనీస వేతనం 24 వేలకు పెంచాలని, ఆస్పత్రి పడకల సామర్థ్యాన్ని అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచి పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ సునీల్,సాయి ఏజెన్సీ నిర్వాహకులు శ్రీవాణి, రాఘవేందర్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, ఆసుపత్రి బ్రాంచ్ ఏఐటీయూసీ యూనియన్ నాయకులు, కార్మికులు వై.రంగన్న,మొగులన్న, యాదయ్య, అంజి, రాఘవేందర్,అంజిలయ్య, గంగాధర్, పద్మ, ఎల్లమ్మ, సత్యమ్మ, అంజమ్మ, వరలక్ష్మి, సునీత, మల్లమ్మ, లక్ష్మి, ఇందిరా, సుధా, లక్ష్మమ్మ, యాదమ్మ, చెన్నమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటితో దుర్గం చెరువు : కమిషనర్

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఐటి జోన్లో అత్యంత కీలకమైన దుర్గం చెరువును స్వచ్ఛమైన నీటితో కళకళలాడేలా తీర్చిదిద్దాలని బల్దియా కమిషనర్ ఇలంబర్తి స్పష్టం చేశారు. చెరువులోకి చేరే మురుగునీటికి పూర్తిగా చెక్ పెట్టి, వర్షపు నీరు వచ్చేలా పూర్తిస్థాయి వ్యవస్థను అభివృద్ధి పరచాలని అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని దుర్గం చెరువును జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, జలమండలి, ఎస్ ఎన్డిపి విభాగాల అధికారులతో కలిసి కమిషనర్ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జలమండలి చేపట్టనున్న మురుగునీటి డైవర్షన్ నిర్మాణ పనులపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఎస్ఎన్డి పి ఆధ్వర్యంలో చేపడుతున్న స్ట్రామ్‌వాటర్ లైన్ పురోగతిని ఆయన పరిశీలించారు. అనంతరం బల్దియా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ మురుగనీటిని దారి మళ్లించేలా పటిష్టమైన డ్రైనేజీల నిర్మాణానికి సమర్థవంతమైన ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. భవిష్యత్తులో మురుగునీటి పరిమాణాన్ని తట్టుకునేలా తగినంత మోతాదులో పైపుల నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. వర్షపు నీరు స్ట్రామ్ వాటర్ డ్రైనేజ్ ద్వారా చెరువులోకి చేరేలా పటిష్టమైన నాణ్యమైన నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. దుర్గం చెరువులో పరిశుభ్రమైన జలాలు నింపి ఆహ్లాదకరమైన పరిసరాలను నగర ప్రజానీకానికి అందించేలా పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని కమీషనర్ తెలిపారు.

12 నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర, హైదరాబాద్ : మార్చి నెల నుండి పెరిగిన వేతనం ప్రతి నెల చెల్లిస్తాం అని 100 శాతం చెల్లిస్తాం అని మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ క్రాంతి వెస్లీ అన్నారు. మంగళవారం అమీర్ పేటలో గల ఐసీడియస్ డైరెక్టర్ కార్యాలయంలో ఏఐటీయూసీ అనుబంధం అంగన్వాడీ టీచర్, హెల్పర్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సీతా మహాలక్ష్మి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగ్ నర్సింహారావు. అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సరాటి ప్రసాద్, మాలోత్ లక్ష్మి, సుశీల, భూక్యా లక్ష్మి, కే లావణ్య, భాగ్య లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు. సీత మహాలక్ష్మి మాట్లాడుతూ పెండింగ్ వేతనం 12 నెలల ఎరియర్స్ బిల్స్‌కు ఆర్థిక మంత్రి భట్టి ఫైనాన్స్ రిలీజ్‌కి సైన్ చేయ్యాలి అని తెలిపారు. మార్చి నెలలో ప్రభుత్వం పాఠశాలలకు, కళాశాలలకు హాఫ్ డే ఇస్తున్న నేపథ్యంలో చిన్నారులు వేసవి వేడికి సెంటర్‌కు రాలేని పరిస్థితిల్లో తక్షణమే అంగన్వాడీ సెంటర్‌లకు హాఫ్ డే పాటశాల నిర్వహించే విధంగా ఆదేశాలు ఇవ్వాలి అని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ ఇంటి అద్దెలు. గ్యాస్ బిల్స్, ఆరోగ్య లక్ష్మి బిల్స్, ఈవెంట్స్ బిల్స్, 5జి సెల్ అందించాలి అని కోరినారు. అంగన్వాడీ సెంటర్స్ కు కాంట్రాక్టర్ లు పుచ్చి పురుగులు పట్టిన పసుపు, కారం, గుడ్లు సరఫరా ఎక్కువ గా చేస్తున్నారు అని తక్షణమే వారి పై చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేసారు.

వసతి గృహం ప్రతిపాదనలు పంపండి : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : జిల్లాలోని మానసిక పిల్లల వసతి గృహం ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కాచిగూడ లోని ప్రభుత్వ బాలికల ప్రత్యేక గృహ, బాలికల సదనం ను జిల్లా కలెక్టర్ సందర్శించి ప్రత్యేక అవసరాల ఉన్న మానసిక పిల్లల వసతి గృహంకు భవనాన్ని పరిశీలించారు. ప్రత్యేక గృహంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం క్రీడా మైదానంను పరిశీలించారు. అనంతరం కిచెన్ రూమ్, డైనింగ్ రూమ్, కళావేదిక, న్యూట్రిషన్ గార్డెన్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ అంశాలకు సంబంధించిన కేసుల్లో ఉన్నటువంటి పిల్లలు మనోధైర్యంతో ఉండేలా కౌన్సిలింగ్ ఇస్తూ అండగా ఉండాలని అన్నారు. బాలికల ప్రత్యేక గృహం, సదనం లో పిల్లల సంఖ్యను, ఆరోగ్య సంరక్షణకై చేపడుతున్న చర్యలను సిబ్బందిని అడిగి తెలుసుకొని వారికి అందుతున్న వసతులను తెలుసుకున్నారు. పాత భవనంతో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిసరాలు ఎప్పడికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. న్యూ ట్రిషన్ గార్డెన్ ను సందర్శించి మరింత అభివృద్ధి చేయాలని స్వచ్ఛమైని కూరగాయలు పండించాలని పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. పిల్లలు మనోధైర్యం కోల్పోకుండా ప్రత్యేక కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. సదనంలో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు అందచేయాలనీ అన్నారు. వసతి గృహంలో మగ్గం ద్వారా నేస్తున్న బెడ్ షీట్స్, టవల్స్ ను కలెక్టర్ పరిశీలించి మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించాలని సూచించారు. ప్రత్యేక గృహం, సదనంలో పనిచేస్తున్న సిబ్బంది చాలా బాగా పని చేస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏ. డి రాజేంద్రర్, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ అమూల్య, తహసీల్దార్ సంధ్యారాణి, కౌన్సిలింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్ని పార్టీలు బీసీలకు పెద్దపీటపై హర్షం

విశాలాంధ్ర, హైదరాబాద్ : మార్చి 20న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించడంపై బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన హైదరాబాదులోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయం నుంచి విడుదల చేసిన పత్రిక ప్రకటన తెలిపారు. అనేక సంవత్సరాలుగా బీసీల ఐక్యత కోసం వివిధ మార్గాల్లో ఉద్యమాలు జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో బీసీల ఐక్యత కారణంగా బీసీ ఉద్యమాలు ఒక్కొక్కటిగా విజయం సాధిస్తున్నాయని ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టడం బీసీల విజయంగా భావిస్తున్నామని, గత ప్రభుత్వ 23% మాత్రమే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించగా నేడు నలభై రెండు శాతం కల్పించేందుకు ప్రభుత్వ ముందుకు రావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మార్చి 20న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాలనే అన్ని పార్టీలు ఎంపిక చేయడం చారిత్రాత్మకమని, ఇదే ఐక్యతతో బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ వర్గాలు ఐక్యంగా ముందుకు సాగుతూ కేంద్ర ప్రభుత్వం దేశ జనగణనలో కులగణన చేపట్టే వరకు మొక్కవోని ధైర్యంతో ఐక్యంగా ఉద్యమించాలన్నారు.

సీఎంకు పసుపు రైతుల బాధలు పట్టవా ? : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పసుపు రైతులను చిత్తు చేస్తున్నాయని, పసుపు రైతుల బాధలు, కష్టాలు పట్టవా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. పంటకు గిట్టుబాటు ధర లేక పసుపు రైతులు ఆందోళన చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గిట్టుబాటు ధరలు లేక నిజామాబాద్‌లో పసుపు రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో వారికి మద్దతుగా మంగళవారం ఎమ్మెల్సీ కవిత ప్రకటన విడుదల చేశారు. గిట్టుబాటు ధర రాక పసుపు రైతులు అల్లాడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తున్నదని నిలదీశారు. మాటలు చెప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడానికి ముందుకు రావడం లేదని ఎండగట్టారు. క్వింటాలు పసుపుకు రూ.15 వేల ధర కల్పిస్తామని ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డికి హామీ ఇచ్చారని, ఇప్పుడు పసుపుకు కనీసం రూ.9 వేలు రాని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడానికి చర్యలు తీసుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇది రైతులను నయవంచన చేయడమే, మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం 15 వేల మద్దతు ధర చెల్లిస్తూ పసుపు పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పసుపు బోర్డు తీసుకొచ్చామని చెబుతున్న బిజెపి, ఎంపీ ధర్మపురి అరవింద్ కనీసం రైతులను పరామర్శించడం లేదని, పసుపు బోర్డుకు చట్టబద్ధత లేకపోవడంతో రైతులకు ప్రయోజనాలు కలవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చి పసుపు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సంచార జాతులకు డీఎన్టీ సర్టిఫికెట్లు జారీ చేయాలి

సంచార జాతులకు డీనోటిఫైడ్ జాతుల (డీఎన్టీ) సర్టిఫికెట్లు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో వెనుబడి ఉన్న ఈ జాతులను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో సంచార జాతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సర్టిఫికెట్లు లేక పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని యునైటెడ్ పూలే ఫ్రంట్ కో కన్వీనర్ బొల్ల శివ శంకర్ ఆధ్వర్యంలో తెలంగాణ సంచార జాతుల సంఘం కోల శ్రీనివాస్ మంగళవారం ఎమ్మెల్సీ కవితకు విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను శాసన మండలిలో లేవనెత్తాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ సంచార జాతులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో సంచార జాతుల అభివృద్ధికి కృషి జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డీఎన్టీ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను మొదలు పెట్టాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎత్తరి మారయ్య, ఆలకుంట్ల హరి, ఆర్వి మహేందర్ రాజమళ్ళ బాలకృష్ణ, డి నరేష్ కుమార్, అశోక్ కుమార్ యాదవ్, డి కుమారస్వామి ప్రవీణ్ వంజరా, గోపు సదానందం, శ్రీధర్ సాగర్ లంగం పాల్గొన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయం పిహెచ్‌డి ప్రవేశ ఫలితాల వెల్లడి

విశాలాంధ్ర, హైదరాబాద్ : 2023-24విద్యాసంవత్సరానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వివిధ కోర్సులకు సంబంధించి పిహెచ్.డిలో చేరడానికి ప్రవేశ పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఇందుకు సంబంధించిన ఫలితాలను వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు మంగళవారం పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ప్రవేశ పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ నెల 17 నుండి 20 వరకు కోర్సులలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని సెంట్రల్ అడ్మిషన్ కమిటీ డైరెక్టర్ డా.బి.రాధ తెలియజేశారు. వ్రాత పరీక్షలో ఉత్తీర్ణులైన జాబితాను విశ్వవిద్యాలయం వెబ్ సైట్ www.teluguuniversity.ac.inలో వీక్షించవచ్చునని డైరెక్టర్ తెలియజేశారు.

పిల్లలకు విషమిచ్చి దంపతుల ఆత్మహత్య

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇద్దరు పిల్లలకు విషమిచ్చి చంపిన తర్వాత ఆ దంపతులు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఆరు నెలలుగా ఖాళీగా ఉండటం కుటుంబ పోషణకూ ఇబ్బందులు ఎదురవ దంతో ఆ ఇంటిపెద్ద, భార్యా పిల్లలతో కలిసి చనిపోవాలనుకున్నాడు. ఇందుకు భార్యను ఒప్పించాడు. ఇద్దరు పిల్లలకు విషమిచ్చి చంపిన తర్వాత ఆ దంపతులు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. హబ్సిగూడలో ఈ విషాదం జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తికి చెందిన కె.చంద్రశేఖర్‌రెడ్డి(40)కి భార్య కవిత(35), పిల్లలు శ్రీతా(15), విశ్వంత్(10) ఉన్నారు. కవిత గృహిణి. శ్రీతా తొమ్మిదో తరగతి, విశ్వంత్ ఐదో తరగతి చదువుతున్నారు. ఏడాదిగా ఈ కుటుంబం హబ్సిగూడలోని మహేశ్వరినగర్‌లో ఉంటుండగా సోమవారం రాత్రి పిల్లలకు విషమిచ్చి చంపి, చంద్రశేఖర్, కవిత ఆత్మహత్య చేసుకున్నారు. అతను రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై వారి బంధువులు సోమవారం రాత్రి ఫోన్ చేసి సమాచారం అందించారని ఓయూ పోలీస్ స్టేషన్ సీఐ రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఫోన్ సమాచారం అందుకుని ఇంటికి వెళ్లి చూడగా నలుగురు మృతి చెంది ఉన్నారని, అనుమానస్పద మృతులుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులే చంద్రశేఖర్ రెడ్డి , కుటుంబ సభ్యుల ఆత్మహత్యకు కారణమని, ఇద్దరు పిల్లలను హ్యాంగ్ చేసి వారు చనిపోయిన తరువాత భార్య భర్తలు హ్యాంగ్ చేసుకున్నారని ఆయన తెలిపారు. గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి నష్టపోయిన చంద్రశేఖర్ రెడ్డి తరువాత ప్రైవేట్ కాలేజీలో లేచ్చరర్ గా ఉద్యోగం చేశారు. ఆరు నెలల క్రితం ఉద్యోగం మానేసి ఖాళీగా ఉన్నారు. చంద్రశేఖర్ రెడ్డి, ఆయన భార్య కవిత ఫ్యామిలీ బ్యాగ్రౌండ్ చూస్తే ఫైనన్సియల్‌గా వెల్ సెటిల్డ్ అని, రూ.5 లక్షలు కావాలంటూ చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను అడిగారని, వారు కూడా ఇస్తామని చెప్పారన్నారు. భార్య భర్తల మధ్య ఎలాంటి గొడవలు లేవని, సూసైడ్ నోట్‌లో ఆర్థిక ఇబ్బందులే కారణమని ఉందన్నారు. కవిత తల్లిదండ్రులు, చంద్రశేఖర్ తల్లి దండ్రుల నుంచి స్టేట్‌మెంట్స్ రికార్డు చేశామన్నారు.

పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు,....

పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామని సీఐ రాజేందర్ తెలిపారు. గతంలో కుటుంబ సభ్యులకు అప్పులు ఉన్నాయని చెప్పారు కానీ ఎందుకు అప్పులు చేయాల్సి వచ్చింది ఎవరి దగ్గర ఎంత మొత్తంలో అప్పులు చేసింది తదితర వివరాలు వారి తల్లి దండ్రులకు, బంధువులకు చెప్పలేదని దర్యాప్తులో భాగంగా టెక్నికల్ ఎవిడెన్స్‌లు సేకరిస్తున్నామన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలని బీఆర్ఎస్ మహిళా నాయకురాలు కొలుకుల శశికళ జగన్ పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి కన్యక పరమేశ్వరి ఆలయ కమిటీ హాల్ లో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు కొలుకుల శశికళ జగన్ స్థానిక మహిళలతో కలిసి మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కొలుకుల శశికళ జగన్ మాట్లాడుతూ పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాలలో పోటీపడాలని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహిళలకు అన్ని రంగాలలో రాణించడానికి ప్రోత్సహించిందని ఆమె వ్యక్తం చేశారు. అనంతరం కొలుకుల శశికళ జగన్ కేక్ కట్ చేసి మహిళలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీదేవి, ఇండియన్ బ్యాంక్ మేనేజర్, ఉషారాణి, టీజీ బ్యాంక్ రఘునందన్ రావు, హరిప్రియ,సి ఓ కిషోర్ కుమార్, డివిజన్ మహిళ నాయకురాలు, వరమ్మ సువర్ణ, కొలుకుల జ్యోతి, శాంతి, హైమావతి, పద్మ, మంజుల, శోభారాణి పాల్గొన్నారు.

ప్రైమరీ హెల్త్ సెంటర్ సందర్శన

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా.సి.ఉమా గౌరి బోడుప్పల్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యుపి.హెచ్.సి)ను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, ఓపి సేవలు, స్టాక్ రికార్డులు, తదితర అంశాలను పరిశీలించారు. వైద్యాధికారులు మరియు సిబ్బంది రోగుల సేవలు ఓపి మరియు టి-డయాగ్నొస్టిక్ సేవలను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కాలనీ వాసులతో సమావేశమై ఎక్కడ ఉన్నా సమస్యలు అడిగి తెలుసుకునీ నెలకొన్న సమస్యలపై సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తమ కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పైప్ లైన్ నిర్మాణము పనులను పూర్తి చేయాలని, మంచి నీటి వసతిని మెరుగుపర్చాలని, విధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడలని,పారిశుధ్యం పనులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిని కోరారు. దీంతో అక్కడే ఉన్న అధికారులకు ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై అధికారులతో చర్చించారు. అందుకు కావలసిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచిం చారు. అనంతరం తమ కాలనీలో ఉన్న పార్క్ స్థలంలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్క్, క్రీడా ప్రాంగణం, మరియు విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని గంగాధర్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ లో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పైప్ లైన్ పనులను, రోడ్లను త్వరితగతిన పూర్తి చేస్తామని,మంజీర మంచీ నీటి వసతిని మెరుగు పరుస్తామని, దశల వారిగా అన్ని పనులు పూర్తి చేసి టీఎన్జీవోస్ కాలనీ లో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని తెలియచేసారు.పెరుగుతున్న జనాభా దృశ్య భూగర్భ డ్రెయినేజీ పైప్ లైన్ దయా పెంచి లెవల్స్ తో అనుసంధానం చేస్తూ ఒక్క కాలనీ నుండి మరొక కాలనీకి మధ్యన ఇబ్బందులు తలెత్తకుండ పనులు ప్రణాళిక బద్దంగా అన్ని కాలనీలకు దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం నరేందర్ రెడ్డి, డిఈ విసాలాక్షి, జి.హెచ్.ఎం.సి అధికారులు,డివిజన్ నాయకులు, టీఎన్జీవోస్ కాలనీ కమిటీ సభ్యులు,కాలనీ వాసులు,సీనియర్ నాయకులు స్థానిక నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద కోడూరు గ్రామంలో రూ.40 లక్షలతో, అప్పాయిపల్లి గ్రామంలో 10 లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇతర అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు త్వరలో వస్తాయని అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని ఆయన స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని అందుకే గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లు ఉచిత విద్యుత్, రూ.500లకే సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటుగా భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేస్తున్నామన్నారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేశామని ఆయన గుర్తు చేశారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని ధర్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముడా నిధులతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా విద్యావ్యవస్థ నిర్వీర్యం అయ్యిందని కనీస మౌలిక సదుపాయాలను కూడా గత బిఆర్ఎస్ ప్రభుత్వం కల్పించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. పదవ తరగతి వార్షిక పరీక్షలకు సన్నద్ధమౌతున్న విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సుధాకర్ రెడ్డి, రామచంద్రయ్య, శ్రీనివాస్ యాదవ్, గోవింద్ యాదవ్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, మల్లు అనిల్ కుమార్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజంలో కలుపు మొక్కలను ఏరివేస్తాం : విరాహత్ అలీ

విశాలాంధ్ర - హైదరాబాద్/విశాలాంధ్ర, మొయినాబాద్ : : పవిత్రమైన జర్నలిజం వృత్తిని నాశనం చేస్తున్న కలుపు మొక్కలాంటి నకిలీలను ఏరివేసి, వృత్తికి పూర్వ వైభవం తెచ్చేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ స్పష్టం చేశారు. మంగళవారం శంకర్ పల్లి మండల పరిధిలో గల ప్రగతి రిసార్ట్స్‌లో జరిగిన యూనియన్ రంగారెడ్డి జిల్లా మహాసభకు ఆయన విశిష్ట అతిథిగా హాజరై ప్రసంగించారు. జర్నలిజం పట్ల ఎలాంటి అవగాహన లేని కొన్ని శక్తులు టీవీ లోగోలను, ప్రభుత్వ గుర్తింపు లేని పత్రికలను సృష్టించుకొని, జర్నలిస్టులుగా చెలామణి అవుతూ, బ్లాక్ మెయిల్ దందాలకు పాల్పడుతూ పబ్బం గడుపుతూ వృత్తి పవిత్రతను, గౌరవాన్ని దెబ్బతీస్తున్నారని విరాహత్ అలీ ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి శక్తుల కదలికలపై ఇప్పటికే తమ సంఘం కన్నేసి పెట్టిందని, వారిని పట్టుకొని చట్టపరంగా తగిన శిక్ష విధించేందుకు పగడ్బంది చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. విలువలు, ఐక్యత, పోరాటాలు, త్యాగాల కలయికతో డెబ్బై ఏండ్ల క్రితం ఆవిర్భవించిన తమ సంఘం ఆ స్ఫూర్తితోనే నేటివరకు పనిచేస్తూ, జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన కోసం అవిశ్రాంతంగా లెక్కలేనన్ని పోరాటాలు చేస్తున్నట్లు ఆయన అన్నారు. తాము ఏ పార్టీకో, ఏ ప్రభుత్వానికో వత్తాసు పలికేది లేదని, జర్నలిస్టుల సంక్షేమమే తమ ఏకైక లక్ష్యమన్నారు. గతంలో నిజామాబాద్ జిల్లాలో జర్నలిస్టు మల్లెపూల నరేందర్ పోలీసుల-నక్సలైట్ల యుద్ధంలో చిక్కుకొని, వారి కాల్పుల్లో మృతి చెందిన ఘటనపై, రంగారెడ్డి జిల్లాలో అధికార పార్టీ నేతల భూభాగోతాన్ని వెలుగులోకి తెచ్చిన జర్నలిస్టు గులాం రసూల్ ను పోలీసులు ఎన్కౌంటర్ చేసిన సంఘటనపై, మెదక్ లో జర్నలిస్టు యాదగిరిని కల్లు మాఫీయా హత్య చేసిన సంఘటనపై, నల్లగొండ జిల్లా ఆలేరులో జర్నలిస్టు శ్రీధర్ రెడ్డిని నక్సలైట్లు కాల్చి చంపిన ఘటనపై దేశ స్థాయిలో పోరాటాలు చేసి, ప్రభుత్వాల మెడలు వంచి, విచారణలు జరిపించి నిందితులకు సరైన బుద్ధి చెప్పిన ఘనత తమ సంఘానికే దక్కిందని విరాహత్ అలీ స్పష్టం చేశారు. అలాగే జర్నలిస్టులపై, మీడియా సంస్థలపై జరిగిన ఎన్నో దాడులను పోరాటాలతో ఎదుర్కొన్న చరిత్ర తమకు ఉందన్నారు. ముఖ్యంగా యాజమాన్యాల దృష్టిలో అంటరాని వాళ్లుగా పరిగణించబడిన గ్రామీణ ప్రాంత విలేఖరులకు అక్రెడిటేషన్లు సాధించి, వారికి వర్కింగ్ జర్నలిస్టులుగా గుర్తింపు కల్పించిన ఘనత తమ సంఘానిదేనని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో జర్నలిస్టుల హక్కుల సాధన కోసం మరిన్ని రాజీలేని పోరాటాలు చేస్తామని విరాహత్ అలీ భరోసా ఇచ్చారు. ఇంకా ఈ మహాసభలో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యులు, మన తెలంగాణ పత్రిక సంపాదకులు దేవులపల్లి అమర్, బిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా నేత పట్లోళ్ల కార్తిక్ రెడ్డి, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, ఐజేయు జాతీయ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శులు కె.శ్రీకాంత్ రెడ్డి, జి.మధు గౌడ్, రాష్ట్ర కోశాధికారి యం.వెంకట్ రెడ్డిలతో పాటు రంగారెడ్డి జిల్లాకు చెందిన దాదాపు 450 మంది జర్నలిస్టులు హాజరయ్యారు.

రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడిగా శేరిలింగంపల్లి నియోజకవర్గ మన తెలంగాణ స్టాఫ్ రిపోర్టర్ ఎండి సలీమ్ పాషా ఎన్నికయ్యారు. 2000 సంవత్సరం నుంచి వార్త, నమస్తే తెలంగాణ, సూర్యపత్రికలలో రిపోర్టర్‌గా పని చేసి ప్రస్తుతం మన తెలంగాణ పత్రికలో స్టాఫ్ రిపోర్టర్‌గా పని చేస్తున్నారు. యూనియన్‌లో రాష్ట్ర, జాతీయ కౌన్సిల్ సభ్యునిగా, సోషల్ మీడియా ప్రచార కమిటీ సభ్యునిగా పని చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుండి బీకాం,బీసీజే, ఎల్ ఎల్ బి, ఎల్ఎల్ఎం, కాకతీయ యూనివర్సిటీ నుంచి ఎంసిజే పూర్తి చేసిన సలీమ్ పాషా విద్యార్థి ఉద్యమ నేతగా, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేశారు. వైజ్‌మెన్ లాంటి స్వచ్ఛంద సంస్థలలో సైతం సెంట్రల్ ఇండియా రీజన్‌లో అనేక కీలక బాధ్యతలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులతో సత్సంబంధాలు ఉండటంతో సలీమ్ ను జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జర్నలిస్టుల గొంతుకగా పనిచేస్తా : సలీమ్ పాషా

తనను రంగారెడ్డి జిల్లా జర్నలిస్టుల సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.అదేవిధంగా ప్రెస్ అకాడమీ చైర్మన్, ఐజేయూ జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డికి, మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్‌కి,జాతీయ కార్యదర్శి నరేందర్ రెడ్డికి,రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీకి,ప్రధాన కార్యదర్శి రాం నారాయణకి,కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.ఏకగ్రీవంగా ఎన్నికవ్వటానికి సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

అభినందనల వెల్లువ

జిల్లా యూనియన్ నూతన అధ్యక్షుడిగా సలీమ్ పాషా ఎన్నిక పట్ల జిల్లాలోని పలు నియోజకవర్గాల ప్రెస్ క్లబ్ ల తరుపున శుభాకాంక్షలు తెలిపారు. ఎల్.బి.నగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, షాద్ నగర్,కల్వకుర్తి నియోజకవర్గాల జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండ విజయ్ కుమార్, చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షులు యాదయ్య, శంకర్ పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి మల్లికార్జున్,జిలానీలు శుభాకాంక్షలు తెలిపారు.

ప్లాంట్ నిర్మాణానికి బిహెచ్ఇఎల్‌తో ఒప్పందం : సీఎండీ

విశాలాంధ్ర, హైదరాబాద్ : మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద గల 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో మరో 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పూర్తి కాగా ఈ నిర్మాణ పనులకు సంబంధించి ప్రభుత్వ సంస్థ అయిన భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బి.హెచ్. ఇ.ఎల్.)తో సింగరేణి సంస్థ ఒప్పందం కుదుర్చు కుంది. హైదరాబాద్ సింగరేణి భవన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ తరఫున సీఎండీ ఎన్.బలరామ్‌తో పాటు డైరెక్టర్ (ఈఅండ్ఎం) డి.సత్యనారాయణరావు, డైరెక్టర్ (ఆపరేషన్స్), ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్(పీ అండ్ పీ) కె.వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం.సుభానీ, సింగరేణి విద్యుత్ విభాగం ఉన్నతాధికారులు, బి.హెచ్.ఇ.ఎల్. నుంచి జనరల్ మేనేజర్ మరియు హెడ్ శ్రీ పార్థసారథి దాస్, జీఎం శ్రీ జోగేష్ గులాటి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. గరిష్టంగా నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాలని ఒప్పందం ఉన్నప్పటికీ, 40 నెలల్లోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా వచ్చే నెల నుంచే పనులు ప్రారంభించాలన్నారు. ఇచ్చిన షెడ్యూల్ లోపే పనులు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. పవర్ ప్రాజెక్టు ప్రాంగణంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకుని త్వరితగతిన ప్లాంట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బీహెచ్ఈఎల్ జీఎం అండ్ హెడ్ పార్థసారథి దాస్ మాట్లాడుతూ.. సింగరేణి పవర్ ప్లాంట్ అతి ప్రాధాన్య ప్రాజెక్టుగా తమ బోర్డు నిర్ణయించిందని, ఈ నేపథ్యంలో పనులను వెంటనే ప్రారంభిస్తామన్నారు. గతంలో చేపట్టిన 1200 మెగావాట్ల ప్రాజెక్టులో ఎదురైన సమస్యలను ముందే అధిగమించేలా ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు.

ప్లాంట్ పూర్తయితే ఏటా రూ.300 కోట్ల లాభాలు

ఈ ఒప్పందం ప్రకారం బి.హెచ్.ఇ.ఎల్. సంస్థ 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి సంబంధించి బాయిలర్స్, టర్బైన్స్, జనరేటర్ల (బి.టీ.జి.) ఏర్పాటుతోపాటు అన్ని రకాల సివిల్ తదితర అన్ని నిర్మాణాలను 48 నెలల్లో అనగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం సింగరేణి సంస్థ 2016లో పూర్తయిన 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం విజయవంతంగా నడుస్తూ కంపెనీకి ప్రతి ఏడాది సుమారు రూ.450 కోట్ల వరకు లాభాలను ఆర్జించి పెడుతుంది. ఇప్పటివరకు ఈ ప్లాంటు సుమారు 70 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను రాష్ట్ర అవసరాలకు అందించింది. ఈ నేపథ్యంలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం పలుమార్లు దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రాలలో కెల్లా అత్యధికంగా ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీ.ఎల్.ఎఫ్.) సాధిస్తూ జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. దీనితో ఈ కొత్త ప్లాంట్ కు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణ పనులకు ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. ఈ ప్లాంట్ పూర్తయితే సింగరేణి సంస్థకు ఏడాదికి మరో రూ.300 కోట్ల వరకు లాభాలు చేకూరే అవకాశం ఉంది. ఇది సింగరేణి ప్రగతికి ఎంతో దోహదపడుతుంది.

మహిళా దినోత్సవం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని మంగళవారం సబర్బన్ ట్రెన్ అండ్ బస్ ట్రావెల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జెడ్ఆర్.యు.సి.సి సభ్యులు నూర్ ఆధ్వర్యంలో సౌత్ సెంట్రల్ రైల్వే మహిళా అధికారులు, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్లు సికింద్రాబాద్ డివిజన్ జి. సుచరిత రెడ్డి, హైదరాబాద్ డివిజన్ కే.భాగ్యం, సీనియర్ సెక్షన్ ఇంజనీర్, టెలికాం మల్కాజిగిరి కే.వందన, ప్రిన్సిపాల్ లిల్లి మోడల్ హై స్కూల్ అజ్రా సయాద్, సునీత, (RPFమల్కాజ్‌గిరి)ను శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందచేశారు. మల్కాజిగిరి స్టేషన్‌లో పని చేస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంచిపెట్టారు. డి.ఆర్.యు.సి.సి హైదరాబాద్ డివిజన్ సభ్యులు పి.భరద్వాజ్, ఏ.వి. స్వామి అధ్యక్షుడు , శంకర్ రావు, వై సుధా, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎండీసీ సహకారం తమకు దోహదం : బలరామ్

విశాలాంధ్ర, హైదరాబాద్ : బొగ్గు రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి దేశ అవసరాల దృష్ట్యా క్రిటికల్ మినరల్స్ మైనింగ్‌లోకి అడుగు పెట్టాలని కృత నిశ్చయంతో ఉందని, ఈ నేపథ్యంలో గత 60 ఏళ్లుగా ఖనిజాల ఉత్పత్తిలో అంతర్జాతీయ అనుభవం ఉన్న జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) తో కలిసి నడిచేందుకు సంసిద్ధంగా ఉన్నామని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం సింగరేణి డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో కలిసి ఎన్ ఎం డీ సీ సీఎండీ అమితావ ముఖర్జీ మరియు ఆ సంస్థ డైరెక్టర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విదేశాల్లో క్రిటికల్ మినరల్స్, ఇతర ఖనిజాల మైనింగ్ లో అపార అనుభవం ఉన్న ఎన్ఎండీసీ సహకారం తమకు ఎంతగానో దోహదపడుతుందని సీఎండీ ఎన్.బలరామ్ అభిప్రాయ పడ్డారు. క్రిటికల్ మినరల్స్ మైనింగ్‌లో మేథో విజ్ఞానాన్ని పంచుకునేందుకు ఐఐటీ-హైదరాబాద్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి సాంకేతికత, మానవ వనరులపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో చేపడుతున్న సింగరేణి వ్యాపార విస్తరణ చర్యలను వివరించారు. ఎన్.ఎం.డి.సి. సీఎండీ అమితావ ముఖర్జీ మాట్లాడుతూ దేశ ఇంధన అవసరాలు తీర్చడంలో సింగరేణి, ఖనిజ వనరులను జాతికి అందించేందుకు ఎన్.ఎం.డి.సీలు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికి సహకరించేందుకు ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటామన్నారు. రానున్న రోజుల్లో తాము చేపట్టబోయే ప్రాజెక్టుల్లో సింగరేణిని సహ భాగస్వామిగా చేసుకునే అవకాశాలను పరిశీలిస్తామన్నారు. అలాగే జార్ఖండ్ లో తమకు దక్కిన బొగ్గు బ్లాక్ లోనూ అవసరమైతే సింగరేణి సహకారం తీసుకుంటామన్నారు. పరస్పర సహకారంతో ముందుకు వెళ్లడానికి సంసిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో ఎన్ ఎం డీ సీ డైరెక్టర్లు విశ్వనాథ సురేశ్ (కమర్షియల్), వినయ్ కుమార్ (టెక్నికల్), జయ్ దీప్ దాస్ గుప్తా (ప్రొడక్షన్) ప్రియదర్శిణి గద్దం(పర్సనల్), సింగరేణి డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ(ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు(పి అండ్ పి), ఈడీ(కో ల్ మూమెంట్) ఎస్డీ ఎం సుభానీ, జీఎం(ఫైనాన్స్) సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో విద్యాపురోగతిపై చర్చ

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకుల మధ్య బలమైన, సహాయక సంబంధాలను నిర్మించడానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంది. ఇటీవల, విశ్వవిద్యాలయం విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్‌తో సహా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని కీలక నగరాల్లో తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాల శ్రేణిని నిర్వహించింది. వేలాది మంది తల్లిదండ్రులు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు, పిల్లల విద్యా పురోగతి, సవాళ్లు మొత్తం వృద్ధి గురించి చర్చల్లో పాల్గొన్నారు.

మహిళలకు డిజిటల్ ఇ-కామర్స్

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : డిజిటల్ ఇ-కామర్స్ పర్యావరణ వ్యవస్థలో విజయం సాధించడానికి వైకల్యం ఉన్న మహిళలకు అవసరమైన వనరులు, సాధనాలు శిక్షణ అందించడం లక్ష్యంగా అమెజాన్ సహేలి కార్యక్రమం ద్వారా, ఈ మహిళా విక్రేతలు తమ ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో ప్రదర్శించడానికి విక్రయించడానికి వీలు కల్పిస్తారు. నేషనల్, ఇండియా, భారతదేశంలో పేదరికం లేని జీవితం కోసం దివ్యాంగులైన యువతకు సహాయం చేయడంపై దృష్టి సారించిన యూత్4 జాబ్స్ ఫౌండేషన్‌తో అమెజాన్ ఇండియా భాగస్వామ్యం కుదుర్చుకుంది. అమెజాన్ సహేలి కార్యక్రమం ద్వారా, ఇది ప్రతిభావంతులైన, దివ్యాంగులైన మహిళలకు విస్తృత మార్కెట్ అవకాశాల, తద్వారా వారు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో తమ వ్యాపారాన్ని పెంచుకోవచ్చు. ఈ భాగస్వామ్యంతో, అమెజాన్ ఈ మహిళా విక్రేతలకు వర్క్‌షాప్‌లను నిర్వహిస్తుంది, ఆన్‌బోర్డింగ్ ఖాతా నిర్వహణ మద్దతును అందిస్తుంది. డిజిటల్ మార్కెటింగ్, పనితీరు మార్కెటింగ్, ఉత్పత్తి జాబితా మెరుగుదల ప్రకటన పరిష్కారాలపై వారికి ఆచరణాత్మక శిక్షణ ఇవ్వబడుతుంది, ఇతః భాగస్వామ్యం గురించి అమెజాన్ ఇండియా సేల్స్ డైరెక్టర్ గౌరవ్ భట్నాగర్ మాట్లాడుతూ, భారతదేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మహిళా వ్యవస్థాపకుల సామర్థ్యాన్ని పెంచడం కుదురుతుందని అన్నారు.

‘ఓంకార స్వరూప్ శ్రీ లహరికృష్ణ అమృత్ గీతాయన్’ ఆల్బమ్ విడుదల

విశాలాంధ్ర-బషీర్ బాగ్: మనుజ్యోతి ఆశ్రమం ఆధ్వర్యంలో సేవాలాల్ బంజారా భవన్‌లో ఆధ్యాత్మిక ఆల్బమ్ ఓంకార స్వరూప్ శ్రీ లహరికృష్ణ అమృత్ గీతాయన్ అహిల్యా మిశ్రా, గజల్ శ్రీనివాస్ విడుదల చేశారు. ఈ కార్యక్రమం శ్రీరామ్ తివారి రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మనుజ్యోతి ఆశ్రమ అధ్యక్షులు ఉపాజ్ నవరాజా మాట్లాడుతూ ఈ యాంత్రిక జీవన ప్రయాణంలో ఈ పాటలు ప్రజలకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. అనంతరం గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ మనుజ్యోతి ఆశ్రమం గొప్ప ఆధ్యాత్మిక సేవ చేయుచున్నదనీ అని అన్నారు. తాము సైతం మనుజ్యోతి ఆశ్రమన్ని తప్పక దర్శిస్తానన్నారు. తమిళనాడు నుండి, ఆంధ్ర, బిలాయి, ఢిల్లీ, ఒరిస్సా నుండి అనేకమంది శ్రీమన్నారాయణ శ్రీ లహరికృష్ణ భక్తులు మనుజ్యోతి ఆశ్రమంలో కలుసుకున్నారు. ఈ ఆల్బమ్ లోని గాయకులు పద్మశ్రీ అనూప్ జలోటా, సాధన సర్గం పంపిన అభినందన ప్రశంసలతో యింకా గాయకులు శ్రీకాంత్ కృష్ణ, ప్రసన్న జోషి, రాజ్యలక్ష్మి సంజయ్ వారి గానములతో సభ రసావంతరంగా, కరతళ ధ్వనులతో ఓంకార స్వరూప్ శ్రీ లహరికృష్ణ అమృత్ గీతాయన్ ఆధ్యాత్మిక పాటలు విడుదల చేశారు. హైదరాబాద్ ఆడిషనల్ కలెక్టర్ పి. కదిరా వన్ విచ్చేశారు. కార్యక్రమంలో మనుజ్యోతి ఆశ్రమ నిర్వాహకులు ఉపాస నవరాజా, లియో కొలంబస్, మ్యూజిక్ డైరెక్టర్ శైలస్ దాని, పాటలను సురేష్ తివారి పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయనిధి ఒక వరం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్:ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరు పేదలకు వరమని నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాచుపల్లి 2వ డివిజన్ ప్రగతినగర్ ప్రెసిడెంట్ సురగణి వీరబాబు పెద్దనాన్న వీరాస్వామి గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుటకు ఆర్థిక స్తోమత సమస్యను నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి తెలుసుకొని వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితుడికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 4,00,000/ల సీఎం సహాయనిధి - ఎల్వోసీని మంజూరి చేయించి, పత్రాలను వీరబాబుకి ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ 1వ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజిరెడ్డి, 126 డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పద్మ రావు , ప్రశాంత్ రెడ్డి, షఫీ, సురేందర్, శివ కుమార్, మల్లేష్, మొహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: మియాపూర్ డివిజన్ పరిధిలోని బికె ఎనక్లేవ్ కాలనీలో గల పద్మావతి ఆండాళ్ సమేత వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం 17వ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమంలో భాగంగా స్వామి వారి కల్యాణ మహోత్సవం కార్యక్రమంల కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ బికె ఎనక్లేవ్ కాలనీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి ప్రతాప్ రెడ్డి,రాంభూపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, జనార్దన్ రెడ్డి టెంపుల్ కమిటీ సభ్యులు సాయికృష్ణన్, తిరుపతి నాయుడు,స్వామి నాయుడు వెంకటేశ్వర్లు, సదానందము, మనోహర్ సింగ్ మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

దక్షిణాది రాష్ట్రాలు మేల్కోనాలి

- ఎంపీ సీట్లు కంటే జనాభా సమస్యపై ఆలోచించాలి
- లక్ష కోట్లు పెట్టుబడులు వచ్చేలా రాజధాని నిర్మిస్తాం
- ఏఐ కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దుతాం
- ఎస్ఆర్ఎం యూనివర్సిటీ సదస్సులో సీఎం చంద్రబాబు
- రూ.700 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జనాభా సమస్యపై దక్షిణాది రాష్ట్రాలు మేల్కొనాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. జనాభా తగ్గడం వల్ల ఎంపీ సీట్లు తగ్గుతాయనే భావన రాజకీయ నేతల్లో ఉందని, కానీ దీనికంటే జనాభా సమస్య పెద్దదని అన్నారు. దానిగురించి అందరూ ఆలోచించాలని కోరారు. ఏపీ ప్రణాళిక విభాగం అధ్వర్యంలో అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 'పాపులేషన్ డైనమిక్స్ అండ్ డెవలప్‌మెంట్' సదస్సు బుధవారం జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు సుదీర్ఘంగా సాగిన ఈ సదస్సుకు అనేక మంది ప్రముఖులు హాజరుకాగా, ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. సదస్సు ముగింపులో సీఎం మాట్లాడుతూ మనకు దేశం ముఖ్యం. తర్వాతే రాష్ట్రం. జనాభా పెరుగుదల గురించి దక్షిణాది రాష్ట్రాలన్నీ దృష్టి పెట్టాలన్నారు. సాధారణ ప్రసవాలు పెరగాలి, సిజేరియన్లు తగ్గాలన్నారు. రెండు జీతాలు, ఒక్క సంతానం చాలని చాలా మంది అనుకుంటున్నారు. జనాభా పెరుగుదలపై నిశ్శబ్దం వీడాలి, దీనిపై విస్తృత చర్చ జరగాలన్నారు. ప్రభుత్వం కూడా జనాభా పెరుగుదలకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రసూతి సెలవులు ఎన్ని కాన్పులకైనా ఇస్తామని సీఎం ప్రకటించారు. మన కుటుంబ వ్యవస్థ ప్రపంచంలోనే అద్భుతమని, జనాభా పెంచాలనే ప్రతిపాదనతో ఇప్పుడు ముందుకు వెళుతున్నామని అన్నారు. తెలుగువారు ప్రపంచంలో అన్ని చోట్లా కీలకంగా పని చేస్తున్నారని, కీలక రంగాల్లో అగ్రగామిగా ఉన్నారని చెప్పారు. జపాన్, జర్మనీలు సైతం భారతీయుల కోసం ఎదురు చూస్తున్నాయని, ప్రపంచంలోని ప్రతి కంపెనీని భారతీయులే నడపాలని కోరుకుంటున్నానని అన్నారు. తెలంగాణకు అధిక ఆదాయం రావటానికి అప్పట్లో టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. తాను నిత్య విద్యార్థిని అని, నిరంతరం నేర్చుకోవటం తనకు ఇష్టమని చెప్పారు. నీటి లభ్యత, ఆహార ఉత్పత్తి పెరగకుండా జనాభా పెరిగితే ఇబ్బందులు వస్తాయన్నారు. అప్పట్లో జనాభా తగ్గుదల గురించి గట్టిగా పని చేశానని, ఇప్పటి పరిస్థితుల్లో రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ ఇప్పుడు జనాభా పెరుగుదల గురించి మాట్లాడాల్సి వస్తోందని చంద్రబాబు అన్నారు.

భవిష్యత్ ఏఐదే

గతంలో ఐటీ అభివృద్ధికి కృషి చేశామని, ఇప్పుడు భవిష్యత్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కే ఉందని చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. అమరావతి ఏఐకి కేంద్రంగా తీర్చిదిద్దుతామని, అన్ని రంగాలకు క్వాంటం కంప్యూటింగ్ అనుసంధానం చేస్తామన్నారు. ముఖ్యంగా ఏపీ విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉండేలా, ఉన్నతంగా ఎదిగేలా అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటానని హామీ ఇచ్చారు. సమస్యలను ఛాలెంజ్‌గా తీసుకుని అవకాశాలను అందిపుచ్చుకోవడం తనకు అలవాటు అని అన్నారు. విద్యార్థులు కూడా ఇదే విధానాన్ని అలవర్చుకుని జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యను ఛాలెంజ్‌గా తీసుకోవాలన్నారు. పది సూత్రాల ప్రణాళికతో ముందుకు వెళుతున్నామన్నారు. పేదరికం లేని సమాజం కోసమే పీ4 విధానం. పేదలను పైకి తెచ్చేందుకు ప్రభుత్వాలు చేసే పనులతో పాటు మీరు కూడా సహకరించాలి. ప్రభుత్వ- ప్రైవేటు భాగస్వామ్యంతో సంపద పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలి. ఉద్యోగాల కల్పన చాలా ముఖ్యం. హార్డ్ వర్క్ కంటే స్మార్ట్ వర్క్ ముఖ్యం. పని విధానంలో మార్పులు రావాలి. ఉత్పాదకత పెరిగేలా, ఫలితాలు ఉండేలా పని చేయాలి. చదువుకున్న మహిళలు ఇంటి నుంచే పని చేసేలా ప్రణాళికలు. మగ వారికంటే మహిళలు బాగా పని చేయగలుగుతారు. ఐటీ ఉద్యోగుల్లో మహిళలు మగవారి కంటే ఎక్కువ జీతాలు పొందుతున్నారు. సాంకేతికత సాయంతో వ్యవసాయం చేయాలి. గ్రీన్ ఎనర్జీకి అధిక ప్రాధాన్యత ఇచ్చి ఇంధన రంగంలో అగ్రగామిగా ఎదగాలి. అమరావతి మొత్తం సోలార్ ఎనర్జీ సరఫరా ఉండేలా చూస్తామన్నారు.

రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చేలా అమరావతి నిర్మాణం

లక్ష కోట్లు పెట్టుబడులు వచ్చేలా అమరావతి రాజధానిని నిర్మిస్తామని చంద్రబాబు చెప్పారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్, నేను విజన్-2047 అంటున్నాం. ఐదేళ్లుగా రాష్ట్ర ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. అమరావతి నిర్మాణం కొనసాగి ఉంటే ఈపాటికి ఇక్కడ రూపురేఖలు మారిపోయేవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయి. రూ.లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చేలా అమరావతి నిర్మాణం జరగబోతోంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విస్తరణకు అవసరమైన భూమి, నీరు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. అంకుర కేంద్రం ఏర్పాటు చేయాలని ఎస్ఆర్ఎంను కోరా. ఉద్యోగాలు చేసే వారిని కాకుండా ఉద్యోగాలు ఇచ్చే వారిని తయారు చేయాలని సూచించా. రాష్ట్రంలో ఇప్పుడు 2.58 లక్షల తలసరి ఆదాయం మాత్రమే ఉంది. 2047 కల్లా ప్రజల తలసరి ఆదాయం రూ.58 లక్షలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చంద్రబాబు చెప్పారు.

రూ.700 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు

ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో దాదాపు రూ.700 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే నూతన భవనాల నిర్మాణ పనులకు సీఎం చంద్రబాబు శంకుస్థాపనలు చేశారు. అలాగే నూతనంగా నిర్మించిన రెండు హాస్టల్ భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్, యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి.సత్యనారాయణన్, వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్‌కుమార్ ఆరోరా, రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ్‌కుమార్, సదస్సు నిర్వహణ కమిటీ చైర్మన్ ఆచార్య డి.నారాయణరావు తదితరులు ప్రసంగించారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

సీఎస్ విజయానంద్‌కు రామకృష్ణ వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా విభాగాల ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను సంఘ నేతలతో కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ కార్మికుల సమస్యలను సీఎస్‌కు వివరించారు. విద్యుత్ సంస్థలలో 30 వేల పైచిలుకు ఒప్పంద ప్రతిపాదికన కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి ఉద్యోగ భద్రత కల్పించి క్రమబద్ధీకరించాలని... పీఆర్సీ, అరియర్స్. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ఇవ్వాలని కోరారు. ఒప్పంద ఉద్యోగులకు జీతాలు నేరుగా సంస్థే చెల్లించాలన్నారు. ఉద్యోగులకు సంస్థకు మధ్య ఉన్న మూడో వ్యక్తి ద్వారా జీతాలు చెల్లించే విధానాన్ని రద్దు చేయాలని సూచించారు. గ్రామ వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలని, ఎలక్ట్రిసిటీ బోర్డు సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, 1999-2004మధ్య నియమించిన విద్యుత్ ఉద్యోగులకు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌గా మార్పు చేసి పాత విధానంలో పింఛన్ అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల కోసం నగదురహిత అపరిమిత ఆరోగ్య విధానాన్ని తేవాలన్నారు. మీటర్ రిడర్స్, జెన్‌కోలో జాబ్ వర్క్‌లో పనిచేసే కార్మికులను మ్యాన్ పవర్ కింద ఒప్పందం చేయాలని కోరారు. సమావేశంలో ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్న శివయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం బాలకాశి, గ్రామ వార్డు ఎనర్జీ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

ఐసెట్-2025 నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని 2025-26 విద్యా సంవత్సరానికి విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఐసెట్) 2025 నోటిఫికేషన్ విడుదలయింది. ఈ మేరకు ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఏడాదికి ఐసెట్ 2025 ప్రవేశ పరీక్ష విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యా లయం నిర్వహిస్తోంది. అర్హులయిన అభ్యర్థులు ఆన్ లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్ లైన్ దరఖాస్తులు మార్చి 13 నుంచి ప్రారంభమవుతాయి. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 9, 2025వ తేదీ వరకు ఆన్ లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఐసెట్ ప్రవేశ పరీక్ష మే 7న నిర్వహిస్తారు. మే 7వ తేదీన మొత్తం రెండు షిఫ్టులలో ఈ పరీక్ష ఉంటుంది. ఆయా రోజుల్లో ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సెకండ్ షిఫ్ట్ పరీక్ష ఉంటుంది. విద్యార్హతలు, ఆలస్య రుసుముతో దరఖాస్తులు చెల్లించవల్సిన గడువు తేదీలు, సిలబస్ వంటి ఇతర పూర్తి సమాచారం వివరణాత్మక నోటిఫికేషన్ విడుదలయి తర్వాత తనిఖీ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ సమయంలో జనరల్ అభ్యర్థులు రూ.650, ఓబీసీ అభ్యర్థులు రూ.600, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.550 చొప్పున దరఖాస్తు ఫీజు చెల్లించవలసి ఉంటుంది.

అంగన్‌వాడీలకు చంద్రబాబు టోకరా: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ఏమైందని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు షర్మిల ప్రశ్నించారు. మాట తప్పి మోసం చేయడం అంటే ఇదేనని ఆరోపించారు. అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందని ఎక్స్‌వేదిగా మంగళవారం ఆమె విరుచుకుపడ్డారు. తమ గోడు వినిపించాలనుకున్న అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ నిర్బంధించడం నిరంకుశత్వానికి నిదర్శనమని, వారి గొంతు నొక్కి, ఆందోళనలను అణిచివేయడం కూటమి ప్రభుత్వ నియంత చేష్టలకు పరాకాష్ట అని పేర్కొన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లు పూర్తిగా న్యాయబద్ధమైనవని, వెంటనే వారితో ప్రభుత్వం చర్చించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు నెలకు గౌరవ వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ చెల్లింపు హామీని అమలు చేయాలన్నారు. మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా పరిగణించాలని, హెల్పర్ల పదోన్నతిపై నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని, పెండింగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. విధి నిర్వహణలో అంగన్‌వాడీలు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగంతో పాటు మట్టి ఖర్చుల కింద రూ.20 వేలు ఇవ్వాలని, వాటితో పాటు మరో 12 డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే దీనిపై ప్రకటన చేయాలని షర్మిల డిమాండ్ చేశారు.

రైతులను ఆదుకోవడంలో వైఫల్యం

కూటమి ప్రభుత్వంపై ఎమ్మెల్సీ వరుదు కల్యాణి విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతాంగాన్ని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆమె మాట్లాడుతూ అడుగడుగునా రైతులను మోసం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు పెట్టుబడి సాయం లేదు... మరోవైపు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతన్నలు కుదేలవుతున్నప్పటికీ ఈ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. శాసనమండలిలో వ్యవసాయంపై జరిగిన లఘు చర్చ సందర్భంగా రైతన్నల పట్ల కూటమి ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య ధోరణి బయటపడిందని, రైతులను ఆదుకోవడంలో ఈ ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో ప్రకటించిన అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పారని, అందులో ఆరువేల రూపాయలు కేంద్రం ఇస్తుందని, మిగిలిన రూ.14 వేలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇస్తామని ఎక్కడా చెప్పలేదని గుర్తుచేశారు. తాజాగా బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం ఇచ్చే దానితో కలిపి అని చెప్పడం రైతులను మోసగించడమేనని మండిపడ్డారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు మిర్చి క్వింటాకు రూ.21 వేల నుంచి రూ.27 వేల వరకు ధర పలికేదని, ఇటీవల మిర్చి రేటు క్వింటా రూ.9 వేలకు పడిపోయిందని వివరించారు.

ప్రతిపక్షంతో గొంతు కలిపిన బీజేడీ

ఓటరు జాబితా మోసంపై రాజ్యసభ నుంచి సభ్యుల వాకౌట్

న్యూఢిల్లీ: ఓటరు జాబితాల తారుమారుపై చర్చ కోసం చేసిన డిమాండ్ తిరస్కరించిన తర్వాత... ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ (బీజేడీ) మంగళవారం రాజ్యసభలో నకిలీ ఓటర్లపై ప్రతిపక్ష గొంతులో భాగంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తో కలిసి చేరింది. బీజేడీ, తృణమూల్ సభ్యులు రాజ్యసభ నుంచి మంగళవారం వాకౌట్ చేశారు. ప్రతిపక్ష బెంచీలలో ఉన్న ఇతర పార్టీల సభ్యులు కూడా వారితో చేరారు. గత సంవత్సరం లోక్‌సభ ఎన్నికల్లో ఒడిశాలో బీజేడీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. ఆ తర్వాత జరిగిన బీజేడీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్... పార్లమెంటులో బలమైన, శక్తివంతమైన ప్రతిపక్ష పాత్ర పోషించాలని పార్టీ రాజ్యసభ సభ్యులకు సూచించారు. నరేంద్ర మోదీ పాలనలో మొదటి రెండు పర్యాయాలలో పాలక బీజేడీ పార్టీ... బీజేపీకి అంశాల వారీ మద్దతు ఇచ్చింది. గతంలో బీజేడీ పార్లమెంటులో కీలక బిల్లులు, అంశాలపై బీజేపీకి మద్దతు ఇవ్వడమే కాకుండా, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ 2019, 2024లో రాజ్యసభకు ఎన్నిక కావడానికి కూడా సహాయపడింది. ఇప్పుడు ఓటర్ల జాబితాలలో విస్తృతమైన ఎన్నికల మోసం అనే అంశాన్ని లేవనెత్తుతున్న ప్రతిపక్షంతో ఆ పార్టీ గొంతు కలిపింది. బీజేడీ సోమవారం రూల్ 267 కింద సభ కార్యకలాపాలను నిలిపివేసి, ఓటర్ల జాబితాల తారుమారు చర్చ చేపట్టాలని కోరింది.

సంక్షేమ బోర్డు పునరుద్ధరణ

కార్మికశాఖ కార్యదర్శికి భవన నిర్మాణ కార్మిక సంఘం వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్, కన్స్ట్రక్షన్ వర్కర్స్ సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించి కార్మికులకు న్యాయం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సచివాలయంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ చాంబర్‌లో కార్మికశాఖ కార్యదర్శికి ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.వెంకటసుబ్బయ్య, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, బుజ్జితో కలిసి మంగళవారం ఆయన వినతిపత్రం అందజేశారు. పడాల రమణ మాట్లాడుతూ సంక్షేమ బోర్డును గత ప్రభుత్వం సర్వనాశనం చేసి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఈ సమస్యను నాడు ప్రస్తుత సీఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోవడానికి అనేకసార్లు కలిసినా ఫలితం లేదనీ, ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడుస్తున్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వెంకటసుబ్బయ్య, సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చలో పార్లమెంట్ నిర్వహిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునరుద్ధరించకపోతే దిల్లీస్థాయిలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

లోపాలపై సూచనలు చేయండి

రాజకీయ పార్టీలకు ఈసీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా జరిగే ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాపై ప్రతిపక్షాలు కొంతకాలంగా సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. దీంతో వివిధ సమస్యలను పరిష్కరించి... ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) కసరత్తు చేస్తోంది. దీనికి సహకరించాలంటూ రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చింది. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల స్థాయిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలకు ఈసీ సూచించింది. ఏప్రిల్ 30 నాటికి సలహాలు అందించాలని కోరింది. అందుకు సంబంధించి రాజకీయ పార్టీలకు సూచనలిచ్చింది. ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేసేందుకు ఆయా పార్టీల అధ్యక్షులు, సీనియన్ నేతలతో చర్చలు జరపాలని యోచిస్తున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. పార్టీల సీనియర్ నేతలు అందించే కీలక సూచనలు స్వీకరించనున్నట్లు తెలిపింది.

వైద్యంకోసం వచ్చి మృత్యు ఒడికి

కర్నాటక ఆర్టీసీ బస్సు ఢీకొని ఐదుగురి మృతి

విశాలాంధ్ర- ఆదోని రూరల్: రోజుల తరబడి అనారోగ్యాన్ని భరిస్తూ చికిత్స కోసం ఆదోనికి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురై ఐదుగురు మృతి చెందారు. ఈ ఘటన నంద్యాల జిల్లా ఆదోని రూరల్ మండలం పాండవగల్లు గ్రామ సమీపంలో ఆదోని- రాయచూరు ప్రధాన రహదారిపై మంగళవారం జరిగింది. కర్ణాటకలోని రాయచూరు జిల్లా మాన్వి తాలూకాకు చెందిన ఒకే కుటుంబం- మహేంద్ర (40), భార్య నాగరత్నమ్మ (35), కుమారుడు దేవరాజు(22) ద్విచక్ర వాహనంపై ఆదోనిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స, ఆదోని మండలం కుప్పగల్ గ్రామానికి చెందిన ఈరన్న(25), భార్య ఆదిలక్ష్మి(20) మరో ద్విచక్ర వాహనంపై ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రిలో చికిత్స కోసం వస్తుండగా ఆదోని నుంచి రాయచూరు వెళ్లే (కేఏ37ఎఫ్ 0711) కర్నాటక ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలపై దూసుకుపోయింది. దీంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో మరణించారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయచర్యలు అందించారు. బస్సు డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణమని స్థానికులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఘటనా స్థలానికి చేరుకొని... కారణాలు తెలుసుకున్నారు. మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసి... మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, సీపీఐ జిల్లా నాయకుడు అజయ్ బాబు, మండల కార్యదర్శి కల్లు బావిరాజు సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు కర్నాటక ప్రభుత్వం రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని అజయ్‌బాబు డిమాండ్ చేశారు.

ద్వైపాక్షిక బంధం బలోపేతం

మోదీ, గోకుల్ నిర్ణయం - మారిషస్‌లో భారత ప్రధానికి ఘన స్వాగతం



పోర్ట్ లూయిస్: భారత్, మారిషస్ మధ్య ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని అధినేతలు నరేంద్రమోదీ, ధరంవీర్ గోకుల్ నిర్ణయించారు. సహకారాన్ని పెంచుకోవాలని, కలిసికట్టుగా ముందుకెళ్లాలని నిర్ణయించారు. తమ దేశాల ప్రజల మధ్య బంధం మరింత పటిష్ఠం కావాలని ఆకాంక్షించారు. నేషనల్ డేకు గౌరవ అతిథిగా హాజరయ్యేందుకుగాను మోదీ మంగళవారం మారిషస్ చేరుకున్నారు. ఆయన రెండు రోజులు అక్కడ పర్యటిస్తారు. మోదీకి ఆదేశ అధ్యక్షుడు గోకుల్ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు భేటీ అయి ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. నేషనల్ డేలో పాల్గొనేందుకు తనకు రెండవసారి అవకాశం లభించడంపై మోదీ హర్షం వ్యక్తంచేశారు. ధరంవీర్ గోకుల్‌తో సమావేశం స్నేహపూర్వకంగా సాగిందని, భారత్ గురించి, భారతీయ సంస్కృతి గురించి ఆయనకు మంచి అవగాహన ఉందని ఎక్స్‌లో పేర్కొన్నారు. తనను ఆహ్వానించినందుకు మారిషస్ అధ్యక్షుడికి కృతజ్ఞతలు చెప్పారు. వివిధ రంగాల్లో ద్వైపాక్షిక బంధాన్ని పటిష్ఠపర్చుకొనేలా చర్చలు జరిపినట్లు మోదీ పేర్కొన్నారు. తన పర్యటన సందర్భంగా గోకుల్‌కు, ఆయన భార్య బ్రిందా గోకుల్‌కు ఓసీఐ కార్డులను మోదీ అందజేశారు. మహాకుంభ్ పవిత్ర జలాన్ని రాగి పాత్రలో వారికి ఇచ్చారు. బీహార్ ప్రత్యేక విందు 'మఖనా', సదేలీ పెట్టెలోబనారసీ సిల్కు చీరను బహూకరించారు. మోదీ అనంతరం అధికారిక విందును స్వీకరించారు. ఆపై ఆయుర్వేద వనాన్ని సందర్శించారు. తొలుత సర్ శ్రీవూసాగర్ రాంగూలం బొటానికల్ గార్డెన్‌లో మొక్క నాటారు. మోదీ దాదాపు దశాబ్దం కిందట అంటే 2015లో మారిషస్‌లో పర్యటించారు.

పోసానికి అన్ని కేసుల్లో బెయిల్

నేడు విడుదలయ్యే అవకాశం?

వంశీకి 25 వరకు రిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణమురళికి అన్ని కేసులో సంబంధిత న్యాయస్థానాలు బెయిల్ మంజూరు చేశాయి. మంగళవారం ఆదోని, విజయవాడ కోర్టుల్లో పోసానికి బెయిల్ లభించగా, ఈ నెల 10న నర్సరావుపేట కోర్టు బెయిల్ ఇచ్చింది. అంతకుముందే రాజంపేట కోర్టు బెయిల్ మంజూరు చేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూటమి నేతలపై పరుష పదజాలంతో మీడియా వేదికగా రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినందుకు వివిధ అంశాల్లో పోసానిపై మొత్తం 17 కేసులను చంద్రబాబు ప్రభుత్వం పెట్టింది. ఫిబ్రవరి 26న హైదరాబాద్‌లో పోసానిని అన్నమయ్య జిల్లా ఓబుళవారిపల్లె పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఒక్కో కేసులో పీటీ వారెంట్ కోరుతూ వందలకొద్దీ కిలోమీటర్ల చొప్పున పోసానిని పోలీసులు తీసుకెళ్లారు. హైదరాబాద్ నుంచి విజయవాడ మీదుగా రాజంపేటకు, తర్వాత అక్కడ నుంచి నర్సరావుపేటకు, తర్వాత గుంటూరుకు, అక్కడ నుంచి కర్నూలు జిల్లా ఆదోనికి, అదోని నుంచి మళ్లీ విజయవాడలోని సూర్యారావుపేటకు, అక్కడ నుంచి మళ్లీ కర్నూలు జైలుకు ఆయనను తరలించారు. బుధవారం విడుదలయ్యే అవకాశం ఉంది. ఇక వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి షాక్ తగిలింది. ఆయనకు ఈనెల 25 వరకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపు కేసులో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఈనెల 25 వరకు రిమాండ్ పొడిగిస్తూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక న్యాయస్థానం ఆదేశించింది. బుధవారంతో వంశీ రిమాండ్ ముగియడంతో జైలు నుంచి వర్చువల్‌గా న్యాయమూర్తి ముందు జైలు అధికారులు హాజరు పర్చారు. ఈ కేసులో వంశీతో పాటు మరో ఐదుగురు జిల్లా జైలులో ఉన్నారు. వంశీని పదిరోజుల పాటు కస్టడీకి ఇవ్వాల్సిందిగా ఇటీవల పోలీసులు పిటిషన్ వేయగా... కోర్టు మూడు రోజులు మాత్రమే కస్టడీకి ఇచ్చింది. విచారణలో వంశీ ఏమాత్రం సహకరించలేదని, అడిగిన ప్రశ్నలకు సమాధానాలు దాట వేస్తున్నారని, మరోసారి 10 రోజుల కస్టడీ కోరుతూ పోలీసులు పిటిషన్ వేశారు. మూడు రోజుల పాటు కస్టడీకి ఇవ్వడం, అనారోగ్య కారణాల నేపథ్యంలో పోలీసులు వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ఇటీవల ఎస్సీ, ఎస్టీ కోర్టు ఆదేశించిన విషయం విదితమే. ఇప్పటికే రెండు సార్లుగా వంశీని రిమాండ్ పొడిగించిన తరుణంలో అతనికి బెయిల్ మంజూరు చేయాలని వాదనలు వినిపించారు. మంగళవారం నాటితో వంశీ రిమాండ్ ముగియడంతో వంశీని జిల్లా జైలు నుంచే వర్చువల్ విధానంలో న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు. ఈనెల 25 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. బుధవారం జరిగే విచారణలో బెయిల్‌పై రెండు వర్గాల వాదనలు విన్న తర్వాత ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక న్యాయస్థానం తీర్పును వెల్లడించే అవకాశం ఉంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.